ఆదివారం 29-1-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 15 సంచిక: 308

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 సంచిక: 308

SUNDAY Special

ఆదివారం 29-1-2023




'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



మానవ నిర్మిత రెటీనా..

రెటీనా దెబ్బతిని చూపు కోల్పోవడం పరిపాటి. అయితే తొందర్లోనే మానవులకు ల్యాబ్‌లో నిర్మించిన రెటీనా అమర్చే కల సాకారం కానుందా?

- వివరాలు 13లో




చాంపియన్ సబలెంకా

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌లో రిబాకినాను ఓడించి బెలారస్ ప్లేయర్ అరైనా సబలెంకా తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను గెలుచుకుంది.

- వివరాలు 14లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అణగారిన వర్గాల సాధికారతే..

సమాజంలో అణగారిన వర్గాల సాధికారతే తమ ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



జోడో యాత్ర పునఃప్రారంభం

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గట్టి భద్రత మధ్య రాహుల్‌గాంధీ జోడో యాత్ర శనివారం పునఃప్రారంభమైంది.

- వివరాలు 6లో▶



అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జన

అమెరికాలో కాల్పుల మోత కొనసాగుతోంది. శనివారం కాలిఫోర్నియా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు మరణించారు.

- వివరాలు 6లో▶



నేలపై పడేసి..చేతులు విరగ్గొట్టి

అమెరికాలోని మెంఫిస్ నగర పోలీసులు నల్ల జాతీయుడిని దారుణంగా హింసించారు. దెబ్బలకు తాళలేక అతను మరణించాడు.

- వివరాలు 6లో▶

• 'కమలం'లో కలకలం

కోవర్టులపై అలర్ట్

అన్ని పార్టీల్లో కేసీఆర్ మనుషులు ఉన్నారన్న ఈటల రాజేందర్ వ్యాఖ్యలపై బీజేపీలో చర్చ

- పార్టీలో చేరేవారి పేర్లు ముందే లీకవడం ఏమిటన్న సందేహాలు
- అలాంటి నేతలెవరని ఆరా
- కోవర్టులను గుర్తించడం, కట్టడి చేయడంపై ఫోకస్
- కొద్ది నెలల్లోనే ఎన్నికలున్నా అభ్యర్థుల కోసం బీజేపీ వెతుకులాట.. చేరికకు ఇతర పార్టీల నేతల తర్జనభర్జన



సాక్షి, హైదరాబాద్‌: అన్ని రాజకీయ పార్టీల్లో సీఎం కేసీఆర్ కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు ఉన్నారన్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ వ్యాఖ్యలు కాషాయదళంలో తీవ్ర కలకలానికి దారితీశాయి. బీజేపీలో నిజంగానే కేసీఆర్ ఇన్‌ఫార్మర్లు ఉన్నారా? ఉంటే అలాంటి నాయకులెవరు? కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు పరోక్షంగా సహకరిస్తున్నది ఎవరు? అసలు ఈటల ఉద్దేశం ఏమిటన్న అంతర్గత చర్చకు కారణమయ్యాయి. ఈ సందేహాలను బలపర్చేలా ఇటీవల ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వెళ్తున్నారంటూ కొందరు నేతల పేర్లు ప్రాథమిక చర్చల సమయంలోనే లీకవడంపై రచ్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే కోవర్టులను గుర్తించి, కట్టడి చేయడంపై బీజేపీ ముఖ్యులు దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది.

చేరికలకు ఇబ్బందిగా లీకులు

రాష్ట్ర కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారంటూ కొందరు నేతలు చేసిన బహిరంగ వ్యాఖ్యలు ఇటీవల ఆ పార్టీలో రచ్చకు కారణమయ్యాయి. పార్టీ వర్గాలు చీలిపోయి, ఆరోపణలు ప్రత్యారోపణల దాకా పరిస్థితి వెళ్లింది. ఇదే సమయంలో బీజేపీ సహా అన్ని పార్టీల్లో కేసీఆర్ కోవర్టులు ఉన్నారంటూ ఈటల రాజేందర్ పేర్కొనడం

మిగతా 2వ పేజీలో ▶

ఈటల ఉద్దేశమేమిటి?

'ఆశించిన మేర బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి ముఖ్య నేతలు ఇంకా బీజేపీలో చేరకపోవడానికి కోవర్టు రాజకీయాలే ప్రధాన కారణమనే అభిప్రాయంతో ఈటల ఉన్నారా? లేక బీజేపీలో కుదురుకునే విషయంలో ఈటల ఇంకా ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా? అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేశారా? ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారు?' అనే చర్చ బీజేపీలో నడుస్తోంది. గతంలో బీఆర్‌ఎస్‌లో నంబర్–2గా ఉంటూ కేసీఆర్ పన్నే రాజకీయ వ్యూహాలు, ఆయా సందర్భాల్లో వ్యవహరించే తీరు తెలిసిన వ్యక్తిగా ఈటలకు బీజేపీ జాతీయ నాయకత్వం తగిన ప్రాధాన్యతే ఇస్తోందని పార్టీవర్గాలు చెప్తున్నాయి. మరి ఆయన రాష్ట్రపార్టీలో ఇంకా పూర్తిగా ఇమడలేకపోతున్నారా? తగిన గౌరవం, ప్రాధాన్యత లభించలేదనే అసంతృప్తితో ఉన్నారా? అన్న చర్చ కూడా సాగుతోంది.



కేంద్రం 'ముందస్తు'కెళ్తే

మేమూ రెడీ

మంత్రి కేటీఆర్ స్పష్టీకరణ

బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచన

కేంద్రం మాటలు, చేతలకు పొంతనలేదని ధ్వజం

లాభాలొస్తున్న సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందని మండిపాటు

ఢిల్లీ బీజేపీ అవార్డులిస్తుంటే గల్లీ బీజేపీ విమర్శిస్తోందని వ్యాఖ్య

నిజామాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధపడితే తెలంగాణలోనూ శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు వెళ్తామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. శనివారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 'సబ్‌కా సాథ్–సబ్‌కా వికాస్' అని మాటలు చెబుతూ చేతల్లో మాత్రం 'సబ్‌కా బక్వాస్' చేస్తోందని దుయ్యబట్టారు. నష్టాలు వస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను జాతీయం చేస్తూ లాభాలు వస్తున్న సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందని ఆయన మండిపడ్డారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు ఇస్తామని చెప్పి చివరకు జౌళి బోర్డును సైతం ఎత్తేసిందని విమర్శించారు.

మోదీకి చివరి అవకాశం...

ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు పరిశ్రమ, పారిశ్రామిక రాయితీలు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వానికి చివరి అవకాశమని కేటీఆర్ పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి నిధులు రాబట్టాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి రూ.3.68 లక్షల కోట్ల ఆదాయం ఇస్తే తిరిగిచ్చింది రూ.1.68 లక్షల కోట్లు మాత్రమేనన్నారు. ప్రతి రూపాయికి తిరిగి ఇస్తోంది

మిగతా 2వ పేజీలో ▶



అత్యంత విషమంగా తారకరత్న ఆరోగ్యం

నారాయణ హృదయాలయలో ఎక్మో ద్వారా చికిత్స

పలువురు కుటుంబ సభ్యుల పరామర్శ

- 11లో

న్యూస్‌రీల్

'ఉపాధి'కి గడ్డు రోజులు?



కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులెలా ఉండబోతున్నాయనేది చర్చనీయాంశమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో భారీగా మార్పులు జరగొచ్చునని, తెలంగాణకు కేటాయింపులు తగ్గొచ్చని నిపుణుల అంచనా.

- వివరాలు 15లో▶

దసరా నాటికి వరంగల్ 'హెల్త్‌సిటీ'



కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తితో వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శరవేగంగా నిర్మిస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. ఈ ఆస్పత్రిలో 35 స్పెషాలిటీ సేవలు అందుతాయన్నారు.

- వివరాలు 15లో▶

ఒక మర్రితో మరిన్ని!



చేవెళ్ల రోడ్డు విస్తరణ నేపథ్యంలో 760 మర్రి చెట్లు ప్రమాదంలో పడ్డాయి. అయితే వాటిని నరికేయకుండా, పెకిలించి వేరేచోట నాటడం (ట్రాన్స్‌లొకేట్) ద్వారా చేవెళ్ల రోడ్డులో ఉన్న మర్రిచెట్లను వేలసంఖ్యలోకి మార్చే ప్రయోగానికి వృక్ష ప్రేమికులు సిద్ధమయ్యారు.

- వివరాలు 2లో▶

ఫ్లోరోసిస్ ఉద్యమకారుడు అంశాల స్వామి కన్నుమూత



ఫ్లోరోసిస్ విముక్త పోరాట యోధుడు అంశాల స్వామి కన్నుమూశారు. ట్రై సైకిల్‌పై తండ్రితో కలిసి ఊరికి వెళ్లి వచ్చి ఇంటి ముందు ర్యాంప్ ఎక్కే క్రమంలో కిందపడిపోయారు. శనివారం ఉదయం రక్తపు వాంతులతో మృతిచెందారు.

- వివరాలు 12లో▶

ఇదండీ సంగతి



మనమంచికే సార్! మిగిలిన హామీలన్నీ నెక్ట్స్ ఎలక్షన్ల మేనిఫెస్టోలో పెడదాం!!

'అవిశ్వాసం' వైపు అసంతృప్తి!

- మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు పావులు కదుపుతున్న ప్రత్యర్థి వర్గాలు
- శనివారం పలు మున్సిపాలిటీల్లో నోటీసులు.. మరికొన్ని చోట్ల అవిశ్వాసాలకు ఏర్పాట్లు
- ఆధిపత్య పోరు, ఎమ్మెల్యేలతో విభేదాలు.. 'రెండున్నరేళ్ల' ఒప్పందం కూడా కారణం..
- మున్సిపాలిటీలకు పాలక మండళ్లు ఏర్పాటై గురువారానికి మూడేళ్లు
- 'అవిశ్వాస గడువు'ను నాలుగేళ్లకు పెంచే చట్ట సవరణ గవర్నర్ వద్ద పెండింగ్



సాక్షి, హైదరాబాద్: ఒకచోట పదవీ కాంక్ష.. మరోచోట సహకరించడం లేదనే అసంతృప్తి.. ఇంకోచోట పదవీకాలం 'పంపకం' ఒప్పందాన్ని మీరారనే ఆగ్రహం. ఇంకా విభేదాలు, ఆధిపత్యపోరు.. రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో మున్సిపాలిటీల్లో 'అవిశ్వాసా'నికి దారితీస్తున్నాయి. ఎన్నికయ్యాక కనీసం మూడేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టవచ్చనేది నిబంధన. గురువారం ఆ గడువు తీరడంతో చాలా చోట్ల అవిశ్వాస తీర్మానాలకు రంగం సిద్ధమవుతోంది. మూడేళ్లు పూర్తయిన తొలిరోజునే 5 మున్సిపాలిటీ ల్లో ఈ మేరకు నోటీసులు ఇచ్చారు.

127 చోట్ల మూడేళ్లు పూర్తి!

రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకుగాను 2020 జనవరిలో 127 చోట్ల ఎన్నికలు జరిగి కొత్త పాలక మండళ్లు ఏర్పాటయ్యాయి. వాటి పదవీకాలం ఈ నెల 27న నాలుగో సంవత్సరంలోకి ప్రవేశించింది. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చట్టం–2019 ప్రకారం పట్టణ పాలక మండళ్లలో మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్/చైర్‌పర్సన్లపై మూడేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి వీల్లేదు. ఇప్పుడా గడువు తీరడంతో పాలకమండళ్లలో ఆధిపత్యం చలాయిస్తున్న కొందరు మేయర్లు, చైర్‌పర్సన్లను పదవి నుంచి దింపేందుకు ప్రత్యర్థివర్గాలు పావులు

మిగతా 2వ పేజీలో ▶

విచారణ పారదర్శకంగా జరగాలని కోరాం

కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి వెల్లడి



- ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి ఒక సాక్షిగా శనివారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. 'సీబీఐ దర్యాప్తు అధికారి అడిగిన ప్రశ్నలకు నాకు తెలిసిన మేర సమాధానాలు చెప్పాను. అవసరమైతే పిలుస్తామన్నారు. పిలిస్తే మళ్లీ విచారణకు హాజరవుతా' అని విచారణానంతరం అవినాశ్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 11లో▶

స్టార్టప్‌లకు అంతర్జాతీయ నెట్‌వర్క్

జీ–20 స్టార్టప్ 20 సమావేశాల్లో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్



"ఆర్థిక మాంద్యం మొదలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన వరకూ ప్రపంచస్థాయి సమస్యల పరిష్కారానికి స్టార్టప్‌లు అవసరం. స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం ఏర్పాటు, అందరికీ అవకాశాలు, మద్దతు లభించేలా చేయడం జీ–20 దేశాల ఉమ్మడి బాధ్యత."

– పీయూష్ గోయెల్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి

- వివరాలు 12లో▶

సుఖోయ్, మిరాజ్ ఢీ..

పైలట్ మృతి.. మరో ఇద్దరికి గాయాలు

మధ్యప్రదేశ్‌లో ఘటన..

- మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కు సమీపంలో శనివారం ఉదయం భారత వైమానిక దళా(ఐఏఎఫ్)నికి చెందిన సుఖోయ్ 30ఎంకేఐ, మిరాజ్–2000 యుద్ధ విమానాలు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో పైలట్ మృతి చెందారు. మృతిచెందిన వింగ్ కమాండర్ శరీర భాగాలు పహార్‌గఢ్ ప్రాంతంలో లభ్యమైనట్లు అధికారులు తెలిపారు.



- వివరాలు 6లో

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ కవితతో నటుడు శరత్‌కుమార్ భేటీ



సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు, ఆల్ ఇండియా సమతావ మక్కల్ కచ్చి అధ్యక్షుడు శరత్ కుమార్ శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని కవిత నివాసంలో జరిగిన ఈ భేటీలో దేశ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపన ఉద్దేశాలు, లక్ష్యాలు, ఎజెండా తదితర అంశాలపై ఇరువురూ మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల విస్తరణ ప్రణాళికలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలు సీఎం కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కవిత, పలువురు మంత్రులతో సమావేశమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కవితతో శరత్‌కుమార్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. భేటీ అనంతరం శరత్‌కుమార్‌కు కవిత పోచంపల్లి శాలువాతో పాటు జ్ఞాపికను అందజేశారు.

స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులను సరిదిద్దాలి..

స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులను సరిదిద్దేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సెబీ చీఫ్ మధాబి పూరిబుచ్ చర్యలు తీసుకోవాలని ట్విట్టర్ ద్వారా కవిత డిమాండ్ చేశారు. ప్రముఖ వాణిజ్య సంస్థ అదానీ గ్రూప్‌పై ఇటీవలి అంతర్జాతీయ నివేదిక తర్వాత ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర కంపెనీల షేర్లలో తగ్గుదల, ఒడిదుడుకులు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్యలపై కేసీఆర్ అబద్ధాలు

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల కోసం కేసీఆర్ రైతు ఆత్మహత్యలపైనా అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులు, ఆత్మహత్యల తెలంగాణగా మార్చిన కేసీఆర్.. రైతుల గురించి మాట్లాడే అర్హతే కోల్పోయారని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రులు రైతుల ఆత్మహత్యల వివరాలు వెల్లడించినా..అవి కేసీఆర్ కంటికి కనిపించడం లేదా? అని ఆమె నిలదీశారు. ఎన్‌సీఆర్‌బీ ఆత్మహత్యల గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 5,987 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ఇంకా రికార్డులకెక్కని ఆత్మహత్యలు మరో మూడు వేల వరకు ఉన్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి రైతు బాంధవుడిగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రైతు రుణమాఫీకి రూ. 20 వేల కోట్లు కేటాయించండి

సీఎం కేసీఆర్‌కు ఎంపీ ఉత్తమ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: పలు సంక్షేమ పథకాలకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించే విధంగా ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. 'రైతులు, మహిళలు, విద్యార్థులకిచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడం ఆందోళన కలిగిస్తోంది. 2023–24 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. పెండింగ్‌లో ఉన్న పథకాల బకాయిలను చెల్లించేందుకు తగినన్ని నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించాలి' అని ఆ లేఖలో ఉత్తమ్ కోరారు. రైతు రుణమాఫీకి రూ.20వేల కోట్లు, స్వయం సహాయక సంఘాల పాత బకాయిలకు రూ.4వేల కోట్లు, ఫీజుల పథకానికి రూ. 3,270 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కొమ్మలను గుర్తించి వాటిని తల్లి చెట్టు నుంచి వేరు చేసి వేరేచోట నాటే ప్రణాళిక

చేవెళ్ల రోడ్డు విస్తరణతో 760 మర్రి చెట్లకు గండం

ట్రాన్స్‌లొకేషన్‌కు కసరత్తు.. ఆసక్తికర ప్రయోగానికి సిద్ధం

ఒక చెట్టు నుంచి 15 వరకు చెట్లు సృష్టించేందుకు వటా ఫౌండేషన్ యత్నం

మర్రి సహజసిద్ధ లక్షణం ఆధారంగా చేసుకుని చెట్ల విస్తరణకు ప్రయోగం



చేవెళ్ల రోడ్డులో మర్రి చెట్లు..

ఒక మర్రితో మరిన్ని..!

అదో జాతీయ రహదారి.. రోడ్డుకు ఇరువైపులా 760 మర్రి వృక్షాలున్నాయి.. ఇప్పుడు రోడ్డు విస్తరణతో వాటిని తొలగించాల్సిన పరిస్థితి.. వాటిని ట్రాన్స్‌లొకేట్ చేసేందుకు కసరత్తు జరుగుతోంది.. అయితే ఆ కసరత్తు తర్వాత వాటి సంఖ్య కనీసం మూడు వేలు కాబోతోంది. ఎలా అంటే.. అదో ఆసక్తికర ప్రయోగం. సఫలమైతే అద్భుతం. ఇందుకు వేదిక అవుతున్న రోడ్డు హైదరాబాద్ శివారులోని 'అప్పా'జంక్షన్ నుంచి చేవెళ్ల మీదుగా కొనసాగుతున్న బీజాపూర్ హైవే.

సాక్షి, హైదరాబాద్: పట్నం.. 3,4 దశాబ్దాల క్రితం వరకు హైదరాబాద్‌ను తెలంగాణ పల్లెలు పిలుచుకునే పేరు. ఈ నగరానికి దారితీసే ప్రధాన రహదారులన్నీ మర్రి చెట్లతో పందిరి వేసినట్టు కనిపించేవి. రాజీవ్ రహదారి, నిజామాబాద్ రోడ్డు, ఓల్డ్ బొంబాయి హైవే, బెంగళూరు రోడ్డు, విజయవాడ హైవే, సాగర్ రోడ్డు, చేవెళ్ల రహదారి.. ఇలా అన్ని రోడ్లూ ఇరువైపులా ఊడలు దిగిన మర్రి వృక్షాలతో అద్భుతంగా కనిపించేవి. దారి వెంట వెళ్లేవారికి చల్లని నీడనిచ్చేవి. కానీ అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ ఆ మర్రి చెట్ల అంతానికి కారణమైంది. ఒక్క చేవెళ్ల రోడ్డు తప్ప అన్ని ప్రధాన రహదారుల్లో ఆ మహా వృక్షాలు మాయమయ్యాయి. ఇప్పుడు ఆ చేవెళ్ల రోడ్డును కూడా విస్తరించేందుకు సిద్ధమవుతుండటంతో.. ఎన్‌హెచ్ఏఐ పరిధిలోని అప్పా కూడలి నుంచి మన్నెగూడ కూడలి వరకు 41 కి.మీ. పరిధిలో ఉన్న 760 మర్రి చెట్లు ప్రమాదంలో పడ్డాయి. అయితే ఆ చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేయకుండా, ట్రాన్స్‌లొకేట్ (పెకిలించి వేరే చోట నాటడం) చేయడం ద్వారా రక్షించాలని వృక్ష ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ సంస్థ ముందుకొచ్చి, వాటిని ట్రాన్స్‌లొకేట్ చేయటమే కాకుండా.. ఆ 760 చెట్లను దాదాపు ఐదు వేల వరకు పెంచనున్నట్టు ప్రకటించింది. మర్రికి స్వతహాగా ఉండే లక్షణాన్ని ఇందుకోసం ఉపయోగించుకోనుంది.

ఊడ చెప్పిన జాడ..

పిల్లల మర్రి.. మహబూబ్‌నగర్ పట్టణ శివారులో దాదాపు మూడెకరాల్లో విస్తరించిన మర్రి వనం. 500–750 ఏళ్ల వయసు దాని సొంతమని నిపుణులు అంటున్నారు. ఓ చెట్టు ఊడలు భూమిలో నాటుకుని మరో చెట్టుగా ఎదిగి.. అలా ఎకరాల్లో విస్తరించింది. కోల్‌కతాలోని ఆచార్య జగదీశ్ చంద్రబోస్ ఇండియన్ బొటానికల్ గార్డెన్‌లో కూడా ఇంతే. దాదాపు 250 ఏళ్ల వయసున్న మర్రి.. పిల్లలుగా విస్తరించి ఓ చిన్నపాటి అడవిని తలపిస్తోంది. ఇది మర్రికి ఉన్న సహజసిద్ధ ప్రత్యేక లక్షణం. ఇప్పుడు దీన్నే ఆసరాగా చేసుకుని ఒక చెట్టు నుంచి మరి కొన్ని చెట్లను సృష్టించేందుకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'వటా ఫౌండేషన్'సిద్ధమవుతోంది.

కొమ్మలే మరో చెట్టుగా..

మర్రిచెట్టు కొమ్మలు చాలా దూరం వరకు ఎదుగుతాయి. వాటికి ఊతంగా నేలకు దిగే ఊడలు మరో మొదలుగా మారతాయి. అలా విస్తరిస్తూ పోతాయి. ఇప్పుడు చేవెళ్ల రోడ్డుపై ఉన్న వృక్షాల్లో అలాంటి కొమ్మలను గుర్తించి వాటిని తల్లి చెట్టు నుంచి వేరు చేసి మరో చోట పాతుతారు. ఆ కొమ్మ నుంచి వేర్లు ఎదిగేవరకు పోషణ చేపట్టి దాన్ని మరో చెట్టులా మారుస్తారు. అలా ఒక్కో చెట్టుకు ఉన్న అలాంటి కొమ్మల ఆధారంగా ఐదు నుంచి పదిపదిహేను వరకు విడదీస్తారు. ఇప్పటికే నేలను తాకి ఎదుగుతున్న ఊడలుంటే.. వాటిని కూడా తల్లి చెట్టు నుంచి వేరు చేసి మరో చెట్టుగా పాతుతారు.

ఆ ఆలోచన అప్పటిది..

రెండేళ్ల కింద గోవాలో వందేళ్ల వయసున్న మర్రి వృక్షం కూలిపోతే.. దాన్ని రక్షించాలంటూ స్థానికులు ఈ ఫౌండేషన్‌ను సంప్రదించారు. అక్కడికి వెళ్లిన దాని నిర్వాహకుడు ఉదయ్‌కృష్ణ.. దానికి వేళ్లూనుకున్న ఊడల కొమ్మలు గుర్తించి స్థానికుల సాయంతో జాగ్రత్తగా వేరు చేసి విడివిడిగా నాటితే అవి కొత్త చెట్లుగా ఎదగటం ప్రారంభించాయి. కొందరు స్థానికులు డ్రమ్ముల్లో మట్టి నింపి చిన్నచిన్న కొమ్మలను నాటి ఎదిగేలా చేశారు. అప్పటి నుంచే ఇలా ఒక చెట్టు నుంచి మరిన్ని చెట్లు సృష్టించొచ్చన్న ఆలోచన ఆ సంస్థలో ప్రారంభమైంది. గతేడాది సిరిసిల్లలో కూడా ఓ మర్రి వృక్షం పడిపోతే, దాన్ని ట్రాన్స్‌లొకేట్ చేసే క్రమంలో మూడు చోట్ల వేరువేరు కొమ్మలు నాటారు. అందులో రెండు వేళ్లూనుకున్నాయని ఉదయ్‌కృష్ణ తెలిపారు. ఈ క్రమంలోనే చేవెళ్ల రోడ్డులో ఉన్న చెట్లను వేల సంఖ్యలోకి మార్చే ప్రయోగానికి ఆయన సిద్ధమయ్యారు.



''అప్పట్లో రోడ్లకిరువైపులా మర్రి చెట్లు ఉండే పద్ధతి కనుమరుగైంది. కానీ చేవెళ్ల రోడ్డుకు ఇంకా ఆ శోభ ఉంది. దాన్ని విస్తరించనుండటంతో అవి కూడా మాయం కానున్నాయి. కానీ అలా కానీయకూడదు. వాటిని కాపాడాలి. కొందరు ఔత్సాహికులు వాటి ట్రాన్స్‌లొకేషన్‌కు వీలుగా స్థలాన్ని ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో తల్లి చెట్టు నుంచి పిల్ల చెట్లను వేరు చేసి వేరువేరు ప్రాంతాల్లో నాటి ఆ వృక్ష సంపదను కాపాడాలన్నది ఆలోచన. చేవెళ్ల రోడ్డుపై వందల సంఖ్యలో ఉన్న మర్రిని వేల సంఖ్యలోకి మార్చి.. ఆ చెట్ల వరసకు గుర్తుగా రాష్ట్రమంతటా వాటిని నాటి పెంచాలన్నది ఆలోచన. భావితరాలకు ఇది గొప్ప కానుక అవుతుంది''

చేవెళ్ల మర్రి రాష్ట్రం అంతటా..

– ఉదయ్‌కృష్ణ, వటా ఫౌండేషన్ నిర్వాహకులు

కేంద్రం 'ముందస్తు'కెళ్తే మేమూ రెడీ

▶ మొదటి పేజీ తరువాయి

46 పైసలు మాత్రమేనన్నారు. ఇది అబద్ధమైతే తాను రాజీనామా చేస్తానన్నారు.

ఎంపీ అర్వింద్.. సభ్యతతో మాట్లాడు..

రాష్ట్ర బీజేపీ నేతలు మంత్రులను తిట్టడం నిత్యం పనిగా పెట్టుకున్నారని... వారికన్నా తాము ఎక్కువగా మాట్లాడగలమని మంత్రి కేటీఆర్ చెప్పారు. ముఖ్యంగా ఎంపీ అర్వింద్ ఇకనైనా సభ్యతతో మాట్లాడాలని హితవు పలికారు. 'డి.శ్రీనివాస్ అంటే మా అందరికీ గౌరవం ఉంది. పెద్దాయన కొడుకువని ఊరుకుంటున్నాం. ఇకపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం' అని కేటీఆర్ హెచ్చరించారు. పల్లెప్రగతి, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో దేశంలో టాప్–20లో 19 గ్రామాలను తెలంగాణ నుంచి ఎంపిక చేసి కేంద్రం అవార్డులు ఇచ్చిందని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. కానీ గల్లీలో ఉన్న బీజేపీ నాయకులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. కాగా, మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు విడివిడిగా అడ్డగించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

రూ. 50 కోట్ల అంచనాతో 'కళాభారతి'కి శంకుస్థాపన

సుభాష్‌నగర్: మంత్రి కేటీఆర్ నిజామాబాద్‌లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంఠేశ్వర్ కమాన్ వద్ద రూ. 22 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం పాత కలెక్టరేట్ వద్ద రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఇందూరు కళాభారతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, బాలలు, అన్ని వర్గాల ప్రజలకు అపురూపమైన కానుక అందించేలా ఇందూరు కళాభారతి నిర్మాణానికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.



ఐదు విప్లవాలు సృష్టించాం: కేటీఆర్

టెక్నాలజీ ఫర్ ఇంపాక్ట్ అండ్ స్కేల్ పేరుతో కాకతీయ శాండ్‌బాక్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణలో జీఎస్డీపీతోపాటు వివిధ రంగాల్లో ఎలా అభివృద్ధి సాధించామో వివరించారు. మాడరేటర్ దేశ్‌పాండే సంధించిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఆ తర్వాత కాకతీయ శాండ్‌బాక్స్ ఆధ్వర్యంలో రైతుకు అందుతున్న సేవల గురించి ఐదు జిల్లాల రైతులతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణలో రెండో హరిత విప్లవం (పెరిగిన పంటల సాగు విస్తీర్ణంపై), నీలి విప్లవం (చేపల పెంపకంపై), గులాబీ విప్లవం (గొర్రెల పంపిణీ, పశు సంపదపై), శ్వేత విప్లవం (డెయిరీల లాభాల బాటపై), పసుపు విప్లవం (ఆయిల్‌పామ్ సాగు పెంపుపై) సృష్టించామన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలతో 45 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగిందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో గతంలో 26వ స్థానంలో ఉన్న తెలంగాణ... ప్రస్తుతం 3వ స్థానానికి ఎదగడం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 10 వేల ఎకరాల్లో 16 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

రాష్ట్రంలో వైద్యం 'కుదేలు'

- ఆరోగ్యశ్రీ నుంచి సర్కారు దవాఖానాల వరకు అంతా నిర్లక్ష్యమే
- బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ రెండో చార్జిషీట్
- 'వైద్యం.. దైన్యం' పేరుతో 16 అభియోగాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి. చిత్రంలో నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ రెండో చార్జిషీట్ వేసింది. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా రెండు నెలలపాటు ప్రతివారం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు వేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ తాజాగా వైద్యరంగంపై చార్జిషీట్ వేసింది. శనివారం గాంధీభవన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర సమన్వయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యరంగంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై 16 అంశాలతో కూడిన అభియోగ పత్రాన్ని విడుదల చేశారు. కేసీఆర్ సర్కార్ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగం కుదేలైందని, మండలస్థాయిలో 30 పడకల దవాఖానా ఏర్పాటు హామీ, డాక్టర్లు ఊర్లోనే నివసించాలన్న నిబంధన ఎత్తివేత, బడ్జెట్‌లో 4.4 శాతం మాత్రమే నిధుల కేటాయింపు, ప్రభుత్వ ఆసుపత్రులకు నిధులలేమి, సిబ్బంది కొరత, రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్న వైనం, జిల్లాకేంద్రాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయకపోవడం, అత్యవసర సేవల నిర్వీర్యం, సమగ్ర వైద్య విధానం రూపకల్పనలో వైఫల్యం, పల్లెల్లో అరకొర వైద్యం, ఆరోగ్యశ్రీ, జర్నలిస్టుల హెల్త్‌కార్డుల సేవలకు ఆటంకాలు, కరోనా కట్టడిలో విఫలం, కరోనా బూచితో కార్పొరేట్లకు దోచిపెట్టడం, గ్రేటర్ హైదరాబాద్‌లో పడకేసిన వైద్యం అనే అంశాలతో ఈ అభియోగపత్రాన్ని రూపొందించింది.

ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు: ఏలేటి

కొత్త సచివాలయం, జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు, క్యాంపు ఆఫీస్‌ల మీద ఉన్న ప్రేమ సీఎం కేసీఆర్‌కు ప్రజారోగ్యంపై ఎందుకు లేదని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆరోగ్య తెలంగాణ చేస్తామని 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చిన కేసీఆర్ బడ్జెట్‌లో 8 శాతం మేర కేటాయించాల్సిన నిధులను కేవలం 4.4 శాతానికి పరిమితం చేశారన్నారు. కరోనా సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు ప్రభుత్వాసుపత్రులపై నమ్మకం కోల్పోయేలా చేశారని, ముఖ్యమంత్రి తన సాధారణ పరీక్షలకు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం ఆయనకే చెల్లిందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్వాయి స్రవంతి, నిరంజన్, మదన్‌మోహన్, కైలాశ్, భరత్‌చౌహాన్ పాల్గొన్నారు.

నాందేడ్ సభ ఏర్పాట్లు షురూ

గురుద్వారా మైదానంలో సభా వేదిక వద్ద భూమి పూజ



సభావేదిక వద్ద భూమి పూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్ఎస్ తమ రెండో బహిరంగ సభను మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేసింది. వచ్చే నెల 5న జరిగే సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ నేతలు నాందేడ్‌లో మకాం వేసి సభ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటికే పలువురు స్థానిక నేతలు, రైతు సంఘాల మద్దతు కూడగట్టిన బీఆర్ఎస్ నేతలు 5న జరిగే సభకు జన సమీకరణపై దృష్టి సారించారు. ఫిబ్రవరి 5న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక విమానంలో నాందేడ్‌కు చేరుకొని అక్కడి 'తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ అబ్చల్‌నగర్ సాహిబ్' గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటలకు గురుద్వారా మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మరికొందరు కీలక నేతలు ఈ సభ వేదికగా బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సభను విజయవంతం చేసేందుకు కొద్దిరోజులుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, హన్మంత్ షిండే, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు నాందేడ్‌లో మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ బహిరంగ సభా వేదిక వద్ద శనివారం భూమి పూజ నిర్వహించారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ పథకాల కోసమే: ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశవ్యాప్తంగా అందించేందుకే బీఆర్ఎస్‌ను కేసీఆర్ ప్రారంభించారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నాందేడ్ సభ సన్నాహాల్లో భాగంగా శనివారం నాందేడ్ జిల్లాలోని అప్పారావుపేట్, షివిని, ఇస్లాపూర్, హిమాయత్ నగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని, పింఛన్లు, ఇళ్లు, ఇతర వసతులు లేవని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్రిక్తంగా బీజేవైఎం డీజీపీ ఆఫీస్ ముట్టడి

- బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాశ్, ఇతర నేతలకు గాయాలు
- ఆందోళన చేస్తే అమానుషంగా వ్యవహరిస్తారా?: బండి సంజయ్



బీజేవైఎం నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) చేపట్టిన డీజీపీ కార్యాలయ ముట్టడి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేవైఎం నాయకులు 'చలో డీజీపీ' ముట్టడిలో భాగంగా డీజీపీ కార్యాలయం ప్రధాన గేటు దూకి లోపలికి ప్రవేశించారు. కొంతమంది కార్యకర్తలు లోపలికి చొచ్చుకుని వెళ్లడంతో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని బయటకు ఈడ్చేసి లాఠీలు ఝుళిపించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాశ్ స్పృహ తప్పి పడిపోయారు. బీజేవైఎం కార్యకర్తలను, నాయకులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి వ్యాన్‌లో పడేశారు. తోపులాటలో భాను ప్రకాశ్‌కు గాయాలవడంతో ఆయన్ను, ఇతర నాయకులను గ్లోబెల్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు భానుప్రకాశ్‌ను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి వైద్య చికిత్స అందించారు. ఈ ఘటనలో అరుణ్‌కుమార్, పుల్లెల శివ సహా పలువురికి గాయాలయ్యాయి. కాగా, కరీంనగర్ పర్యటనలో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బీజేవైఎం నాయకులకు ఫోన్ చేసి భానుప్రకాశ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించడానికి చేతగాని కేసీఆర్ సర్కార్ ప్రశ్నించే వాళ్లను అణచి వేయడానికి యత్నిస్తోందన్నారు.

'అవిశ్వాసం' వైపు అసంతృప్తి!

▶ మొదటి పేజీ తరువాయి

కదుపుతున్నాయి. రాష్ట్రంలోని దాదాపు సగం మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి ఉందని సమాచారం.

ఇంతకుముందే మూడు చోట్ల..

జనగాం మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 11 మంది కౌన్సిలర్లు బుధవారం రాత్రి నుంచే క్యాంపులోకి వెళ్లిపోయారు. మరికొన్ని మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన సభ్యులు క్యాంపు రాజకీయాలకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో పరస్పర ఒప్పందంలో భాగంగా అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఇవ్వకుండా ప్రస్తుత చైర్‌పర్సన్ మల్లెల రాజశ్రీ బుధవారమే రాజీనామా చేయగా.. కన్నె ప్రేమలత కొత్త చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పెరిగిన 'అవిశ్వాస' యత్నాలు

హైదరాబాద్ శివార్లలోని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ మేకల కావ్యను గద్దె దించేందుకు 20 మంది కార్పొరేటర్లు శనివారం అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. 28 మంది సభ్యులున్న ఈ కార్పొరేషన్‌లో ఒక వార్డు ఖాళీగా ఉంది. ఇక్కడ మేయర్ పదవి ఆశిస్తున్న నిహారిక గౌడ్, శాంతిగౌడ్‌లు ఇద్దరు ఉమ్మడిగానే అవిశ్వాసానికి సభ్యులను కూడగట్టారు.

- వికారాబాద్ జిల్లాలో రెండున్నరేళ్ల ఒప్పందాన్ని పక్కనబెట్టిన వికారాబాద్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి శనివారం నోటీసులు ఇచ్చారు. ● వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్‌పై అవిశ్వాసానికి స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలోనే 19 మంది కౌన్సిలర్లు సమావేశమై సంతకం పెట్టారు. కలెక్టర్‌కు అవిశ్వాస పత్రం అందజేశారు. ● తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్‌పై వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింహులు, అధికార పార్టీ కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్, ఎంఐఎం పార్టీలకు చెందిన కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందించారు. ● కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 మంది సభ్యుల్లో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 12 మంది అసమ్మతి సభ్యులు శనివారం సమావేశమయ్యారు. 8 మంది సీపీఐ సభ్యులు, ఇద్దరు ఇండిపెండెంట్లు, ఓ కాంగ్రెస్ సభ్యుడి మద్దతుతో అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ● రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణలపై అవిశ్వాసం కోసం శనివారం 15మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్, పురపాలక సంఘం కమీషనర్లకు నోటీసులు ఇచ్చారు. ● ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై, జనగాంలో పోకల జమునపై అవిశ్వాసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

'నాలుగేళ్ల'కు లభించని గవర్నర్ ఆమోదం

గత సెప్టెంబర్‌లో జరిగిన శాసనసభ సమావేశాల్లో మేయర్/చైర్‌పర్సన్లపై అవిశ్వాసం పెట్టే గడువును నాలుగేళ్లకు పెంచుతూ బిల్లును ఆమోదించారు. గవర్నర్ తమిళిసై ఆమోదముద్ర పడితే ఈ చట్ట సవరణ అమల్లోకి వచ్చేది. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య అగాథం పెరిగిన నేపథ్యంలో బిల్లుకు మోక్షం లభించలేదు.

అంతర్గత విభేదాలతోనే..

రాష్ట్రంలో చాలా వరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికార బీఆర్ఎస్‌కు చెందిన నేతలే మేయర్లు, చైర్‌పర్సన్లుగా కొనసాగుతున్నారు. ఈ మూడేళ్లలో కొన్నిచోట్ల ఎమ్మెల్యేలకు, మున్సిపల్ చైర్‌పర్సన్లకు మధ్య విభేదాలు తలెత్తాయి. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి.

మరికొన్ని మున్సిపాలిటీల్లో..

- దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ఆలంపల్లి నరసింహ, హనుమంతు వెంకటేశ్ గౌడ్ పోటీపడగా.. చివరికి రెండున్నరేళ్ల చొప్పున ఒప్పందం జరిగింది. తొలుత ఆలంపల్లి నరసింహ చైర్మన్‌గా కొనసాగితే.. తదుపరి హనుమంతు వెంకటేశ్‌గౌడ్ కొనసాగాలి. కానీ ఇది జరగలేదు. దీంతో వెంకటేశ్‌గౌడ్ అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది.
- యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో ఎలాంటి ఒప్పందం లేదు. అయినా ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్‌కు చైర్‌పర్సన్ పదవి లభిస్తుందన్న ప్రచారం సాగుతోంది. ఈ మేరకు ఒప్పందంతోనే ఆమె బీఆర్ఎస్‌లో చేరారని అంటున్నారు. మరి ప్రస్తుత చైర్‌పర్సన్ సుధా హేమేందర్ గౌడ్‌ను కొనసాగిస్తారా, వాణికి అవకాశం లభిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.
- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రస్తుత చైర్మన్ సద్దాం హుస్సేన్ తొలి మూడేళ్లు కొనసాగితే.. మిగతా రెండేళ్లు ప్రస్తుత వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్ పీఠమెక్కాలనేది ఒప్పందం. ఆ ఒప్పందం అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ఇక్కడా అవిశ్వాసం తెరపైకి రావచ్చని ప్రచారం జరుగుతోంది.
- ఆదిభట్ల, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో కూడా అవిశ్వాస పరీక్షలకు అసంతృప్త నేతలు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. బోడుప్పల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడెం, పోచారం, ఘట్‌కేసర్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ల తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నట్టు చెప్తున్నారు.
- బండ్లగూడ కార్పొరేషన్‌లో మేయర్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్ల రెండున్నరేళ్ల పదవీ ఒప్పందాలు కూడా అమల్లోకి రాలేదు. ఆయాచోట్ల అవిశ్వాసం దిశగా ప్రత్యర్థులు అడుగులు వేస్తున్నారు.

కోవర్టులపై అలర్ట్

▶ మొదటి పేజీ తరువాయి

చర్చనీయాంశంగా మారింది. అసలు ఈటల ఇలాంటి వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చిందనే దాని నుంచి.. బీజేపీలో ఎవరు కోవర్టులనే దాకా ఆ పార్టీ నాయకుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు ఇటీవల మీడియా ప్రతినిధులతో భేటీ సందర్భంగా ఆఫ్ ది రికార్డ్‌గా ఈటల చేసిన వ్యాఖ్యలపైనా చర్చజరుగుతోంది. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర పార్టీ చేరికల కమిటీ కన్వీనర్‌గానూ ఈటల వ్యవహరిస్తున్నారు. అలాంటిది తానే స్వయంగా కోవర్టుల ఆరోపణలు చేయడం, బీజేపీలో చేరబోయే ఇతర పార్టీల నేతల పేర్లు ముందుగానే లీక్ కావడంతో వారు వెనుకడుగు వేస్తున్నారని వ్యాఖ్యానించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. నిజానికి ఏ రాజకీయ పార్టీలోనూ చేరికల కోసం ప్రత్యేకంగా కమిటీ లేదని.. బీజేపీలో కమిటీ ఏర్పాటు చేసినా చేరబోయే నేతల పేర్లు ప్రాథమిక దశలోనే ఎలా లీక్ అవుతున్నాయని పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కోవర్టుల కట్టడి ఎలా?

ఒకవేళ బీజేపీలో కేసీఆర్ కోవర్టులు, ఇన్‌ఫార్మర్లు ఉంటే వారు ఏ స్థాయిలో ఉన్నారు? వారిని ఎలా గుర్తించాలనే చర్చ కూడా సాగుతోంది. వారిని ఆధారాలతో గుర్తించడంతోపాటు అవసరమైతే పక్కన పెట్టడం ఎలాగన్న ఆలోచనలో పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు. అయితే ఈ కోవర్టుల అంశం మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనే తెరపైకి వచ్చింది. ఉప ఎన్నికను జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళ్లాయి. అధికార పార్టీ అభ్యర్థిని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓడిస్తే.. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మరింత సానుకూలత వస్తుందని, బీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయని ఆశించాయి. ఇక ఈ ఉప ఎన్నికలో బీజేపీ సర్వశక్తులూ ఒడ్డినా.. రాజగోపాల్‌రెడ్డి ఓటమి చెందడానికి కేసీఆర్ కోవర్టులే కారణమనే ఆరోపణలు వచ్చాయి. మునుగోడు పోలింగ్‌కు కేవలం కొన్నిరోజుల ముందు.. కొందరు నేతలు తిరిగి కేసీఆర్, కేటీఆర్‌ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం ఆ ఆరోపణలకు బలం చేకూర్చింది.

ఇంకా అభ్యర్థుల కోసమే..!

బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 10 నెలలు కూడా లేదు. అయినా బీజేపీకి మెజారిటీ సీట్లలో బలమైన అభ్యర్థుల కోసం వెతుకులాట తప్పడం లేదని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటివరకు వేసుకున్న అంచనాల ప్రకారం.. 30 చోట్ల మాత్రమే బలమైన అభ్యర్థులు, మరికొన్నిచోట్ల ఫర్వాలేదనే స్థాయిలో అభ్యర్థులు ఉన్నారని.. చాలాచోట్ల గట్టి అభ్యర్థులను వెతకాల్సిన పరిస్థితి ఉందని అంటున్నాయి. బీజేపీలో టికెట్ కేటాయింపుపై భరోసా, ఇతర అంశాలపై స్పష్టత రానందునే.. నేతల చేరికలు ముందుకు పడటం లేదని పేర్కొంటున్నాయి.

నకిలీ జామీన్ కేరాఫ్ 'చెన్నాపూర్'

- డ్రగ్స్, పలు కేసుల్లో నిందితులకు ఫోర్జరీ పత్రాలు
- న్యాయమూర్తికి అనుమానం రావడంతో విచారణకు ఆదేశాలు

శివ్వంపేట(నర్సాపూర్): నకిలీ జామీన్ పత్రాలకు ఓ మారుమూల గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అందులో డ్రగ్స్ కేసు నిందితులకు కూడా వీటిని సమర్పించడం గమనార్హం. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చెన్నాపూర్ పంచాయతీ నుంచి మూడేళ్లుగా నకిలీ జామీన్‌పత్రాలు ఇస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరు నెలల క్రితం మేడ్చల్ కోర్టుకు డ్రగ్స్ కేసు నిందితుల కోసం చెన్నాపూర్ పంచాయతీకి సంబంధించి ఇంటి పన్నుల రసీదుతోపాటు కార్యదర్శి సంతకంతో కూడిన జామీన్‌పత్రాలు సమర్పించారు. ఈ పంచాయతీ నుంచి అధికంగా గుర్తు తెలియని నిందితులకు జామీన్‌పత్రాలు ఇస్తున్న విషయాన్ని గుర్తించిన న్యాయమూర్తి దీనిపై విచారణ చేపట్టాలని మేడ్చల్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఆ ఆ పత్రాల్లోని సంతకాలు ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించి న్యాయమూర్తికి నివేదిక అందించారు.

బాలానగర్ కోర్టుకు కూడా...

మూడురోజుల క్రితం బాలానగర్ కోర్టుకు గుర్తు తెలియని నిందితుల కోసం ఈ గ్రామం నుంచి జామీన్‌పత్రాలు వచ్చాయి. ఆ కోర్టుకు కూడా పదే పదే ఈ గ్రామం నుంచి ఈ పత్రాలు రావడంతో ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించాల్సిందిగా బాలానగర్ పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. ఏడాది క్రితం ముంబై కోర్టులో సైతం ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు నిందితులకు చెన్నాపూర్ నుంచి జామీన్‌పత్రాలు ఇవ్వడంతో ఎన్ఐఏ అధికారులు ఈ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. కాగా, శుక్రవారం రాత్రి ఈ వ్యవహారంపై గ్రామానికి చెందిన సతీశ్, సర్పంచ్ భర్త భిక్షపతి మధ్య గొడవ జరిగింది. ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నకిలీపత్రాల బాగోతం బట్టబయలైంది. దీంతో ఈ విషయం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

41 మంది డీఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 41 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్–సివిల్ (డీఎస్పీ)లను బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) సిఫార్సుల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు, ఈ పోస్టింగ్‌లు వెంటనే అమల్లోకి వస్తాయని శనివారం డీజీపీ ఆదేశాలు జారీచేశారు. ఇటీవలే పెద్దసంఖ్యలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా తాజాగా రాష్ట్రవ్యాప్తంగా 41 మంది డీఎస్పీలను బదిలీ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పోలీసు అధికారుల బదిలీలు చోటుచేసుకుంటున్నాయి. ఇక వచ్చేనెల 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు, రాష్ట్రబడ్జెట్ సమర్పణ, వచ్చేనెల 17న నూతన సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్న సంగతి తెలిసిందే. అందువల్ల ఆ తర్వాతే పెద్ద ఎత్తున పలు స్థాయిల్లోని ఐఏఎస్ అధికారుల బదిలీలు కూడా జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

సొంతింటికి సరైన వేదిక

ఒకేచోట కొలువు దీరిన ప్రధాన నిర్మాణ సంస్థలు

ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాల సమస్త సమాచారం ● ఘనంగా 'సాక్షి' 14వ ప్రాపర్టీ షో ప్రారంభం ● కొనుగోలుదారులకు ఇదో మంచి అవకాశం: సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్. చిత్రంలో క్రెడాయ్ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ గుమ్మి రాంరెడ్డి, సాక్షి అడ్వ ర్టయిజింగ్ విభాగం సీజీఎం కమల్ కిశోర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేని ప్రాపర్టీని వెతకడం అంటే మామూలు విషయం కాదు. అందుకే కొనుగోలుదారుల పనిని సులువు చేసేందుకు 'సాక్షి' ప్రాపర్టీ షోను ఏర్పాటు చేసింది. సొంతింటి కొనుగోలుకు ఇది సరైన వేదికని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శనివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో 'సాక్షి' 14వ స్థిరాస్తి ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి చెందిన ప్రధాన నిర్మాణ సంస్థలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నాయని, దీంతో సందర్శకులు ఒకేచోట నగరం నలుమూలలా జరిగే ప్రాజెక్టులు, ఓపెన్ ప్లాట్ వెంచర్ల సమస్త వివరాలు తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా కొనుగోలుదారులు అక్కడికక్కడే ప్రాపర్టీలను ఎంచుకోవచ్చని, ఇది మంచి అవకాశమని తెలిపారు. అవసరమైతే అక్కడికక్కడే గృహరుణ సేవలు అందించేందుకు పలు బ్యాంకులు కూడా స్టాళ్లను ఏర్పాటు చేయడం బాగుందన్నారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ గుమ్మి రాంరెడ్డి మాట్లాడుతూ కరోనా తర్వాత నగర రియల్టీ మార్కెట్లో నకిలీ డెవలపర్లు పుట్టుకొచ్చారని, ప్రీలాంచ్, యూడీఎస్ అని రకరకాల పేర్లతో కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈ మోసాలపై పోలీసు కేసులు నమోదు కావడం, నకిలీ డెవలపర్లు జైళ్లకు వెళ్లడాన్ని చూస్తూనే ఉన్నందున స్థిరాస్తుల కొనుగోలు విషయంలో కొనుగోలుదారులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. తక్కువ ధరకు వస్తోంది కదా అని తొందరపాటు నిర్ణయాలతో జీవితకాలం కష్టపడి పొదుపు చేసుకున్న సొమ్మును వృథా చేసుకోవద్దన్నారు. క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ సీహెచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కరోనా తర్వాతి నుంచి బెంగళూరు, చెన్నై వంటి ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ స్థిరాస్తి రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రభుత్వ సానుకూల విధానాలు, ఐటీ, ఫార్మా రంగం అభివృద్ధితో రియల్టీ రంగం పరుగులు పెడుతోందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రాపర్టీ కొనుగోలు సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. కరోనా కారణంగా గత కొంతకాలంగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కాలేదని, పెద్ద ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కనీసం 3–4 ఏళ్లు పడుతుందని... ఇలాంటి సమయంలో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న, నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీల వివరాలను కొనుగోలుదారుల ముందుకు తీసుకురావడం మంచి నిర్ణయమంటూ 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

సొంతింటికి 'సాక్షి' తోడుగా..

ప్రాపర్టీ షోలో పాల్గొన్న సాక్షి డైరెక్టర్ (బిజినెస్–కంట్రోల్) ఏఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ సామాన్యుల సొంతింటి కలను నిజం చేసేందుకు తమ వంతు సహాయంగా ఏటా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామన్నారు. తమ షో ద్వారా నగరవాసులు ఒకేచోట ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లాలు.. ఇలా అన్నింటి సమాచారం తెలుసుకొనే వీలుంటుందన్నారు. సందర్శకులు వారికి నచ్చిన చోట, నచ్చిన ప్రాజెక్టును ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. సాక్షి అడ్వర్టయిజింగ్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) కమల్ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ సాక్షి ప్రాపర్టీ షోలో 25 ప్రధాన కంపెనీలు, 15 చిన్న కంపెనీలు 40 స్టాళ్లను ఏర్పాటు చేశాయని వివరించారు. కొనుగోలుదారులు 40 కంపెనీలు తిరగాలంటే 10–15 రోజులు పడుతుందని, అందుకే ఒకేచోట ప్రాజెక్టుల వివరాలను అందించాలనే లక్ష్యంతో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామన్నారు. రూ. 40 లక్షల నుంచి రూ. 4 కోట్ల ధర వరకూ ఉన్న ప్రాపర్టీలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రాపర్టీ షోకు నగరవాసుల నుంచి స్పందన బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి సీఈవో అనురాగ్ అగర్వాల్, డీజీఎం మహేందర్ కుమార్, ఏజీఎం సందీప్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు జీ నాగరాజు, మధుపాపారావు తదితరులు పాల్గొన్నారు.

'అదానీ వ్యవహారంపై ఆర్‌బీఐ, సెబీ విచారణ జరపాలి'

సాక్షి, హైదరాబాద్: అదానీకి చెందిన కంపెనీల షేర్లు కుప్పకూలేందుకు గల కారణాలపై ఆర్‌బీఐ, సెబీలతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించాక అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి అప్పజెప్పిన నేపథ్యంలో ఆయన సంస్థల నష్టం కేవలం ఆయనొక్కడిదే కాదని, దేశానికి తీరని నష్టమని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే కాక ఇతర దేశాల్లో కూడా కాంట్రాక్టు పనులు అదానీకి ఇప్పించడంలో మోదీ సహకరించారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని హోదాలో మోదీ మిన్నకుండటం సరైంది కాదన్నారు.ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదమున్న నేపథ్యంలో నష్టనివారణ చర్యలు చేపట్టాలని, అదానీ కంపెనీల్లో సంక్షోభానికి కారణాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు.



జ్ఞానము లేనివారు దేవుని విసర్జించి నాశనమగుదురు.
బుద్ధిహీనులు క్షేమము కలిగినదని మైమరచి నిర్మూలమగుదురు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.అష్టమి ప.2.02 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** భరణి రా. 12.52 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.10.15 నుండి, 11.50 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.20నుండి 5.04 వరకు, **అమృతఘడియలు:** రా.7.54 నుండి 8.34 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

రాజ్‌కుమార్ సంతోషీ (డైరెక్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మూడేళ్ల క్రితం... ఇదే రోజు... జనవరి 29న... గాంధీజీ హత్య జరగడం గురించి ఒకానొక అనాలోచనలో నేను పడకపోయుంటే, ఇప్పుడిలా ఏకాకిగా ఆలోచనలో పడే అవసరమే ఉండకపోయేది హిరానీజీ.." అన్నాను.. నిట్టూరుస్తూ.

మున్నాభాయ్ ఎంబీబీఎస్, లగేరహో మున్నాభాయ్, త్రీ ఇడియట్స్, పీకే, సంజూ... అన్నీ హిట్‌లే హిరానీవి.

'గాంధీజీ హత్య జరిగింది 30న కదా సంతోషీజీ..' అన్నారు హిరానీ.

"హత్య జరిగింది 30నే హిరానీజీ. కానీ జరిగిన హత్య గురించి నేను అనాలోచనలో పడింది 29న అని చెప్పడం నా ఉద్దేశం. నన్ను అర్థం చేసుకోడానికి కాస్త ప్రయత్నించండి.." అన్నాను ఆవేదనగా.

హిరానీని నేను ఈ ఉదయం ఇంటికి ఆహ్వానించింది కూడా ఆయన నన్ను అర్థం చేసుకుంటారనే. ఆయన కాకుండా ఈ సమయంలో నన్ను అర్థం చేసుకోగలవారు మరొకరున్నారు కానీ, వారిని గాడ్సే అనేవారు.



నేను జన్మించడానికి ఎనిమిదేళ్ల ముందే తుపాకీతో కాల్చి చంపేశారు.

'హిరానీజీ.. చూశారుగా.. 'గాంధీ గాడ్సే : ఏక్ యుద్ధ్'.. డిజాస్టరస్! థియేటర్‌లలో జనమే లేరు. మూడేళ్ల క్రితం ఆ రోజున కనుక నేను నా అనాలోచనతో గాంధీజీపై క్రియేటివ్‌గా ఒక సినిమా తీయాలని అనుకుని ఉండకపోతే, ఇప్పుడిలా.. ఎందుకు తీశానా అని ఆలోచనలో పడవలసి వచ్చేది కాదేమో కదా.." అన్నాను.

'గాంధీజీపై క్రియేటివ్‌గా సినిమా తీయాలని అనుకోవడం అనాలోచన ఎలా అవుతుంది సంతోషీజీ. నేననుకోవడం సినిమాకు మీరు ఎంపిక చేసుకున్న టైటిల్‌లోనే అనాలోచన ఉండి ఉంటుందని. 'గాంధీ గాడ్సే : ఏక్ యుద్ధ్' అని కదా అన్నారు. ఎవరైనా గాడ్సే పక్కన గాంధీజీని కానీ, గాంధీజీ పక్కన గాడ్సేని కానీ పెడతారా చెప్పండి? టైటిల్‌లో ఇంకొక అనాలోచన కూడా నాకు కనిపిస్తోంది. 'ఏక్ యుద్ధ్' అన్నారు. గాంధీజీ అసలు యుద్ధాలు చేసే మనిషా ఏమైనా?! ఆయన మహాత్ముడు అనే సంగతిని మనం మరచిపోయామా!!" అన్నారు హిరానీ.

'సరే చెప్పండి. ఎక్కడ దెబ్బ పడిందంటారూ?" అని అడిగాను.

'గాంధీజీని గాడ్సే తుపాకీతో కాల్చాక గాంధీజీ అక్కడికక్కడే నేలకొరిగి కన్నుమూశారు. ఆ తర్వాత గాడ్సేని జైల్లో పెట్టారు. కానీ మీరు మీ సినిమాలో గాంధీజీని బతికించి, జైల్లో ఉన్న గాడ్సేని పరామర్శించేందుకు గాంధీజీ వెళ్లినట్లుగా చూపించారు. అక్కడితో మీరు ఆగిపోలేదు. జైల్లో వాళ్లిద్దరి మధ్యా డిబేట్ నడిపించారు.." అన్నారు హిరానీ.

"కానీ ఇదొక క్రియేటివ్ థాట్ కదా హిరానీ! గాంధీజీ ఆ రోజు మరణించకుండా ఉంటే ఎలా ఉండేది అనే యాంగిల్‌లో తీసిన సినిమా..." అన్నాను.

"క్రియేటివిటీనే అనుకోండి. అయితే జనవరి 30కి ముందు కూడా గాంధీజీపై హత్యాయత్నాలు జరిగి ఆయన తప్పించుకోలేదా? ఆ తర్వాత గాంధీజీ తరఫున, గాంధీజీని హత్యచేయబోయిన వారి తరఫున దేశంలో జరిగినవన్నీ డిబేట్‌లే కదా.. మళ్లీ మన డిబేట్ ఎందుకు?" అన్నారు హిరానీ!

నేను మౌనంగా ఉన్నాను.

'ఫీల్ అవకండి సంతోషీజీ.. ఒక్కోసారి అంతే. ఘాయల్, దామిని, ఘాతక్, చైనా గేట్, పుకార్.. ఎన్ని గొప్ప సినిమాలు తీశారు మీరు!" అన్నారు హిరానీ. గొప్ప చిత్రాలు అన్నారే గానీ, హిట్ చిత్రాలు అనలేదు.

హిరానీ వెళ్లిపోయాక, పదహారేళ్ల క్రితం గాంధీజీపై ఆయన తీసిన 'లగేరహో మున్నాభాయ్' ని ప్లే చేసి గమనించాను. టైటిల్‌లో గాంధీజీ లేరు. సినిమాలో కూడా ఒక భ్రాంతిగా తప్ప గాంధీజీ లేరు.

చనిపోయిన గాంధీజీని నేను బతికిస్తే.. గాంధీజీని కాకుండా గాంధీజీ విలువల్ని హిరానీ బతికించారు!

అది నచ్చినట్లుంది ఆడియన్స్‌కి.

హైపర్ బాబు - సుడిగాలి పవర్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

''**త**మ కార్యంబు బరిత్యజించియు బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్, తమ కార్యంబు ఘటించుచున్ బర హితార్థ వ్యాపృతుల్ మధ్యముల్, తమకై యన్య హితార్థ ఘాతుక జనుల్ దైత్యుల్, వృధాన్యార్థ భంగము గావించెడి వారలెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్?''

భర్తృహరి సంస్కృతంలో రాసిన సుభాషితాలకు ఏనుగు లక్ష్మణకవి చేసిన తెలుగు సేతలో ఒక పద్యం ఇది. సొంత పనిని పక్కన పెట్టయినా సరే అవసరంలో ఉన్నవారికి తోడ్పడేవాడు సజ్జనుడు. తన పని చేసుకుంటూనే ఇతరులకు కూడా తోడ్పడేవాడు మధ్యముడు. తన స్వార్థం కోసం ఇతరులను పణంగా పెట్టేవాడు దైత్యుడు... అంటే రాక్షసుడు అని ఈ సుభాషితానికి అర్థం.

ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో తన తదుపరి స్థానం తన వారసుడైన లోకేశ్‌బాబుకే దక్కాలనేది చంద్రబాబు సంకల్పం. కానీ ఆ పార్టీలోని దిగువశ్రేణి కార్యకర్తల నుంచి నాయకుల దాకా ఈ వ్యవహారం మింగుడుపడటం లేదనేది బహిరంగ రహస్యం. ఆయనకు నాయకత్వ ప్రతిభ లేనే లేదని పార్టీ శ్రేణుల ఏకాభిప్రాయం. ఈ పూర్వరంగంలో ఎల్లో మీడియా రుషిపుంగవులు చంద్రబాబు చెవిలో ఒక తరుణోపాయాన్ని ఉపదేశించారట. కాశీయాత్ర చేసి గంగలో మునకేస్తే చేసిన పాపాలన్నీ కొట్టుకొని పోయి పుణ్యాత్ముడుగా తిరిగి వస్తారన్న నమ్మకం పూర్వకాలంలో ఉండేది. అలాగే, ''మన లోకేశ్‌బాబును రోడ్ల వెంట నడిపిస్తే ఎల్లో మీడియా ప్రతిరోజూ టాప్ న్యూస్‌గా ప్రచారంలో పెడుతుంది. ఏడాది తిరిగేసరికల్లా నాయకుడిగా తయారుచేసే బాధ్యత మాదేన''ని విశ్వామిత్రుడు దశరథ మహారాజుకు ఇచ్చినంత గట్టి హామీని ఇచ్చారట!

ఇంతవరకు బాగానే ఉన్నది. లోకేశ్‌బాబు పాదయాత్ర అనుకున్నట్టుగానే ప్రారంభమైంది. పది అడుగులు పడ్డాయో లేదో, లోకేశ్ వెనకనే నడుస్తున్న నందమూరి తారకరత్న దురదృష్టవశాత్తు కుప్పకూలిపోయాడు. వెంటనే స్పృహ కూడా కోల్పోయాడు. పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్టు అర్థమౌతూనే ఉన్నది. అయినా లోకేశ్ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకే కదిలారు. నందమూరి వారసుడూ, ఎన్టీఆర్ మనుమడూ మీకు సంఘీభావం ప్రకటించడానికి వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు, మీ కార్యక్రమాన్ని కాస్సేపు పక్కన పెట్టడం సంస్కారం కదా? కనీసం సాయంత్రం జరిగే సభనైనా రేపటికి వాయిదా వేద్దామని కొందరు సూచించారట. జనసమీకరణ కోసం పేమెంట్లు కూడా పూర్తయినందున ఆపేయలేమని నిర్వాహకులు అంగీకరించలేదు. ఏడాదిపాటు చేయవలసిన పాదయాత్రకు ఆదిలోనే అపశ్రుతి దొర్లినందున కనీస సంస్కారాన్నయినా ప్రదర్శించి ఉంటే ఎంతోకొంత ప్రాయశ్చిత్తం లభించేదేమో. భర్తృహరి వర్గీకరణ ప్రకారం ఈ రకమైన కుసంస్కారం దైత్యుల కిందకు వస్తుందా? ఇంతకంటే కఠినమైన మాటను ఉపయోగించాలా?

పూర్వకాలంలో రాజులు దండయాత్రలు చేసినట్టే ప్రస్తుత కాలంలో రాజకీయ నాయకులు రథయాత్రలు, పాదయాత్రలు చేయడం రివాజుగా మారింది. ఇందులో తప్పులెన్నవలసిన అవసరం కూడా లేదు. రథ గజ తురగ పదాతి తదాది యాత్రికులందరినీ స్వాగతించవలసినదే. విరాట రాజకుమారుడూ – ప్రగల్భ వీరుడైన ఉత్తర కుమారుడు మహావీరులైన కౌరవ సేనపైకి యుద్ధానికి వెళ్తానంటే ఎవరు అడ్డుకున్నారు? అంతఃపుర కాంతలు ఆశీర్వచనాలు చెప్పి హారతులు కూడా ఇచ్చారు. బృహన్నల రూపంలో ఉత్తర కుమారుడికి ఓ తోడు దొరకడం వేరే కథ. ఇక్కడ అప్రస్తుతం. లోకేశ్‌బాబు పాదయాత్రకు కూడా ఆలయాల్లో ఆశీర్వచనాలు, అంతఃపురంలో హారతులు, వీరతిలకాలు వగైరాలన్నీ సమకూరాయి. ఈ పాదయాత్రలో తాను ఒంటరిని కాదనీ, పవన్ కల్యాణ్ వారాహి రథయాత్ర కూడా తన వెంట తోడుగా ఉంటుందనీ పరోక్షంగానైనా సభాముఖంగానే ప్రకటించారు. వారాహినీ, యువగళాన్నీ ఆపలేరంటూ గట్టిగా హెచ్చరించి రాష్ట్ర ప్రభుత్వాన్ని గజగజలాడించేందుకు లోకేశ్‌బాబు శక్తి మేరకు ప్రయత్నించారు. రిపబ్లిక్ డే నాడు అచ్చుగుద్దినట్టు ఇదే ప్రయత్నాన్ని పవన్ కల్యాణ్ కూడా చేశారు. 'ఎవడ్రా నా వారాహిని ఆపేద'ని ఆయన గర్జించారు. నాటకాల్లో రాజు వేషం వేసే నటుడు గట్టిగా చప్పట్లు చరిచి 'ఎవరక్కడ?' అంటాడు. ఎవరూ రారు. ఇదీ అంతే! వారాహిని అడ్డుకుంటామని అధికార పార్టీ వారు గానీ, ప్రభుత్వంలోని వారుగానీ ఎవ్వరూ అనలేదు. పైపెచ్చు స్వాగతించినట్టున్నారు కూడా!

మనసు నిండా మాలిన్యం నింపుకొని గంగలో మునకేసినంత మాత్రాన ఎవరూ పవిత్రులు కాలేరు. సహజంగా నాయ కత్వ లక్షణాలున్న వారిని, ప్రజల పట్ల అంకితభావం, సమాజంపై ప్రేమ ఉన్నవారిని పాదయాత్రలు మరింత సాన బడతాయి. అంతే తప్ప అసమర్థుడిని సమర్థుడిగా మలచలేవు. లోకేశ్‌బాబు పాదయాత్ర నేపథ్యంలో ఆయనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పోల్చడానికి ఎల్లో మీడియా తెగ ప్రయాస పడిపోతున్నది. కొంతమంది తటస్థులమని చెప్పుకునే విశ్లేషకులు కూడా వీరి మాయలో పడిపోతున్నారు. ఇద్దరి మధ్యన ఉన్న హస్తిమశ కాంతారాన్ని గుర్తించకపోవడం కళ్లకు గంతలు కట్టుకోవడంతో సమానం.

> **లో**కేశ్‌బాబు పాదయాత్ర అనుకున్నట్టుగానే ప్రారంభమైంది. పది అడుగులు పడ్డాయో లేదో, లోకేశ్ వెనకనే నడుస్తున్న నందమూరి తారకరత్న దురదృష్టవశాత్తు కుప్పకూలిపోయాడు. వెంటనే స్పృహ కూడా కోల్పోయాడు. పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్టు అర్థమౌతూనే ఉన్నది. అయినా లోకేశ్ వెనక్కి తిరిగి చూడకుండా ముందుకే కదిలారు. నందమూరి వారసుడూ, ఎన్టీఆర్ మనుమడూ మీకు సంఘీభావం ప్రకటించడానికి వచ్చి ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు, మీ కార్యక్రమాన్ని కాస్సేపు పక్కన పెట్టడం సంస్కారం కదా? కనీసం సాయంత్రం జరిగే సభనైనా రేపటికి వాయిదా వేద్దామని కొందరు సూచించారట. జనసమీకరణ కోసం పేమెంట్లు కూడా పూర్తయినందున ఆపేయలేమని నిర్వాహకులు అంగీకరించలేదు. ఏడాదిపాటు చేయవలసిన పాదయాత్రకు ఆదిలోనే అపశ్రుతి దొర్లినందున కనీస సంస్కారాన్నయినా ప్రదర్శించి ఉంటే ఎంతోకొంత ప్రాయశ్చిత్తం లభించేదేమో. భర్తృహరి వర్గీకరణ ప్రకారం ఈ రకమైన కుసంస్కారం దైత్యుల కిందకు వస్తుందా? ఇంతకంటే కఠినమైన మాటను ఉపయోగించాలా?

తాతగారు నిర్మించిన పార్టీని నాన్నారు కబ్జా చేస్తే, ఆ కబ్జాను వంశపారంపర్యం చేసుకోవడానికి తండ్రి చాటున నిలబడి, ఎల్లో మీడియా నీడలో ఆపసోపాలు పడుతున్నవారు లోకేశ్‌బాబు. సొంతంగా పార్టీని నిర్మించుకొని తొమ్మిదేళ్లపాటు అధికార పీఠాలకు, గోబెల్స్ మీడియాలకు ఎదురొడ్డి పోరాడి, ఒంటిచేత్తో తన పార్టీని విజయ తీరాలకు చేర్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి. తండ్రి ముఖ్యమంత్రిగా ఉండి, తన చేతికో మూడు కీలక శాఖల్ని అప్పజెప్పి, అప్రకటిత నెంబర్ టూగా చలామణి చేసినా ఎమ్మెల్యేగా గెలవలేక చతికిలబడిన గతం లోకేశ్‌బాబుది. అధినేత్రి అహంభావానికి నిరసనగా ఆ పార్టీ టిక్కెట్‌పై లభించిన పార్లమెంట్ సభ్యత్వాన్ని గడ్డి పరకలా విసిరేసి, స్వతంత్రంగా నిలబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ధనప్రవాహం, శత్రు మీడియాలను తట్టుకొని అఖండ మెజారిటీతో జాతీయ రికార్డులను బద్దలుకొట్టిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిది.

వారసత్వ రాజకీయాల కోటాలో లోకేశ్‌తోపాటు జగన్‌మోహన్‌రెడ్డిని కూడా చేర్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. వీరిలో బీజేపీ వగైరా పార్టీలతోపాటు విశ్లేషకులమని చెప్పుకునేవారు కూడా కొందరున్నారు. ఇందుకు కారణం వారి అజ్ఞానమైనా కావచ్చు లేదా ఉద్దేశపూర్వకంగా విషం చిమ్మడమైనా కావచ్చు. తండ్రిగారు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ తరఫున జగన్‌మోహన్‌రెడ్డి లోక్‌సభకు ఎన్నికైన విషయం వాస్తవం. గెలిచిన నాలుగు నెలలకే వైఎస్సార్ మరణించారు. ఆ తర్వాత ఏడాదిపాటు కాంగ్రెస్ నాయకత్వంతో ఒకపక్క పోరాడుతూనే మరోపక్క ఓదార్పు యాత్ర చేయవలసి వచ్చింది. చివరకు పార్టీ నుంచే నిష్క్రమించవలసి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా నిండా ఏడాదిన్నర కూడా ఆయన లేరు. ఆ పదవికి కూడా పార్టీతో పాటు రాజీనామా చేసి స్వతంత్రంగా నిలిచి గెలిచి సొంతంగా పార్టీని స్థాపించుకున్నారు. ఆ పార్టీని నిలబెట్టడం కోసం, ఆ పార్టీ ప్రజల విశ్వాసం చూరగొనడం కోసం ఎండనకా, వాననకా తొమ్మిదేళ్లపాటు కాలికి బలపం కట్టుకొని పడిన కాయకష్టం ఫలితమిచ్చింది. కష్టార్జితం మీద లోకేశ్‌తో సమానంగా వారసత్వం ముసుగు కప్పేందుకు ఎల్లో మీడియా చేస్తున్న కుయుక్తుల్నీ, దగుల్బాజీ విశ్లేషకుల జిత్తులమారితనాన్నీ ఇప్పుడు మనం చూస్తున్నాము.

తన పాదయాత్రను ప్రారంభించే నాటికే రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నెంబర్‌వన్ రాజకీయ నాయకుడిగా జగన్ ఎదిగారు. అందుకు కారణాలున్నాయి. కష్టాలున్నాయి. కన్నీళ్లున్నాయి. కడగండ్లున్నాయి. అడుగడుగున మందు పాతరల్లా పొంచివున్న గండాలున్నాయి. ఆ గండాలను అధిగమించి సాగిన ప్రస్థానం ఉన్నది. ప్రజలకు ఇచ్చిన ఒక్క మాట కోసం ఆనాడు ప్రపంచంలో సర్వశక్తిమంతురాలుగా చలామణి అవుతున్న అధినేత్రి ముందు తలవంచని ఆత్మస్థైర్యం ప్రజలకు నచ్చింది. ఒక లక్ష్యం కోసం పదవుల్ని గిరాటేయడాన్ని జనం మెచ్చారు. లక్షలాదిమంది అవ్వాతాతలను, అక్కా చెల్లెళ్లను కలిసి వారి గుండె చప్పుళ్లను ఆత్మీయంగా ఆలకించినప్పుడు, ఇంటింటికి వెళ్లి తడారని కళ్లను తుడిచినప్పుడు, పుండ్లు పడిన దేహాలను సైతం ఆదరాలింగనం చేసుకున్నప్పుడు ఆ మానవీయ స్పర్శకు ఆంధ్ర దేశం పులకరించింది.

పాదయాత్రను ప్రారంభించే నాటికే అఖండ ప్రజాదరణతోపాటు ఆయన చేతిలో ఒక ప్రత్యామ్నాయ మేనిఫెస్టో ఉన్నది. ఆ మేనిఫెస్టోలో పేదరికం నుంచి ప్రజలను విముక్తి చేసే మార్గాలున్నాయి. వాటికి 'నవరత్నాల'నే పేరును ఆయన పెట్టుకున్నారు. ఆ మేనిఫెస్టోను ఆయన భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా ప్రకటించుకున్నారు. దానికితోడు ఆనాటి ప్రభుత్వపు వైఫల్యాలున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఎగవేత ఉన్నది. రుణమాఫీ పేరుతో రైతుల్ని మోసం చేయడం ఉన్నది. డ్వాక్రా మహిళలను వంచించడం ఉన్నది. ఇంటికో ఉద్యోగం వాగ్దాన భంగంగా మిగిలింది. జన్మభూమి కమిటీల దాష్టీకం అసహ్యం పుట్టిస్తున్నది. కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో పాలక పార్టీ నేతలే దుశ్శాసనులై వెదజల్లిన దుర్గంధం ముక్కుల్ని బద్దలు కొడుతున్నది. బీసీ కులాలను, ఎస్సీ కులాలను ఈసడించుకుంటున్న రాజకీయ పెత్తందార్ల పుండాకోర్ చేష్టలు జుగుప్స కలిగిస్తున్నవి. ఇదిగో... ఈ నేపథ్యంలో నెంబర్‌వన్ ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడు తన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా ప్రకటిస్తూ పాదయాత్ర ప్రారంభించాడు. అది సూపర్ హిట్‌గా చరిత్రలో నిలబడిపోయింది. సముద్ర తీరాలను కలుపుతూ జనవారధులను నిర్మించినట్టు, వీధులన్నీ జీవనదులై పోటెత్తినట్టు ప్రజలు పాలుపంచుకున్నారు.

మరి లోకేశ్‌బాబు పాదయాత్ర సంగతి? ఆయన నాయకుడుగానే ఎదగలేదు. ఎమ్మెల్యేగానే గెలవలేదు. ఆయన వారసత్వంపై పార్టీలోనే అంగీకారం లేదు. ఆయన చేతిలో ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ముందు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను దాచేసినట్టుగా ఈ ప్రభుత్వం దాచేయలేదు. పటాలు కట్టించి ఆఫీసుల్లో పెట్టింది. 98 శాతం హామీలను నెరవేర్చినట్టు ప్రకటించింది. ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను రద్దుచేస్తామని లోకేశ్ చెప్పలేదు. గోబెల్స్ విషప్రచారం తప్ప మరో కార్యక్రమమే లేదు. ఎల్లో మీడియా అందజేసే తప్పుడు కథనాల సారాంశమే తప్ప ఆయన మెదడంతా నిస్సారమే! అయినప్పటికీ తొలిరోజు పాదయాత్రను 'ఘనంగా ముందడుగు' అనే పతాక శీర్షికతో 'ఈనాడు' ప్రకటించింది. వారెవ్వా... కాకిపిల్ల కాకికి ముద్దు. రామోజీరావుకు 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ'. పాఠకుల్ని కూడా అదే నమ్మమంటాడు, ఖర్మ!

> **లో**కేశ్ నాయకుడుగానే ఎదగలేదు. ఎమ్మెల్యేగానే గెలవలేదు. ఆయన వారసత్వంపై పార్టీలోనే అంగీకారం లేదు. ఆయన చేతిలో ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ముందు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను దాచేసినట్టుగా ఈ ప్రభుత్వం దాచేయలేదు. పటాలు కట్టించి ఆఫీసుల్లో పెట్టింది. 98 శాతం హామీలను నెరవేర్చినట్టు ప్రకటించింది. ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను రద్దుచేస్తామని లోకేశ్ చెప్పలేదు. గోబెల్స్ విషప్రచారం తప్ప మరో కార్యక్రమమే లేదు. ఎల్లో మీడియా అందజేసే తప్పుడు కథనాల సారాంశమే తప్ప ఆయన మెదడంతా నిస్సారమే! అయినప్పటికీ తొలిరోజు పాదయాత్రను 'ఘనంగా ముందడుగు' అనే పతాక శీర్షికతో 'ఈనాడు' ప్రకటించింది. వారెవ్వా... కాకిపిల్ల కాకికి ముద్దు. రామోజీరావుకు 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ'. పాఠకుల్ని కూడా అదే నమ్మమంటాడు, ఖర్మ!

'యువగళం' పాదయాత్ర భూపాలం పాడితే... 'వారాహి రథయాత్ర' కోరస్ పాడుతుందా! లోకేశ్ మాటల్ని వింటే అంతే అనుకోవాలి. వారాహి, యువగళాలను ఎవరూ ఆపలేరని ఆయన చెప్పారు. రెండూ తమ ఆస్తులేనన్నంత ధీమాగా ఆ రెంటినీ ఎవరూ తాకలేరని చెప్పుకొచ్చారు. దానికి తగ్గట్టుగానే పవన్ కల్యాణ్ ఉపన్యాసాలు కూడా సాగుతున్నాయి. పవన్ కల్యాణ్ ఉపన్యాసాలను మొదటి నుంచీ వింటున్న వారికి ఒక మనిషిలో ఇన్ని వైరుధ్యాలు ఎలా సాధ్యమన్న అనుమానం రాకుండా ఉండదు. మొదట్లో చేగువేరా మీద తనకున్న అభిమానాన్ని ఆయన దాచుకునేవాడు కాదు. అప్పుడప్పుడూ ఆయన చేతిలో కన్పించే పుస్తకాల్లో, ఆయన నటించే సినిమాల్లోచే బొమ్మలు కనిపించేవి. ఇప్పుడెందుకో చేగువేరాకు గుడ్‌బై చెప్పినట్టు కనిపిస్తున్నది. ఇటీవల గువేరా కూతురు తెలుగు రాష్ట్రాల్లో పాల్గొన్న సభల్లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ పాల్గొన్నారు – ఒక్క జనసేన తప్ప! పవన్ కల్యాణ్ నుంచి ఏదైనా పత్రికా ప్రకటనైనా వస్తుందేమోనని చూశారు. అలాంటిదేమీ లేదు.


రాజకీయాల్లోకి వచ్చి పదేళ్లవుతున్నా ఆయన ఉపన్యాసాలపై సినిమాల ప్రభావం పోలేదు. ఆయన చెబుతున్న చాలా విషయాలు వినేవాళ్లకు నమ్మశక్యంగా అనిపించవు. ఇటీవల తానొక బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు వర్ణవివక్షను ఎదుర్కొన్నాననీ, ఎయిర్ హోస్టెస్ తనకు మంచినీళ్లు ఇవ్వలేదనీ చెప్పారు. బ్రిటీష్ ఎయిర్‌వేస్‌లో వేలమంది భారతీయులు ఎకానమీ క్లాస్‌లో కూడా ప్రయాణిస్తుంటారు. ఎవ్వరూ ఇటీవలి కాలంలో ఇలాంటి ఆరోపణ చేయలేదు. అలాంటిది బిజినెస్ క్లాసులో ఉన్న పవన్‌కు అవమానం జరగడమేమిటి?... మహాత్మాగాంధీ కూడా తొలినాళ్లలో దక్షిణాఫ్రికా రైల్లో వర్ణవివక్షను ఎదుర్కొన్నట్టే తాను కూడా ఎదుర్కొన్నట్టు చెబితే సెంటిమెంట్ బాగా పండుతుంది, సినిమా గ్రాండ్‌గా ఉంటుందనుకున్నారా? ఇలాంటి అనేక నమ్మశక్యం కాని విషయాలను పవన్ ప్రసంగాల నుంచి వెతికి మరీ ఔత్సాహికులు సోషల్ మీడియాలో పెడుతున్నారు. సుమారు ఒక డజన్ వరకు ఇటువంటి కామెడీ పీస్‌లు చక్కర్లు కొడుతున్నాయి.

రిపబ్లిక్ డే నాడు మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలు కలిగిన వారి తండ్రిగారు దీపారాధనతో సిగరెట్ వెలిగించుకున్నారని చెప్పారు. కమ్యూనిస్టు భావజాలం మీద ద్వేషం కలిగించడానికి కాకపోతే ఈ సంగతి ఎందుకు చెప్పినట్టు? తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు భావజాలం కలిగినవాళ్లు వేల సంఖ్యలో ఉంటారు. ఎవరైనా ఈ రకంగా ప్రవర్తించినట్టు ఎప్పుడైనా ఒక వార్త వచ్చిందా? అలాంటప్పుడు నిన్న మొన్నటి దాకా తనకు చేగువేరా ఆదర్శమనీ, నక్సలైట్ అవుదామని అనుకున్నాననీ ఎందుకు చెప్పుకున్నట్టు? ఒక స్థిరత్వం లేదా? నాయకుడన్నవాడు నిజాయితీగా ఉండాలని జనం కోరుకుంటారు. నిజాలు మాట్లాడాలని కోరుకుంటారు. ప్రజల పట్ల, బలహీన వర్గాల పట్ల ముఖ్యంగా మహిళల పట్ల గౌరవం చూపాలని కోరుకుంటారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి రోజా పట్ల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, చూపిన హావభావాలు గౌరవపూర్వకంగానే ఉన్నాయా? ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడు మాట్లాడే తీరేనా? యువగళం, వారాహి యాత్రలు రెండూ ఆదిలోనే సంస్కారం అనే పట్టాలను తప్పాయి. పట్టాలు తప్పిన ఈ ప్రయాణాలను ఎవరూ ఆపలేరట! ఈ యాత్రలు ఏ తీరాలకు చేరుతాయో చూడాలి.

vardhelli1959@gmail.com

గర్వం, స్వాభిమానం సమంగా నటించే తార

నివాళి



వనం జ్వాలా నరసింహారావు

తెలుగు చలన చిత్ర రంగంలో ధ్రువ తారామణిగా దశాబ్దాలపాటు వెలిగిన నటీమణి జమున మరణ వార్త విన్న తరువాత, స్వర్గీయ కేబీ తిలక్ ఆత్మకథ నేను రాస్తున్నప్పుడు ఆమె గురించి ఆయన చెప్పిన కొన్ని విషయాలు గుర్తుకొచ్చాయి. 'అనుపమ' చలన చిత్ర దర్శక-నిర్మాతగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, సామాజిక సేవకునిగా తిలక్ చాలామందికి సుపరిచితుడే. పాతిక సంవత్సరాల క్రితం ఆయన జీవిత చరిత్రను ఆయన మాటల్లోనే విని, రికార్డ్ చేసి, అక్షరీకరణ చేశాను.

అనుపమ ఫిలిమ్స్ స్థాపించి, శరత్ బాబు నవల ఆధారంగా ఆరుద్ర రూపొందించిన స్క్రిప్టుతో స్వీయ దర్శకత్వంలో తన తొలి ప్రయత్నంగా 'ముద్దుబిడ్డ'(1956) తీశారు తిలక్. ఆయనతో అప్పటికే ప్రముఖ నటిగా పేరు తెచ్చుకున్న జి.వరలక్ష్మి ప్రధాన భూమిక తనకే ఇవ్వాలన్న ప్రతిపాదన చేశారు. అయితే కథానాయకుడు జగ్గయ్యతో పాటు ఆ సినిమాలో ప్రధాన భూమికకు 'గర్వం', 'స్వాభిమానం' సమపాళ్లలో నటించగల జమునను ఎంపిక చేశారు తిలక్. ఆ పాత్ర కావాలని ఆశపడ్డ జి.వరలక్ష్మిని జమున వదిన పాత్రకు తీసుకున్నారు. (8 రీళ్లపాటు షూట్ చేశాక ఒక డైలాగ్ మార్చమనడంతో ఆమెను తొలగించడం వేరే కథ!) ప్రజానాట్య మండలికి చెందిన పలువురు కళాకారులు ఇందులో నటించారు.

జమున, జగ్గయ్యల కాంబినేషన్‌లో ఓ నాటక బృందం ఉండేదా రోజుల్లో. ఆ పాటికే జమున 'పుట్టిల్లు' సినిమాలో నటించారు. అయితే ఆమె సినీ కళాకారిణిగా స్థిరపడేందుకు 'ముద్దుబిడ్డ' సినిమానే కారణమని తిలక్ అభిప్రాయం. ఇందులో జమున క్యారెక్టర్ మొదట్లో ఓ బొమ్మతో ఆటపాటలతో కాలం గడిపే అమాయక 'రాధ' పాత్ర. మొదటి షాట్‌లోనే జమున 'రాధ' పాత్రలో బొమ్మను పట్టుకుని ''చిట్టి పొట్టి వరాల మూట– గుమ్మడి పండు గోగు పువ్వు'' అనే పాట పాడుతుంది.



అలా పాడుకుంటూ, బొమ్మతో ఆడుకుంటున్న రాధను ఫలహారానికి పిలిస్తే రాలేదని కినుక వహించిన అత్త సుభద్ర ఆమె చేతిలోని బొమ్మ లాక్కోవటంతో మూర్ఛ పోతుంది. మూర్ఛ జబ్బు గల ఆమెను డాక్టర్‌గా పనిచేసే జగ్గయ్యకు ఇచ్చి పెళ్లి చేస్తే మంచి దన్న ఆలోచన కలగటమే తాపీ గారు సూచించిన 'ముడి'.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు మద్దతుగా వుండే థీమ్‌తో... ఇష్టంలేని వివాహం రద్దయి, కోరుకున్న వానితో వివాహం జరిపించటం ఇతివృత్తంగా వుండే ఓ సామాజిక స్పృహతో తిలక్ తీసిన 'ఈడూ జోడూ'(1963) సినిమాలో కూడా జమున నటించారు. మహాబలిపురంలో ఔట్ డోర్ షూటింగ్ చేస్తున్న సందర్భంలో జపాన్ దేశం నుండి అక్కడకు వచ్చింది ఓ సాంస్కృతిక కళాకారుల బృందం. వారి సమక్షంలో ఆరుద్ర రచించిన 'ఇదేమి లాహిరి ఇదేమి గారడి' అనే చక్కటి పాటను ఘంటసాల, సుశీల పాడగా జగ్గయ్య, జమునలపై చిత్రీకరించామని చెప్పారు తిలక్.

జమునను జగ్గయ్యతో వివాహం జరిపించేటందుకు నిర్ణయించుకున్న తర్వాత ఆమె మెళ్లో తాళి తీయించే సీన్ ఉంటుంది సినిమాలో. జమునను గుమ్మడి బెదిరించి నేను కట్టని తాళి నీ మెళ్లో వుంటానికి వీల్లేదు అంటాడు. ఈ సీన్ చూసిన నాటి సెన్సార్ అధికారి జి.పి.శాస్త్రి గారు, తిలక్‌ను తప్పుచేస్తున్నావని హెచ్చరించారు. అట్లా తీయకుండా, సెంటిమెంట్లను దెబ్బతీయకుండా, ఫ్లాష్ బ్యాక్‌లో విడాకులు ఇప్పించినట్లు చూపించమన్నారు. ఎట్లాగో ఆ సీన్‌ను మానేజ్ చేశారు తిలక్. గుమ్మడి, జమున చాలా కాంపిటీటివ్‌గా నటించారీ సినిమాలో.

ఇలా ఈ రెండు సినిమాలైన 'ముద్దుబిడ్డ', 'ఈడూ జోడూ'లలో జమున అద్భుతంగా నటించిన విషయం ఎంతో గొప్పగా చెప్పారు కేబీ తిలక్. ఆ మహానటి ఆత్మకు శాంతి కలగాలి.

వ్యాసకర్త సీఎం చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ । తెలంగాణ

2023 కొలకలూరి పురస్కారాలు

'**కొ**లకలూరి పురస్కారాలు–2023' ప్రదాన ప్రకటనను ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ వెల్లడించారు. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం–2023ను 'పచ్చికడుపు వాసన' సంపుటికి గానూ యార్లగడ్డ రాఘవేంద్రరావుకు ప్రకటించారు. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం –2023ను 'ఆకెళ్ల నాటికలు' సంపుటికిగానూ ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు బహూకరించనున్నారు.

కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం–2023ను 'తెలంగాణ కథ– వర్తమాన జీవన చిత్రణ' గ్రంథానికిగానూ డాక్టర్ ఎం. దేవేంద్ర స్వీకరిస్తారు. విజేతలందరికీ పదిహేను వేల నగదు, సత్కారం ఉంటుంది. ఈ యేడు అదనంగా 'ఇక ఇప్పుడు' కవితా సంపుటికి గానూ కటుకోజ్వల ఆనందాచారికీ, 'రాచపాళెం సాహిత్య విమర్శ– సమగ్ర అధ్యయనం' గ్రంథానికిగానూ డాక్టర్ ఎ.ఎ.నాగేంద్రకూ చెరో ఐదు వేల నగదు పురస్కారం ఇవ్వనున్నారు. కొలకలూరి భాగీరథి జయంతి, వర్ధంతి అయిన ఫిబ్రవరి 26 రోజున పురస్కారాల ప్రదాన సభ జరగనుంది.

క్లుప్తంగా...

రెండు కేసులకే పీడీ యాక్ట్ సరికాదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: విద్వేషాలు రెచ్చగొట్టాడంటూ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసిన కేసులో ఆ వ్యక్తిని విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలో అభ్యంతర పోస్టులు పెట్టొద్దంటూ, మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకూడదని అతనికి పలు షరతులు విధించింది. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన సయ్యద్ అబ్రహం ఖాద్రీ.. రాజాసింగ్ అరెస్టు, విడుదల సందర్భంగా సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడంటూ పలు కేసులు నమోదయ్యాయి. దీంతో అతనిపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి నిర్బంధంలో ఉంచారు. పోలీసుల చర్యను నిరసిస్తూ అతని తల్లి గజాలా హైకోర్టును ఆశ్రయించారు. హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం రిట్ పిటిషన్‌ను అనుమతించింది. కేవలం రెండు కేసుల ఆధారంగా పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేయడాన్ని తప్పుబట్టింది. నిర్బంధంలో ఉంచాలంటూ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది.

'నేడు చలో పాఠశాల విద్యా కమిషనర్'

సాక్షి, హైదరాబాద్: కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం చలో పాఠశాల విద్యా కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, పి.అరుణ్‌కుమార్ తెలిపారు. బాలికల ఆస్పత్రి అవసరాల కోసం ప్రతి కేజీబీవీలో రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కేజీబీవీల్లో సర్వీసు కాలాన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు వెయిటేజీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముద్దుల పెట్‌కు గ్లామర్..

మసాజ్ నుంచి బబుల్ బాత్ దాకా..
- నగరంలో పెరుగుతున్న పెంపుడు జంతువుల గ్రూమింగ్
- ఇంటి వద్దకే వచ్చి సేవలు అందిస్తున్న సంస్థలు



కుక్కకు ట్రిమ్మింగ్..

సాక్షి, హైదరాబాద్: నేటి ఆధునిక కాలంలో గ్లామర్ మేనియా ఇంట్లో వారికే కాదు.. వాళ్ల పెంపుడు జంతువులకూ ముఖ్యమైపోయింది. ముద్దొచ్చే తమ పెట్స్‌ను మరింత అందంగా చూడాలనుకుంటున్న యజమానులు ఇందుకోసం ఎంతయినా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో పెంపుడు జంతువులను ముస్తాబు చేసే సంస్థలు హైదరాబాద్‌లో క్రమంగా పెరుగుతున్నాయి. మసాజ్, గోళ్ల కత్తిరింపు, బబుల్ బాత్ వంటి సేవలను పెంపుడు జంతువులకు అందిస్తున్నాయి.

తరలి వచ్చే తలుకులద్దగ...

గతంలో ఈ తరహా పెట్ గ్రూమింగ్ సేవల్ని హైదరాబాద్‌లో కొన్ని సంస్థలు మాత్రమే అందించేవి. అయితే కరోనా సమయంలో తమ పెంపుడు జంతువులను గ్రూమింగ్ పార్లర్స్‌కు తీసుకెళ్లలేక నగరవాసులు పడిన ఇబ్బందులు మొబైల్ పార్లర్స్‌కు ఆజ్యం పోశాయి. ప్రస్తుతం నగరంలో దాదాపు డజనుకు పైగా మొబైల్ వ్యాన్లు పెట్ స్పాలను ఇంటింటికీ మోసుకొస్తున్నాయి. ఈ సేవల కోసం పూర్తిగా రసాయనాలు లేని ఉత్పత్తులనే ఉపయోగిస్తున్నామని మొబైల్ పార్లర్ల నిర్వాహకులు చెబుతున్నారు. మొత్తం గ్రూమింగ్ ప్రక్రియ దాదాపు గంట పడుతుందని... బొచ్చు కుక్కలకు మాత్రం 90 నిమిషాల వరకు సమయం పడుతుందంటున్నారు. అలాగే పిల్లులను పెంచుకొనే వారికి కూడా సేవలు అందిస్తున్నామని వివరిస్తున్నారు. పెట్‌ను ఫంక్షన్ లేదా ఫోటోషూట్‌కు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు తగిన దుస్తులు ధరింపజేయడం, ప్రత్యేకంగా హెయిర్‌ను సెట్ చేయడం కూడా చేస్తామని చెబుతున్నారు.

వెటర్నరీ డిప్లొమా వారినే తీసుకున్నాం...

మా మొబైల్ సెలూన్‌లలో పనిచేసే గ్రూమర్‌లందరూ వెటర్నరీ కళాశాల డిప్లొమా హోల్డర్లు. ఉద్యోగంలో భాగంగా తొలుత వారికి 3 నెలల పాటు శిక్షణ సైతం అందిస్తున్నాం.
– జస్ట్ గ్రూమ్ నిర్వాహకురాలు చైత్ర

వ్యాధుల వ్యయంతో పోలిస్తే నయమే..

శుభ్రత పాటిస్తే పెట్స్ ఆరోగ్యంగా ఉంటాయి. వాటికి సరైన విధంగా స్నానం చేయించడం మన వల్ల సాధ్యం కాదు. ఫలితంగా పెట్స్‌కు చర్మవ్యాధుల వంటివి రావచ్చు. అందుకే నా పెట్‌కి నెలకో సారి స్పాలో స్నానం, 3 నెలలకు ఒకసారి గ్రూమింగ్ చేయిస్తాను. సగటున దాని శుభ్రతకు నెలవారీగా రూ. 3 వేలు ఖర్చు పెడుతున్నా. అయితే పెట్స్‌కు వ్యాధులు సోకితే అంతకన్నా ఎక్కువే ఖర్చు చేయాలి. పెట్ మొబైల్ సేవల వల్ల పెట్ స్పా కోసం దూరభారం ప్రయాణించే అవసరం పోయింది. – పరిమళ, సికింద్రాబాద్

కృష్ణాలో వాటాలకు మళ్లీ కొట్లాట!

సుప్రీంకోర్టులో మళ్లీ కేసు వేసేందుకు సిద్ధమైన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా నిర్ధారణకు అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం–1956లోని సెక్షన్ 3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో మళ్లీ కేసు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వాస్తవానికి ఈ అంశంపై గతంలోనే సుప్రీంకోర్టులో కేసు వేసిన రాష్ట్ర ప్రభుత్వం... కేంద్రం సూచనతో ఉపసంహరించుకుంది. సుప్రీంకోర్టులో కేసు వల్ల తాము సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేయలేకపోతున్నామని, తెలంగాణ కేసును ఉపసంహరించుకుంటే ఈ విషయంలో సత్వర నిర్ణయం తీసుకుంటామని 2020 అక్టోబర్ 6న జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ హామీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేసును ఉపసంహరించుకున్నప్పటికీ రెండేళ్లు గడిచినా ఇంతవరకు కేంద్రం సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించాలనుకుంటోంది. కోర్టుకు సమర్పించే అఫిడవిట్లను సైతం ఇప్పటికే సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటి పారుదల శాఖ వర్గాలు తెలిపాయి. సీఎం కేసీఆర్ అనుమతించగానే పిటిషన్ వేసేందుకు కసరత్తు జరుగుతోందని పేర్కొన్నాయి.

కొత్త ట్రిబ్యునల్ ఎందుకంటే?: బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్–1) 1976 మే 31న ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీలకు అదనంగా మరో 194 టీఎంసీలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్–2) 2013 నవంబర్ 29న కేటాయించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువును కేంద్రం పొడిగించింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం తమ పని కాదని, సెక్షన్ 89 ప్రకారం కేవలం రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులవారీగా కేటాయింపులు మాత్రమే జరుపుతామని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తేల్చిచెప్పింది. దీంతో 2 రాష్ట్రాల మధ్య స్పష్టమైన నీటి కేటాయింపుల కోసం కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది.

తాత్కాలిక వాటాల కొనసాగింపుపై అభ్యంతరం

ఉమ్మడి రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేస్తూ ట్రిబ్యునల్స్ జారీ చేసిన ఉత్తర్వులకు రెండు రాష్ట్రాలకు కట్టుబడి ఉండాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్–89 పేర్కొంటోంది. ఇదే చట్టంలోని సెక్షన్–85 (7) (ఈ)/4 ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలోని ప్రాజెక్టులవారీగా బచావత్ ట్రిబ్యునల్ జరిపిన నికర జలాల కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలి. దీని ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో ఏపీకి 512.04 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీలను తాత్కాలికంగా కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కానీ తాత్కాలిక కేటాయింపులను కొనసాగించడంపట్ల తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ కేటాయింపులు రాష్ట్ర రైతాంగానికి నష్టం కలిగిస్తున్నాయని, ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల్లో స్పష్టమైన వాటాలకు కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని పట్టుబడుతోంది. అయితే సెక్షన్–3 కింద కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు సాధ్యం కాదని పలువురు న్యాయ నిపుణులు సలహా ఇచ్చారని కేంద్రం 6 నెలల కిందట రాష్ట్రానికి లేఖ రాసింది.

బాన్సువాడలో 'డబుల్' ధమాకా!

- ఒకే రోజు 504 ఇళ్లు పంపిణీ చేసిన స్పీకర్



బాన్సువాడ నియోజక వర్గంలోని తాడ్కోల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చొరవతో నిరుపేదల సొంతింటి కల నెరవేరింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ పరిధిలోని తాడ్కోల్‌లో నిర్మించిన 504 డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిన తరువాత స్పీకర్ పోచారం నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలో లేని విధంగా బాన్సువాడకు 11 వేల ఇళ్లను మంజూరు చేయించారు. ఇప్పటివరకు ఏడు వేల పైచిలుకు ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాగా పట్టణ పరిధిలోని తాడ్కోల్ శివారులో మొదట ఐదు వందల ఇళ్లు నిర్మించారు. వాటిని ఇప్పటికే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదే కాంపౌండ్‌లో నిర్మించిన 504 ఇళ్లను శనివారం లబ్ధిదారులకు అందించారు. కేసీఆర్ నగర్‌గా ఈ కాంపౌండ్‌కు నామకరణం చేశారు. అక్కడే రూ.90 లక్షలతో కల్యాణ వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాలనీలో షాపింగ్ కోసం కాంప్లెక్సు నిర్మించారు. కాలనీలోని ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు పోచారం పేర్కొన్నారు. కాగా తమకూ ఇళ్లు కావాలంటూ మరికొందరు అక్కడికి చేరుకుని నినాదాలు చేశారు.

సర్వీస్ మ్యాటర్ మాట్లాడేందుకే వెళ్లాను..

- స్మితా సబర్వాల్ ఇంట్లోకి చొరబాటు కేసులో నిందితుడి వెల్లడి



ఆనంద్ కుమార్‌రెడ్డి



కొత్త బాబు

బంజారాహిల్స్ (హైదరాబాద్): తనతో పాటు మరో తొమ్మిది మంది డిప్యూటీ తహసీల్దార్ల పదోన్నతి విషయంపై మాట్లాడేందుకే ముఖ్యమంత్రి కార్యాలయ సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌ను కలిసేందుకు ఆమె క్వార్టర్‌కు వెళ్లినట్లు మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖ మాజీ డిప్యూటీ తహసీల్దార్ చెరుకు ఆనంద్‌కుమార్‌రెడ్డి శనివారం పోలీస్ కస్టడీలో వెల్లడించారు. సర్వీస్ మ్యాటర్ డిస్కస్ చేసేందుకే ఆమె ఇంటికి వెళ్లానని చెప్పిన ఆనంద్‌కుమార్, అర్ధరాత్రి ఎందుకు వెళ్లావని పోలీసులు అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1999లో గ్రూప్–2కు సెలెక్ట్ అయిన మొత్తం 26 మంది అభ్యర్థుల పోస్టింగ్‌లు కోర్టు వివాదంతో రద్దయ్యాయి. అయితే 2018లో కోర్టు జోక్యంతో వారందరికీ డిప్యూటీ తహసీల్దార్లుగా పోస్టింగ్‌లురాగా, ఇందులో 16 మందిని ఏపీకి కేటాయించారు. మిగతా పది మందికి తెలంగాణలో పోస్టింగ్‌లు రాగా అందులో ఆనంద్‌కుమార్ కూడా ఒకరు. ఏపీలో 16 మందికి తహసీల్దార్లుగా ప్రమోషన్లు రాగా తెలంగాణలో మాత్రం నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా డీటీలుగానే ఉన్నామని, ఈ విషయం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆనంద్ కుమార్ వెల్లడించినట్లు తెలుస్తోంది. సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న స్మితా సబర్వాల్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తే సీఎంతో మాట్లాడి న్యాయం చేస్తారన్న ఉద్దేశంతోనే కలవడానికి వెళ్ళినట్లుగా చెప్పాడు. అయితే ఆమెను కలవడానికి క్వార్టర్‌కు వెళ్లడం ఒక తప్పయితే, అర్ధరాత్రి వెళ్లడం మరో తప్పని పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆనంద్ కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసిన విషయం కూడా విదితమే. ఇదిలా ఉండగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లో నీలోఫర్ చాయ్ తాగుదామని తనను మేడ్చల్‌నుంచి తీసుకొచ్చాడని స్మితా సబర్వాల్ ఇంటికి వెళ్లే విషయం తనకు తెలియదని, తనను అనవసరంగా ఇందులో ఇరికించాడని మరో నిందితుడు కొత్త బాబు కస్టడీలో పోలీసులకు వెల్లడించాడు.

సింగరేణిలో తొలి | ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

- మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని ఎస్టీపీపీ జలాశయంలో ఏర్పాటు
- 5 మెగావాట్ల ప్లాంట్‌లో తొలిసారిగా దేశీయ టెక్నాలజీ, సోలార్ పలకల వినియోగం
- గ్రిడ్‌కు అనుసంధానం చేసిన సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు
- త్వరలో మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ సిద్ధం



శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటును ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

జైపూర్ (చెన్నూర్)/ సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ (ఎస్టీపీపీ) కేంద్రానికి సంబంధించిన జలాశయంపై ఏర్పాటు చేసిన 5 మెగావాట్ల నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ డి.సత్యనారాయణరావు ఈ ప్లాంట్‌ను ప్రారంభించి తెలంగాణ ట్రాన్స్‌కో గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. దీంతో సింగరేణి సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 224 మెగావాట్లకు చేరింది. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఉద్యోగులు, అధికారులను అభినందించారు. ఇక్కడే ఏర్పాటు చేస్తున్న మరో 10 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, 3 దశల్లో మొత్తం 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి సంస్థ మూడేళ్ల కార్యాచరణ ప్రారంభించింది. మొదటి రెండు దశల్లో 219 మెగావాట్ల సామర్థ్యం గల 8 ప్లాంట్లను మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు, రామగుండం–3, మందమర్రి ఏరియాల్లో నిర్మించింది. వీటి ద్వారా 540 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, సంస్థ విద్యుత్ ఖర్చుల్లో రూ.300 కోట్లను సింగరేణి సంస్థ ఆదా చేసింది. మూడో దశ కింద 81 ప్లాంట్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. దీనిలో భాగంగా మొత్తం 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని రెండు జలాశయాలపై నిర్మించే బాధ్యతలను నోవస్ గ్రీన్ ఎనర్జీ సిస్టమ్స్ సంస్థకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్, జీఎం డీవీఎస్ఎన్ సూర్యనారాయణ రాజు, జీఎం (సోలార్) జానకి రాం, ఎస్‌వోటు డైరెక్టర్ సూర్యకుమార్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషారావు, జీఎం పీసీఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఏజీఎం సత్యనారాయణప్రసాద్, సీఎంవోఏఐ కేంద్ర ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జన
ముగ్గురి దుర్మరణం

బెవెర్లీ క్రెస్ట్: అగ్రరాజ్యం అమెరికాలో కాల్పుల మోత కొనసాగుతూనే ఉంది. శనివారం ఉదయం కాలిఫోర్నియా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో కనీసం ముగ్గురు మరణించారని, మరో నలుగురు గాయపడ్డారని పోలీసు అధికారులు వెల్లడించారు. లాస్‌ఏంజెలెస్ సమీపంలోని బెవెర్లీ క్రెస్ట్‌లో ఓ ఇంటి వద్ద తెల్లవారుజామున 2.30 గంటలకు కాల్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. గుర్తుతెలియని వ్యక్తి మొత్తం ఏడుగురిపై తుపాకీ గురిపెట్టాడని పేర్కొన్నారు. బాధితులను ఇంకా గుర్తించలేదని చెప్పారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించామని, వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. కాలిఫోర్నియాలో గత నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో కాల్పుల సంఘటన కావడం గమనార్హం. వారం రోజుల క్రితం లాస్ ఏంజెలెస్ శివారులో ఓ డ్యాన్స్ హాల్‌లో జరిగిన కాల్పుల్లో ఏకంగా 11 మంది బలైన సంగతి తెలిసిందే.

మార్చి 1 నుంచి గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీలు

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రజల ఫిర్యాదులను పరిశీలించి, చర్యలు తీసుకోవడానికి కేంద్రం ఏర్పాటు చేసిన మూడు గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జీఏసీ)లు మార్చి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ప్రతి జీఏసీకి ఒక చైర్‌పర్సన్ నేతృత్వం వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమ నుంచి మరో ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరి పదవీ కాలం మూడేళ్లు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనే పంపాల్సి ఉంటుంది. 30 రోజుల్లోగా జీఏసీలు పరిష్కరిస్తాయి.

ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం.. డాక్టర్ దంపతులు సహా ఐదుగురు మృతి

ధన్‌బాద్: జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌లోని ఓ నర్సింగ్ హోంలో శనివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో డాక్టర్ దంపతులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ధన్‌బాద్‌లోని బ్యాంక్ మోర్ ఏరియాలో డాక్టర్ వికాస్ హజ్రాకు చెందిన నర్సింగ్ హోం ఉంది. ఆయన కుటుంబంతోపాటు అందులోనే నివాసం ఉంటారు. ఆస్పత్రి స్టోర్‌రూంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక మంటలు మొదలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న డాక్టర్ వికాస్ హజ్రా(64), భార్య డాక్టర్ ప్రేమ హజ్రా(58), బంధువు సోహన్ కుమారి, పనిమనిషి తారాదేవి దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక చనిపోయారు. మృతి చెందిన ఐదో వ్యక్తిని గుర్తించాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఘటనలో డాక్టర్ దంపతుల పెంపుడు కుక్క కూడా చనిపోయింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

‘ఓటు జోడో’ యాత్ర అయ్యేనా?



ముగింపుకు రాహుల్ భారత్ జోడో యాత్ర
ఈ పాదయాత్రపైనే కాంగ్రెస్‌కు గంపెడాశలు

ఎస్.రాజమహేంద్రారెడ్డి

కాంగ్రెస్ పార్టీ గంపెడాశలు పెట్టుకున్న రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా సాగిన ఈ యాత్ర విజయవంతమైనట్టేనా? నూటా పాతికేళ్ల పై చిలుకు సుదీర్ఘ చరిత్రలో ఎన్నడూ లేనంత నైరాశ్యంలో కూరుకుపోయి ఉన్న కాంగ్రెస్‌కు కాస్తయినా కొత్త ఊపిరులూదేనా...? వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఆశించిన మేరకు ఓట్లను ‘జోడి’ంచేనా...?

కాంగ్రెస్. గ్రాండ్ ఓల్డ్ పార్టీ. ఎంతో ఘనచరిత్ర ఉన్న పార్టీ. మహా మహా నాయకులెందరినో దేశానికి అందించిన పార్టీ. సుదీర్ఘకాలం పాటు దేశాన్ని ఏలిన జన సమ్మోహన పార్టీ. దేశాన్ని ఒక్కతాటిపై నడిపిన పార్టీ. కానీ కొన్నేళ్లుగా సొంత నేతలనే ఒక్కతాటిపై నడపలేక ఆపసోపాలు పడుతోంది. ఏదో చెయ్యాలి. మళ్లీ ఎలాగైనా పార్టీకి పునర్వైభవాన్ని తీసుకురావాలి. ఈ తపన, మథనం నుంచి పుట్టిన ‘భారత్ జోడో యాత్ర’ పార్టీని మళ్లీ పట్టాలెక్కిస్తుందా? లేదా లెక్క తప్పుతుందా? వేచి చూడాల్సిందే! దేశ ప్రజలను ఈ యాత్ర ద్వారా రాహుల్‌గాంధీ ఏ మేరకు ప్రభావితం చేయగలిగారన్నది కూడా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చే సీట్ల సంఖ్య ద్వారానే తేలుతుంది.

చకచకా.. చలాకీగా...

రాహుల్‌గాంధీ. కాంగ్రెస్‌కు చివరి ఆశాకిరణం. జోడో యాత్ర. రాహుల్‌గాంధీకి చివరి ఆశాకిరణం. ఈ యాత్రపై కాంగ్రెస్ గంపెడాశలు పెట్టుకుంది. అందుకు తగ్గట్టుగానే కన్యాకుమారిలో యాత్రను ప్రారంభించిన రాహుల్‌గాంధీ చలాకీగా నడుస్తూ, జనంతో మమేకమవుతూ చివరి మజిలీకి చేరుకున్నారు. భారత్ జోడో యాత్ర అనబడే 3,570 కిలోమీటర్ల రాహుల్ పాదయాత్ర జనవరి 30న జమ్మూ కశ్మీర్‌లో ముగుస్తుంది. దేశానికి ముగ్గురు ప్రధానులను ఇచ్చిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ రాజకీయ ప్రస్థానం మిగతా రాజకీయ నాయకులకు విభిన్నంగా ఉంటుంది. పట్టాభిషేకమే తరువాయి అనే యువరాజు హోదాలో రాజకీయాల్లోకి వచ్చిన ఆయనలో సహజసిద్ధమైన చొరవ, దూకుడు ఒకింత తక్కువేనని చెప్పుకోవాలి. రాజకీయాల్లోకి వచ్చాక కూడా చాలాకాలం పాటు అమ్మచాటు బిడ్డలానే కొనసాగడం, నాయకత్వం వహించాల్సిన అవసరం వచ్చినప్పుడల్లా వెనక్కు తగ్గడం ఆయన రాజకీయ శైలికి అద్దం పడుతుంది. ఇవాళ్టికీ కాంగ్రెస్‌కు అన్నీ ఆయనే. అయినప్పటికీ, ప్రతిపక్షాలకు మాత్రం ‘పప్పూ’గా మిగిలిపోయారు. ప్రతిపక్షాల అక్కసు ఎలా ఉన్నా, తనేమిటో నిరూపించుకోవడానికి జోడో యాత్ర రాహుల్‌కు మంచి అవకాశాన్నిచ్చింది. దాన్ని ఆయన హుందాగా సద్వినియోగం చేసుకున్నారని చెప్పుకోవచ్చు. జనం నుంచి యాత్రకు మంచి స్పందనే వచ్చింది. చాలామంది ప్రముఖులు, మేధావులు రాహుల్‌తో కదం కలిపి సంఘీభావం తెలిపారు. ఆయన ఆత్మవిశ్వాసాన్ని ఓ మెట్టు పైకి లేపారు. అయితే కాంగ్రెస్ పునరుజ్జీవానికి ఈ యాత్ర ఒక్కటే దోహదపడుతుందా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ ఆదరణ ఓటుగా మారుతుందా అన్నది మరో చిక్కు ప్రశ్న.

వరుస ఓటములే నేపథ్యం...

ప్రస్తుతం కేవలం మూడంటే మూడే రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పుంజుకోవడం కష్టమే! మహా అయితే లోక్‌సభలో తమ సీట్ల సంఖ్యను కొద్దో గొప్పో పెంచుకోగలదు. అంతే. నిజానికి కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా అదే గొప్ప విజయంగా భావించవచ్చు. 2014 ఎన్నికల్లో కేవలం 44 సీట్లతో బొక్కబోర్లా పడ్డ కాంగ్రెస్ ఆ తర్వాత సంస్థాగత మార్పులపై కసరత్తు చేసి 2017లో యువరాజు రాహుల్‌గాంధీని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టింది. అప్పటి దాకా అధ్యక్షురాలిగా కొనసాగిన తల్లి సోనియాగాంధీ నుంచి పార్టీ రాజదండం అందుకున్న రాహుల్ ఊహించినంతగా ప్రభావం చూపలేకపోయారు. ఆయనలో చొరవ, దూకుడు, సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉండే కలుపుగోలుతనం లోపించాయనేది ఈ సమయంలోనే స్పష్టమైంది. పద్మవ్యూహంలాంటి రాజకీయ రణాంగణంలో మెతగ్గా, హుందాగా ఉంటే నడవదు. యుద్ధాన్ని ముందుండి నడిపించే సైన్యాధిపతిలా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థి ఊహకందని వ్యూహాలతో ముందుకురకాలి. ఆలోచిద్దాం, చేద్దాంలతో పని నడవదు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికలు రాహుల్‌గాంధీ పనితీరుకు అగ్నిపరీక్ష పెట్టాయి. కానీ ఈసారి కూడా కాంగ్రెస్ కేవలం 52 సీట్లతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా కుదేలైంది. అధ్యక్ష పదవి సోనియా నుంచి రాహుల్‌కు మారినా కాంగ్రెస్ పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదు. పరాజయానికి బాధ్యత వహిస్తూ రాహుల్ రాజీనామా చేసి కొన్నాళ్లపాటు నిస్తేజంగా ఉండిపోయారు. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ పెద్దలంతా కూడా సుదీర్ఘ ఆలోచనల్లో మునిగిపోయారు. గత మేలో ఉదయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ చింతన్ శిబిరంలో మేధోమథనం చేసి భారత్ జోడో యాత్రకు రూపకల్పన చేశారు.

‘జోడో యాత్ర’ ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో ఆగుతూ.. కదులుతూ... సాగుతోంది. వివాదాలకూ, వివాదాస్పద వ్యాఖ్యలకూ దూరంగా ఉంటూ, మనసులోని మాటను జనాలతో పంచుకుంటూ రాహుల్ యాత్రను కొనసాగిస్తున్నారు. సామాజిక సమస్యలు, మత సామరస్యం, ఆర్థిక అసమానతలు, రాజకీయ పెత్తందారీ పోకడల వంటి అంశాలే అజెండాగా ప్రజలతో మమేకమై చిట్టిపొట్టి విలేకరుల సమావేశాల్లో తన గళం వినిపిస్తూ వచ్చారు. ప్రధాన మీడియా చానళ్లు, పత్రికలకు సాధ్యమైనంత దూరంగా ఉన్నారు. యాత్ర సాగుతున్న తీరు, అభిమానుల ఆత్మీయ స్పర్శ, విలేకరుల సమావేశాలను తన హ్యాండ్లర్ ద్వారా యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడాన్ని యాత్ర తొలి రోజు నుంచి

ఆదరణ ఓటుగా మారేనా?

ఏనాడూ మిస్ కాలేదు. ప్రతిపక్షాలు రుద్దిన ‘పప్పూ’ ట్యాగ్ నుంచి బయట పడటానికి ఇది బాగా దోహదపడింది. యాత్ర మొదలైన సెప్టెంబర్ నుంచి ఇప్పటిదాకా ఈ యూట్యూబ్ చానల్‌కు లక్షల్లో కొత్త వీక్షకులు జతగూడారు. ప్రధాని మోదీ పనితీరు, బీజేపీ అధికార దర్పం పట్ల అసంతృప్తిగా ఉన్నవాళ్లను రాహుల్ తన కొత్త వ్యవహార శైలితో ఆకర్షించగలిగారు. గత జనవరితో పోలిస్తే ఆయనకు స్వల్పంగా జనాదరణ పెరిగిందని పలు చానళ్ల సర్వేలు చెబుతున్నాయి. అయితే ఈ ఆదరణ వచ్చే జనవరికి పెరుగుతుందో, తరుగుతుందో చూడాలి. ఈ యాత్ర కాంగ్రెస్‌లో కచ్చితంగా కొత్త ఆశలు రేపిందనడంలో సందేహం లేదు. అయితే ఇదొక్కటే చాలదు. అటు లోక్‌సభలోనూ, ఇటు ప్రజల్లోనూ నిర్మాణాత్మక విమర్శలు, చేతలతో ప్రజల విశ్వాసం చూరగొనడానికి కాంగ్రెస్ ప్రయత్నించాలి. సొంతింట్లోనే చిచ్చు రాజేసే క్యాంపు రాజకీయాలకు స్వస్తి పలకాలి. అధికారం లేనిచోట ఒక్కతాటిపై నిలిచే ప్రయత్నం చేయాలి. తాను మారిన మనిషనని ఈ పాదయాత్ర ద్వారా రాహుల్‌గాంధీ నిరూపించుకున్నట్టే యాత్ర ద్వారా చేకూరిన లబ్ధిని కాంగ్రెస్ సద్వినియోగం చేసుకోగలగాలి. లేదంటే రాహుల్ భారత్ జోడో యాత్ర ఓటు జోడో యాత్రగా మారకుండా సుదీర్ఘ ‘ఈవినింగ్ వాక్’గానే మిగిలిపోతుంది!

నేలమీద పడేసి చేతులు విరగ్గొట్టి

- మరో నల్లజాతీయుడిపై అమెరికా పోలీసుల హింసాకాండ
- జార్జ్ ఫ్లాయిడ్ ఉదంతాన్ని తలపిస్తున్న నికోల్స్ మరణం
- పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు

టెన్నెసీ: అమెరికాలో పోలీసుల క్రూరత్వం ఏ స్థాయిలో ఉంటుందో తెలిపే ఘటన మరొకటి వెలుగులోకి వచ్చింది. టెన్నెసీ రాష్ట్రంలోని మెంఫిస్ నగర పోలీసులు 29 ఏళ్ల నల్లజాతీయుడ్ని దారుణంగా హింసించడంతో ఆ దెబ్బలకు తాళలేక అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ నెల మొదట్లో జరిగిన దారుణానికి సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి రావడంతో పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు ఎగిసిపడుతున్నాయి. 2020 మేలో జార్జ్ ఫ్లాయిడ్ అనే నల్లజాతీయుడ్ని శ్వేతజాతీయుడైన పోలీసు అధికారి గొంతుపై బూటు కాలుతో తొక్కి చంపిన ఘటనని తలపించేలా ఈ దౌర్జన్య కాండ కూడా సాగింది. కాకపోతే తాజా ఘటనకు పాల్పడ్డ పోలీసులు కూడా నల్లజాతీయులే! ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఫెడెక్స్‌లో పనిచేసే 29 ఏళ్ల టైర్ నికోల్స్‌ను ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై మెంఫిస్ పోలీసులు జనవరి 7న ఆపారు. వాహనంలోంచి లాగి నేలమీద పడేసి దారుణంగా కొట్టారు. తాను ఏ తప్పు చేయలేదంటూ వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తుండగా ఆరుగురు పోలీసులు అతనిపై పెప్పర్ స్ప్రే చల్లి, ఎలక్ట్రిక్ పరికరాలతో షాకిచ్చి కిందపడేశారు. ముఖంపై ఇష్టారాజ్యంగా కొట్టారు. వికృతానందంతో నవ్వుతూ భుజం విరిగేలా కొట్టారు. ‘మామ్ , మామ్’ అంటూ నికోల్స్ దీనంగా రోదిస్తున్నా రెండు నిమిషాల పాటు ఆపకుండా చితక్కొట్టారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనవరి 10న మరణించాడు. పోలీసులు కొడుతున్న వీడియో చూసి ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ దౌర్జన్యాలు ఇంకా ఎన్నాళ్లంటూ రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. పోలీసులపై హత్యానేరం కింద అభియోగాలు నమోదు చేశారు. నికోల్స్‌కు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. నికోల్స్ తన భుజంపై తల్లి వెల్స్ పేరును టాటూగా వేసుకున్నాడు. తన కొడుకు దారుణ హింసకు గురై మరణించాడంటూ విలపిస్తున్న ఆమెను ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.

బైడెన్ దిగ్భ్రాంతి

టైర్ నికోల్స్‌పై పోలీసుల హింసాకాండపై బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత దారుణమైన ఆ ఘటనకు సంబంధించిన వీడియో చూస్తే మనసు కలచివేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. నల్లజాతీయులకు దేశంలో ఎదురవుతున్న ఎదురుదెబ్బలకి ఇది మరొక ఉదాహరణన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానన్నారు. నికోల్స్ కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.





పోలీసుల చేతిలో దెబ్బలు తిని నిస్తేజంగా పడున్న నికోల్స్. (ఇన్‌సెట్‌లో) అతనిపై పెప్పర్ స్ప్రే జల్లుతున్న పోలీసులు

అణగారిన వర్గాల సాధికారతే ధ్యేయం

- గుజ్జర్ యోధులకు గుర్తింపు దక్కలేదు
- శ్రీదేవనారాయణ్ వేడుకల్లో ప్రధాని మోదీ

జైపూర్: ‘‘సమాజంలో అణగారిన వర్గాల సాధికారతే మా ప్రభుత్వ ధ్యేయం. అందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాం’’ అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వంచిత్ కో వరీయత (పీడితులకు తొలి ప్రాధాన్యం) నినాదంతో సాగుతున్నామన్నారు. శనివారం రాజస్తాన్‌లో భిల్వారా జిల్లా మాలాసేరీ డుంగ్రీలో గుజ్జర్ల ఆరాధ్యుడు శ్రీదేవనారాయణ్ ఆధ్యాత్మిక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ‘‘ప్రపంచ దేశాలు ఆశలు, ఆకాంక్షలతో భారత్ వైపు చూస్తున్నాయి. భారత్ తన బలాన్ని, అధికారాన్ని ప్రదర్శిస్తోంది, అంతర్జాతీయ వేదికలపై శక్తిని నిరూపించుకుంటోంది’’ అన్నారు.

పొరపాట్లను సరిదిద్దుకుంటున్న ‘నవ భారత్’

స్వాతంత్య్ర పోరాటంతోపాటు ఇతర ఉద్యమాల్లో గుజ్జర్ల పాత్ర మరువలేనిదని మోదీ ప్రశంసించారు. వారికి చరిత్రలో తగిన గుర్తింపు దక్కకపోవడం దురదృష్టకరమని అన్నారు. ‘‘గత పొరపాట్లను ‘నవ భారత్’ సరిదిద్దుకుంటోంది. దేశాన్ని సిద్ధాంతపరంగా విచ్ఛిన్నం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగినా విఫలమయ్యాయి. నాగరికత, సంస్కృతి, సామరస్యం, శక్తి సామర్థ్యాల వ్యక్తీకరణే భారత్’’ అన్నారు. దేశ ఐక్యతను భగ్నం చేసే వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మన వారసత్వం మనకు గర్వకారణం

వేలాది సంవత్సరాల భారతదేశ ప్రయాణంలో సామాజిక బలం గణనీయమైన పాత్ర పోషించిందని నరేంద్ర మోదీ వివరించారు. మన వారసత్వం మనకు గర్వకారణమని, బానిస మనస్తత్వం నుంచి బయటపడాలని ఉద్బోధించారు. దేశం పట్ల మనం నిర్వర్తించాల్సిన విధులను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కోరారు. ‘‘ప్రజాసేవకు శ్రీదేవనారాయణ్ ప్రాధాన్యమిచ్చారు. ఆయన కమలంలో ఉద్భవించారు. భారత్ సారథ్యం వహిస్తున్న జీ–20 లోగోలో కమలం ఉంది. బీజేపీ ఎన్నికల గుర్తయిన కమలంతో నాకెంతో అనుబంధముంది. గుజ్జర్ సామాజిక వర్గంతోనూ చక్కటి స్నేహ సంబంధాలున్నాయి’’ అన్నారు.



ఐక్యతా మంత్రమే విరుగుడు

న్యూఢిల్లీ: ప్రజల మధ్య విభేదాలు, అంతరాలను సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఎన్నడూ విజయవంతం కాబోవని మోదీ అన్నారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని కరియప్ప గ్రౌండ్‌లో ఎన్‌సీసీ ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ‘‘దేశ పునర్వైభవ సాధనకు ఐక్యతే ఏకైక మార్గం. అన్నింటికీ అదే ఏకైక విరుగుడు. యువత తన ముంగిట ఉన్న అపార అవకాశాలను వాడుకోవాలి’’ అన్నారు. ఎన్‌సీసీ 75వ వ్యవస్థాపక దినం సందర్భంగా ముద్రించిన 75 రూపాయల నాణేన్ని, కవర్‌ను విడుదల చేశారు.

భారత్ జోడో యాత్ర పునఃప్రారంభం

రేపు శ్రీనగర్‌లో బహిరంగ సభ

అవంతిపురా/శ్రీనగర్/న్యూఢిల్లీ: కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య శనివారం పునఃప్రారంభమైంది. రాహుల్ గాంధీ ఉదయం 9.20 గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. భద్రతాపరమైన లోపాలున్నాయంటూ శుక్రవారం మధ్యాహ్నం యాత్రను నిలిపేయడం తెలిసిందే. దాంతో శనివారం మూడంచెల భద్రత కల్పించారు. 2019 ఫిబ్రవరిలో పుల్వామా జిల్లాలో ఉగ్రవాద దాడిలో మరణించిన 40 సీఆర్‌పీఎఫ్ జవాన్లకు రాహుల్ గాంధీ శనివారం నివాళులర్పించారు. జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై జైషే మొహమ్మద్ ఉగ్రవాది ఆత్మాహుతి దాడిలో బస్సు ధ్వంసమైన చోట పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

యాత్రలో ప్రియాంకా గాంధీ

భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. శనివారం లెథ్‌పురాలో సోదరుడు రాహుల్ గాంధీపాటు పాదయాత్రలో భాగస్వాములయ్యారు. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని చుర్సూలో పీడీపీ అధ్యక్షురాలు మొహబూబా ముఫ్తీ, ఆమె కుమార్తె ఇల్తిజా ముఫ్తీ సైతం రాహుల్ గాంధీతోపాటు జోడో యాత్రలో పాల్గొన్నారు.

తాజా గాలి పీల్చుకున్నట్లే ఉంది: ముఫ్తీ

కశ్మీర్‌లో జోడో యాత్ర జరగడం తాజా గాలి పీల్చుకున్నట్లుగా ఉందని మెహబూబా ముఫ్తీ శనివారం ట్వీట్ చేశారు. 2019 తర్వాత తొలిసారిగా భారీ సంఖ్యలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చారని చెప్పారు. యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి నడవడం గొప్ప అనుభవమని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం జోడో యాత్ర ఆదివారం ఉదయం పంథాచౌక్ నుంచి పునఃప్రారంభం కానుంది. శ్రీనగర్‌లో బోలివార్డ్ రోడ్డులోని నెహ్రూ పార్కు వరకూ యాత్ర సాగుతుంది. సోమవారం శ్రీనగర్ ఎంఏ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జెండా ఎగురవేస్తారు. అనంతరం ఎస్‌కే స్టేడియంలో విపక్ష పార్టీల నేతలతో కలిసి బహిరంగ సభలో పాల్గొంటారు.



అమిత్ షాకు మల్లికార్జున ఖర్గే లేఖ

జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న భారత్‌జోడో యాత్రకు తగిన భద్రత కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. యాత్రలో భద్రతాపరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు.

సుఖోయ్, మిరాజ్ ఢీ.. పైలట్ మృతి

మరో ఇద్దరికి గాయాలు • మధ్యప్రదేశ్‌లో ఘటన



న్యూఢిల్లీ/భరత్‌పూర్/మొరెనా: భారత వైమానిక దళం(ఐఏఎఫ్)నకు చెందిన సుఖోయ్ 30ఎంకేఐ, మిరాజ్–2000 యుద్ధ విమానాలు ఢీకొన్న అరుదైన ఘటనలో ఒక పైలెట్ మృతి చెందారు. మరో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కు సమీపంలో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఐఏఎఫ్ బేస్‌గా ఉన్న గ్వాలియర్ విమానాశ్రయం నుంచి ఈ రెండు విమానాలు రోజువారీ సాధారణ శిక్షణలో భాగంగా బయలుదేరాయి. మొరెనా జిల్లా పహార్‌గఢ్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో అవి ప్రమాదవశాత్తు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఘటనలో సింగిల్ సీటర్ మిరాజ్–2000 పైలెట్ వింగ్ కమాండర్ హనుమంతరావు సారథి చనిపోగా ట్విన్ సీటర్ సుఖోయ్ ఫ్లయిట్‌లోని ఇద్దరు పైలెట్లు ఎజెక్ట్ అయి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వింగ్ కమాండర్ శరీర భాగాలు పహార్‌గఢ్ ప్రాంతంలో లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. విమాన శకలాలు కొన్ని పొరుగునే ఉన్న రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలోనూ పడిపోయాయి. దీనిపై ఐఏఎఫ్ దర్యాప్తునకు ఆదేశించింది. ఘటనకు సంబంధించిన వివరాలను ఐఏఎఫ్ చీఫ్ వీఆర్ చౌధరి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. ఫ్లయిట్ డేటా రికార్డుల విశ్లేషణ అనంతరమే ఘటనకు దారి తీసిన కారణాలు తెలుస్తాయన్నారు. ఐఏఎఫ్ చరిత్రలో మిరాజ్, సుఖోయ్ ఢీకొనడం ఇదే తొలిసారి. దేశంలో గత 70 ఏళ్లలో ఇలాంటి 64 ప్రమాదాల్లో 39 మంది పైలట్లు ప్రాణాలు కోల్పోయారని వైమానిక నిపుణుడు అంచిత్ గుప్తా తెలిపారు.

కొలీజియం సిఫార్సులపై సాగదీత...
ప్రజాస్వామ్యానికి పెను ముప్పు

న్యాయవ్యవస్థ కుప్పకూలుతుంది • జస్టిస్ నారిమన్

ముంబై: కొలీజియం వ్యవస్థపై కేంద్ర న్యాయ మంత్రి కిరెణ్ రిజిజు చేస్తున్న విమర్శలను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్ శనివారం తీవ్రంగా తప్పుబట్టారు. ‘‘సాధారణ పౌరునిగా కొలీజియంతో పాటు ప్రతి వ్యవస్థనూ విమర్శించవచ్చు. కానీ ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా మాత్రం నియమ నిబంధనలకు, కట్టుబాట్లకు లోబడి ఉండాల్సిందే’’ అన్నారు. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను కేంద్ర ప్రభుత్వం సుదీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెడుతున్న వైనాన్ని ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా ఆయన అభివర్ణించారు. ‘‘నిర్భీతితో కూడిన స్వతంత్ర న్యాయమూర్తులు లేకుండా పోతే పరిస్థితేమిటి? న్యాయ వ్యవస్థ మన చివరి ఆశా కిరణం. అది కూడా కుప్పకూలితే దేశానికిక చీకటి రోజులే. తప్పో, ఒప్పో.. 1993 నాటి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా కొలీజియం వ్యవస్థ పుట్టుకొచ్చింది. దాన్ని గౌరవించడం కేంద్రం విధి. ఎందుకంటే అన్ని వ్యవస్థలూ సుప్రీంకోర్టు తీర్పులకు కట్టుబడాల్సిందే’’ అన్నారు. తనకు అనుకూలమైన కొలీజియం వచ్చి పాత సిఫార్సులపై పునరాలోచన చేస్తుందనేది కేంద్రం వైఖరి అని అభిప్రాయపడ్డారు. అందుకే కొలీజియం సిఫార్సులపై 30 రోజుల్లోగా కేంద్రం స్పందించని పక్షంలో దాన్ని అంగీకారంగానే పరిగణించేలా ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించాలన్నారు.

త్రిపురలో 54 మందితో బీజేపీ జాబితా

న్యూఢిల్లీ: ఫిబ్రవరి 16న జరగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ 54 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఇందులో కేంద్ర మంత్రి ప్రతిమా భౌమిక్ పేరు కూడా ఉన్నారు. ఆమె ధన్‌పూర్ నుంచి, సీఎం మాణిక్ సాహా బోర్డోవాలి నుంచి బరిలో దిగుతున్నారు. ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ)తో సీట్ల సర్దుబాటు ఖరారైందని సాహా చెప్పారు. బీజేపీ 55 చోట్ల, ఐపీఎఫ్‌టీ 5 స్థానాల్లో పోటీ చేస్తాయన్నారు. అసెంబ్లీలోని 60 సీట్లకు 2018 ఎన్నికల్లో బీజేపీ, ఐపీఎఫ్‌టీ 43 స్థానాలను గెలుచుకున్నాయి. మరోవైపు విపక్ష సీపీఎం, కాంగ్రెస్ కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి.

అడుగంటిన విదేశీ మారక నిల్వలు

అల్లాడుతున్న పాకిస్తాన్

ఇస్లామాబాద్: పీకల్లోతు ఆర్థిక సంక్షోభంతో అష్టకష్టాలు పడుతున్న పాకిస్తాన్‌కు విదేశీ రుణాలు సైతం దొరకడం లేదు. 2022లో జూలై నుంచి డిసెంబర్ వరకు కేవలం 5.6 బిలియన్ డాలర్ల రుణాలు లభించాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) రుణ కార్యక్రమాన్ని పునరుద్ధరించే విషయంలో సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందంటున్నారు. విదేశీ మారక నిల్వలు 3.1 బిలియన్ డాలర్లకు అడుగంటాయి. కొత్త అప్పులు పుట్టడం లేదు. తీసుకున్న అప్పులపై వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయి. వాటి చెల్లింపుకూ అప్పులే గతి!

క్రెడిట్ రేటింగ్ దెబ్బ

పాకిస్తాన్‌కు డిసెంబర్‌లో 532 మిలియన్ డాలర్ల రుణం లభించింది. ఇందులో 44 శాతం అంటే.. 231 మిలియన్ డాలర్లను ఆసియన్ అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) రుణంగా ఇచ్చింది. పాక్ ప్రభుత్వం చాలా దేశాలకు చెల్లింపులు చేయాల్సి ఉంది. గత ఏడు రోజుల్లో చైనా ఆర్థిక సంస్థలకు 828 మిలియన్ డాలర్లు చెల్లించింది.



ఢిల్లీలో శనివారం బీటింగ్ రిట్రీట్ వేడుక ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ సందర్భంగా జరిగిన డ్రోన్ షోలో పలు ఆకృతులు ఇలా కనువిందు చేశాయి

మొఘల్ గార్డెన్స్ ఇక...
అమృత్ ఉద్యాన్





వ్యతిరేకిస్తున్న విపక్షాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద ఉన్న చారిత్రక మొఘల్ గార్డెన్స్ పేరు మారింది. మొఘల్ గార్డెన్స్ పేరును అమృత్ ఉద్యాన్‌గా ప్రభుత్వం మార్చి వేసింది. అమృత్ ఉద్యాన్ జనవరి 31 నుంచి ప్రజల సందర్శనార్థం తెరచి ఉంటుందని శనివారం రాష్ట్రపతి భవన్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్ సహా అన్ని గార్డెన్లను కలిపి ఇకపై ‘అమృత్ ఉద్యాన్’గా పిలుస్తారు. ఏటా సాధారణ ప్రజల సందర్శనకు వీలుగా ఈ గార్డెన్స్ (హెర్బల్ గార్డెన్, బోన్సాయ్ గార్డెన్, సెంట్రల్ లాన్, లాంగ్ గార్డెన్, సర్క్యులర్ గార్డెన్) దాదాపు 2 నెలల పాటు తెరిచి ఉంటాయి. కాగా ఈ ఏడాది రాష్ట్రపతి భవన్ ఉద్యానోత్సవ్ –2023ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 31 నుంచి మార్చి 26వ తేదీ వరకు సాధారణ ప్రజానీకానికి, మార్చి 28 నుంచి 31 వరకు కొన్ని ప్రత్యేక వర్గాల వారి కోసం అమృత్ ఉద్యాన్‌ను తెరిచి ఉంచనున్నారు. మార్చి 28న రైతులకు, మార్చి 29న వికలాంగులకు, మార్చి 30న రక్షణ బలగాలు, పారామిలిటరీ బలగాలు, పోలీసు సిబ్బందికి, మార్చి 31న గిరిజన మహిళల స్వయం సహాయక సంఘాలతో సహా మహిళలకు ప్రత్యేక ప్రవేశం కల్పించనున్నట్లు రాష్ట్రపతి కార్యాలయ డిప్యూటీ సెక్రటరీ నావికా గుప్తా శనివారం మీడియాకు తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండే 6 స్లాట్స్‌లో గంటకు 5 వేల నుంచి 10 వేల మంది సందర్శించేలా ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అనుమతించనున్నారు. అమృత్ ఉద్యాన్‌లో ప్రత్యేక రంగుల తులిప్స్ మొక్కలతో పాటు, 40 రకాల సువాసనలు వెదజల్లే గులాబీలు, బ్లాక్, గ్రీన్ గులాబీలు సహా రకరకాల పూలు ఉన్నాయి. సందర్శకుల కోసం గార్డెన్స్‌లో 20 మంది గైడ్లు అందుబాటులో ఉంటారని రాష్ట్రపతి కార్యాలయం పేర్కొంది.

పేరు మార్పుపై ప్రతిపక్షాల విమర్శలు..

వలస పాలనకు సంబంధించిన మరో ఆనవాలును చెరిపేసినట్లు అధికార బీజేపీ పేర్కొంది. వలసవాద చిహ్నాలను లేకుండా చేయాలన్న విధానంలో భాగంగానే కొన్ని సంస్థల, ప్రాంతాల పేర్లు మార్చుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఢిల్లీలోని ప్రఖ్యాత రాజ్‌పథ్‌కు కర్తవ్య పథ్‌గా పేరు పెట్టిన విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వం తీరుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఇలాంటి విషయాలపై దృష్టి పెట్టడానికి బదులుగా దేశంలో ప్రబలిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వానికి హితవు పలికాయి. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాతో దేశ చరిత్ర మళ్లీ రాసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీఎంసీ, సీపీఎం విమర్శించాయి. ఈడెన్ గార్డెన్స్‌కు మోదీ గార్డెన్స్ అని కూడా పేరు పెడతారేమో, ఎవరికి తెలుసు? అంటూ టీఎంసీ ఎద్దేవా చేసింది.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 29 । జనవరి । 2023



యజమానిపైనే కూల్చివేత వ్యయం

ప్రస్తుతం కూల్చివేతలు జరుగుతున్న సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనం కూల్చివేత ఖర్చుల్ని భవన యజమానికే విధించనున్నారు. -9లో



నకిలీ గ్యారంటీ పత్రాలతో బురిడీ

బ్యాంక్ గ్యారంటీ పత్రాలు నకిలీవి సృష్టించి కంపెనీలను మోసం చేస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. -9లో

నార్త్‌కరోలినా గవర్నర్‌తో మేయర్

సాక్షి, సిటీబ్యూరో: అమెరికా పర్యటనలో ఉన్న నగర మేయర్ విజయలక్ష్మి నార్త్ కరోలినా గవర్నర్ రాయ్ కూపర్‌ను ఆయన నివాసంలో కలిశారు. మేయర్ వెంట సిటీ సెనేటర్ జయ్ చౌదరి కూడా ఉన్నారు. మేయర్ గతంలో నార్త్ కరోలినా నివాసి. ప్రజా సేవే లక్ష్యంగా అమెరికన్ సిటిజెన్‌షిప్ వదులుకొని రాజకీయాల్లోకి రావడంపై రాయ్‌కూపర్ ఆనందం వ్యక్తం చేసినట్లు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది.





జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి రథోత్సవ ఊరేగింపు శనివారం సాయంత్రం నేత్రపర్వంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలు, రంగురంగుల విద్యుద్దీపాలు, ఆకాశాన్నంటే బాణసంచా విన్యాసాల నడుమ అమ్మవారి రథం ముందుకు కదిలింది. నగర వ్యాప్తంగా వేలాది మంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తజన సందోహంతో జూబ్లీహిల్స్ రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. - బంజారాహిల్స్

ప్రైవేటుకే ఉపాధి కల్పన

ఉద్యోగాల నియామకాలకు జాబ్ మేళాలు

- పొరుగు సేవల కోసం ఏజెన్సీల ఎంపిక
- కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం
- క్రమంగా తగ్గుతున్న నమోదు, పునరుద్ధరణ
- నామమాత్రంగా ఉపాధి కల్పనా శాఖ

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్	మొత్తం అభ్యర్థులు	పురుషులు	మహిళలు
హైదరాబాద్	12,216	7,159	5,057
ఉస్మానియా యూనివర్సిటీ	52,364	31,994	20,370
మేడ్చల్–మల్కాజిగిరి	5,295	3,092	2,203
రంగారెడ్డి జిల్లా	6,043	3,754	2,289



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉపాధి కల్పనా శాఖ కార్పొరేట్, ప్రైవేటు రంగాలకు కల్పతరువుగా మారింది. ఆయా సంస్థల కోసం జాబ్ మేళాలను నిర్వహిస్తూ ఉద్యోగులను వెతికి పెడుతోంది. ఒకప్పుడు నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఈ శాఖ ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగాల భర్తీలో బిజీగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం విద్యార్హతలతో సహా పేర్లు నమోదు చేసుకున్న నిరుద్యోగులు లక్షల్లో ఉన్నా.. వయోపరిమితి దాటిపోయే వరకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. కనీసం ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఏజెన్సీ ఎంప్యానల్‌మెంట్‌కే పరిమితమైంది.

పొరుగు సేవల్లో అంతంతే..

- ఉపాధి కల్పనా శాఖ ప్రైవేటుపై దృష్టి సారించింది. సాధారణంగా కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు వ్యాపార ఆర్థిక లావేదేవీలను బట్టి ఉద్యోగుల సంఖ్యను కుదించడం, పెంచడం చేస్తుంటాయి. కరోనా నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. సాధారణ పరిస్థితులు ఏర్పడగానే తిరిగి నిపుణులైన ఉద్యోగుల కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ఉపాధి కల్పనా శాఖ ఆయా సంస్థలకు ఉద్యోగులను వెతికిపెట్టే బాధ్యతను భుజానా ఎత్తుకుంది. జాబ్ మేళాలు నిర్వహిస్తూ చిరు ఉద్యోగం నుంచి పెద్ద ఉద్యోగుల ఎంపిక కోసం సంధాన కర్తగా వ్యవహరిస్తోంది.
- ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం కేవలం ఏజెన్సీల నమోదుకు పరిమితమైంది. కొత్త ఉద్యోగ భర్తీ లేక పొరుగుసేవల కింద నియామకాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఉపాధి కల్పన కేంద్రంలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల్లో అర్హులైన వారికి సమాచారం అందించి ఎంపిక చేయాలి. ఇందు కోసం ఏర్పాటు చేసిన కమిటీకి ఉపాధి కల్పనా శాఖ అధికారి కో కన్వీనర్‌గా వ్యవహరించాలి. పొరుగుసేవల ఉద్యోగాలు నియామకాలు సాగుతున్నా.. అవి ఉపాధి కల్పనా శాఖ ద్వారా ఎంపిక జరిగిన దాఖలాలు మాత్రం లేవు. ఫలితంగా ఏజెన్సీలు తమకు నచ్చిన వారిని ఎంపిక చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

అచేతనంగా..

రెండు దశాబ్దాల వరకు ఉపాధి కల్పనా శాఖ నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా వెలిగి ప్రస్తుతం అచేతనంగా తయారైంది. అప్పట్లో ఏ శాఖకు లేని ప్రతిష్ట ఈ శాఖ ఉండేది. సర్కారు కొలువులకు ఉపాధి కల్పన శాఖలో నమోదు తప్పనిసరిగా ఉండేది. దీంతో నిరుద్యోగులు ఈ ఆఫీస్‌కు క్యూ కట్టి నమోదు చేసుకున్నారు. అభ్యర్థులకు సీనియారిటీ ప్రకారం విద్యార్హతలను బట్టి ఆయా శాఖల్లో ఉన్న ఉద్యోగాల ఇంటర్వ్యూల కోసం వర్తమానం అందేది. ప్రభుత్వ నోటిఫికేషన్ విధానం అందుబాటులో రావడంతో శాఖకు వన్నె తగ్గినట్లయింది. ప్రస్తుతం కేవలం అభ్యర్థుల పేర్లు నమోదు, పునరుద్ధరణ, ప్రైవేటు సేవలకు పరిమితమైంది.

ఆశల్లోనే అభ్యర్థులు..

ఉపాధి కల్పనా శాఖపై అభ్యర్థుల్లో ఆశలు సన్నగిల్లలేదు. సర్కారు కొలువుపై ఆశతో నమోదు, పునరుద్ధరణ కొనసాగుతూనే ఉంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత అభ్యర్థుల నమోదు కొంత మేరకు పెరిగింది. రాష్ట్రం మొత్తం మీద 2014 జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు 2,72,124 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో పురుషులు 1,62,928 ఉండగా, మహిళా అభ్యర్థులు 1,09,196 ఉన్నారు.

“ ఒక్క కాల్ లెటర్ రాలేదు



ప్రభుత్వ ఉద్యోగంపై ఆశతో ఉపాధి కల్పనా శాఖలో విద్యార్హతతో పేరు నమోదు చేసుకున్నా.. ఒక్క కాల్ లెటర్ రాలేదు. కేవలం ప్రైవేటు ఉద్యోగాల జాబ్ మేళాలకే ఉపాధి కల్పనా శాఖ పరిమితమైంది. సర్కారు కొలువుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

– నీలం దీపిక, హైదరాబాద్

అవుట్ సోర్సింగ్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి



అవుట్‌సోర్సింగ్ లోనైనా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలి. సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం కల్పించి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలి.

– పి.ప్రవీణ్ కుమార్

బదిలీల పర్వం

- ఈ నెలలో వరుసగా మూడోసారి
- డీఎస్పీ, ఏసీపీ ర్యాంకు అధికారులకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పోలీసు శాఖలో బదిలీల పర్వం కొనసాగుతోంది. ఒకే నెలలో వరుసగా మూడుసార్లు మొత్తం 161 మంది పోలీసుల అధికారులను బదిలీలు చేయటం రాష్ట్ర చరిత్రలో తొలిసారి. ఈ నెల 3న 29 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. 25న ఒకేసారి 91 మంది అధికారులను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం రాత్రి మరో 41 మంది పోలీసులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి డీఎస్పీ/ఏసీపీ ర్యాంకు అధికారులకు స్థానచలనం కల్పించింది. వీరిలో 14 మంది పోలీసు అధికారులు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్ల నుంచి ఉన్నారు.

బదిలీ అయిన అధికారులు వీరే..

పేరు.. ప్రస్తుత స్థానం..	కొత్త స్థానం
వై.వెంకట్‌రెడ్డి.. ఏసీపీ, సీసీఎస్, హైదరాబాద్..	కుషాయిగూడ ఏసీపీ
పూనాటి నర్సింహారావు.. ఇంటెలిజెన్స్ డీఎస్పీ..	మియాపూర్ ఏసీపీ
ఎస్.వెంకట్‌రెడ్డి.. డీఎస్పీ రోడ్ సేఫ్టీ సీఐ..	మేడ్చల్ ఏసీపీ
ఎస్.సైదులు.. ఏసీపీ, ట్రాఫిక్ భువనగిరి..	యాదాద్రి ఏసీపీ
జీవీ.రమణగౌడ్.. డీఎస్పీ హెచ్ఎండీఏ..	నార్సింగి ఏసీపీ
సి.అంజయ్య.. ఏసీపీ ట్రాఫిక్ ఎల్బీనగర్..	మహేశ్వరం ఏసీపీ
కె.శ్రీనివాస్‌రావు.. డీటీసీ, నల్లగొండ..	ట్రాఫిక్, సౌత్‌జోన్ ఏసీపీ
పి.ధనలక్ష్మి.. ఏసీపీ, సీఏఆర్, సైబరాబాద్..	కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ
కె.పూర్ణచందర్.. డీఎస్పీ, ఇంటెలిజెన్స్..	అబిడ్స్ ఏసీపీ
ఎస్.ప్రభాకర్.. డీటీసీ, సంగారెడ్డి..	చేవెళ్ల ఏసీపీ
ఎస్ఆర్. దామోదర్ రెడ్డి.. ఏసీపీ, సీసీఎస్, డీడీ, హైదరాబాద్..	మీర్‌చౌక్ ఏసీపీ
మహ్మద్ గౌస్.. డీఎస్పీ, ఇంటెలిజెన్స్..	సంతోష్‌నగర్ ఏసీపీ
జి.శ్యాంసుందర్.. డీఎస్పీ, సీఐడీ..	మలక్‌పేట ఏసీపీ
ఎస్. మోహన్ కుమార్.. ఏసీపీ, సీసీఎస్, హైదరాబాద్..	పంజగుట్ట ఏసీపీ

సమ్మోహన తీరం



సరికొత్తగా హుస్సేన్‌సాగర్

- ఒకవైపు అమరుల స్మారక చిహ్నం
- మరోవైపు మ్యూజికల్ ఫౌంటెన్
- ఇంకోవైపు ఫార్ములా– ఈ వేడుకలు
- ఆకట్టుకునేలా ఎలక్ట్రిక్ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ తీరం సమ్మోహన రాగం ఆలపించనుంది. సరికొత్త అందాలను సంతరించుకోనుంది. ఒకవైపు అలలపై వెల్లువెత్తే సంగీత ఝరి.. మహోన్నతమైన హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ వైభవాన్ని ప్రదర్శించే లేజర్ షో.. నగరవాసులను, సందర్శకులను, పర్యాటకులను సమ్మోనంగా ఆకట్టుకోనుంది. మరోవైపు అమరుల త్యాగాలను సమున్నతంగా ఆవిష్కరించేలా ఎంతో అద్భుతంగా రూపొందించిన అమరుల స్మారక చిహ్నం కూడా ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. అలనాటి వైభవాన్ని మరోసారి గుర్తుకు తెచ్చేవిధంగా ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సులు సైతం అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు హుస్సేన్ సాగర్ జలాలపై నడిచిన అనుభూతిని కలిగించే వేలాడే వంతెన సైతం ప్రారంభానికి సిద్ధమవుతోంది. మొత్తంగా నెక్లెస్‌రోడ్డులో ఫిబ్రవరి మొదటి వారం నుంచి సందడి నెలకోనుంది.

ఫార్ములా– ఈ పనులు శరవేగం..

- ఫార్ములా– ఈ అంతర్జాతీయ పోటీలకు నెక్లెస్ రోడ్డు సన్నద్ధమవుతోంది. స్వల్ప మార్పులు, చేర్పులతో 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌ను పునరుద్ధరించారు. ఫిబ్రవరి 11న జరగనున్న ఈ పోటీల్లో 11 ఆటోమొబైల్ దిగ్గజ సంస్థలకు చెందిన ఎలక్ట్రిక్ కార్లు పాల్గొననున్న సంగతి తెలిసిందే. 22 మంది రేజర్లు ఈ పోటీల్లో తమ సత్తా చాటనున్నారు. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ఈ వాహనాలు పరుగులు తీయనున్నాయి.
- సందర్శకులకు ఇదో సరికొత్త అనుభూతి కానుంది. మరోవైపు ఈ అంతర్జాతీయ పోటీల నాటికే నెక్లెస్‌రోడ్డు పరిసరాలను మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే చేపట్టిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఎలక్ట్రిక్ కార్లు దూసుకెళ్లే ట్రాక్‌ను నీలిరంగు డివైడర్‌లతో ఆకర్షణీయంగా రూపొందించారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే మోటార్ స్పోర్ట్స్ ప్రియులకు ఫార్ములా–ఈ పోటీలకు చక్కటి అనుభూతినిచ్చేవిధంగా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 25 వేల మందికి పైగా వీక్షించేందుకు అనుగుణంగా ఇవి అందుబాటులోకి రానున్నాయి.

అలలపై సంగీత సవ్వడులు..

హుస్సేన్‌సాగర్‌లో సుమారు రూ.18 కోట్లతో హెచ్‌ఎండీఏ చేపట్టిన మ్యూజికల్ ఫౌంటెన్ కూడా ఫార్ములా– ఈ పోటీల నాటికి ప్రారంభం కానుంది. మిరుమిట్లుగొలిపే రంగు రంగుల వెలుగు జిలుగుల నడుమ ఉవ్వెత్తున ఎగిసిపడే జలాలు.. నేపథ్యంగా వినిపించే ఆహ్లాదభరితమైన సంగీతం సందర్శకులకు చక్కటి అనుభూతిని కలిగిస్తాయి. దీంతో పాటు లేజర్ షోను కూడా ప్రదర్శించనున్నారు. నాలుగువందల ఏళ్ల హైదరాబాద్ చరిత్ర, సాంస్కృతిక విశేషాలు, వారసత్వ కట్టడాల ప్రత్యేకతలను ఈ ప్రదర్శన ద్వారా ఆవిష్కరిస్తారు. పర్యాటకులు, సందర్శకులే కాకుండా నెక్లెస్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వారు కూడా ఈ ప్రదర్శనను వీక్షించవచ్చు.మరోవైపు సంజీవయ్య పార్కుకు సమీపంలో చేపట్టిన వేలాడే వంతెన నిర్మాణం కూడా తుది దశకు చేరుకుంది. దీనిపై నడుస్తున్నప్పుడు నీటిపైనే నడుస్తున్న భావన కలుగుతుంది. పారిస్‌లోని ఓ నదిపై ఏర్పాటు చేసిన వంతెనకు నమూనాగా హెచ్‌ఎండీఏ ప్రాజెక్టును చేపట్టింది.

త్యాగాలను ఎత్తిపట్టేలా...

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఎంతోమంది అసువులు బాశారు. ప్రాణాలను బలిదానం చేశారు. వారి త్యాగాలను నిరంతరం స్మరించుకొనే విధంగా లుంబిని పార్కు వద్ద సుమారు రూ.60 కోట్లతో చేపట్టిన అమరుల స్మృతి చిహ్నం ప్రపంచంలోనే ఒక అరుదైన చారిత్రక కట్టడంగా ఆవిష్కృతం కానుంది. స్టీల్‌తో నిర్మించిన ఈ స్మారక చిహ్నం అమరులకు నివాళులర్పిస్తూ జ్యోతిని వెలిగించినట్లుగా రూపొందించారు. అద్దంలా మెరిసే ఈ అపురూపమైన కట్టడం కూడా ఫార్ములా–ఈ పోటీల నాటికి ప్రారంభం కానుంది.

త్వరలో డబుల్ డెక్కర్ బస్సులు...

ఒకప్పటి డబుల్ డెక్కర్ బస్సులను తలపించేలా హెచ్‌ఎండీఏ విద్యుత్ ఆధారిత డబుల్ డెక్కర్ బస్సులను నగరంలో ప్రవేశపెట్టనుంది. ఈ బస్సులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరంలోని పర్యాటక,చారిత్రక ప్రాంతాలను సందర్శించేందుకు అనుగుణంగా వీటిని నడపనున్నారు.

వీఎం హోం విద్యార్థి ఆత్మహత్య



హరినాయక్ (ఫైల్)

మిత్రుల గొడవతో మనస్తాపం

- చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా..
- కుటుంబ సభ్యుల ఆందోళన
- న్యాయం చేస్తామన్న అధికారులు

చైతన్యపురి: సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సహచర విద్యార్థులతో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన అతడు బయటకు వెళ్లి కర్మన్‌ఘాట్ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ సీతారాం, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..

నల్లగొండ జిల్లా ముదిగొండ గ్రామం మటిక తండాకు చెందిన రత్లావత్ హరినాయక్ (16) సరూర్‌నగర్ వీఎం హోంలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి గోప్యా, తల్లి శాంతి పదేళ్ల క్రితం క్రితం చనిపోగా బంధువులు అతడిని వీఎం హోంలో చేర్పించారు. శుక్రవారం సాయంత్రం వసతి గృహంలోని కొందరు విద్యార్థులకు, హరి నాయక్‌కు మధ్య దుస్తులు ఉతికే సమయంలో స్వల్పంగా గొడవ జరిగింది. దీంతో అతడు రాత్రి సమయంలో వీఎం హోం వెనక గోడ దూకి బయటకు వెళ్లిపోయినట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయాన్ని వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్‌కు చెప్పగా హరి సోదరుడు ఉప్పల్‌లో ఉండే భాస్కర్ (ఇదే హోం పూర్వ విద్యార్థి)కి సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా హరి జాడ దొరకలేదు.

కర్మన్‌ఘాట్ సమీపంలో..

వసతిగృహం నుంచి బయటకు వెళ్లిన హరినాయక్ శనివారం మధ్యాహ్నం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయినట్లు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. హరి నాయక్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

వీఎం హోం ఎదుట ఆందోళన..

హోం నిర్వాహకులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే హరినాయక్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు, కుల సంఘాల నాయకులు, వీఎం హోం మాజీ విద్యార్థుల సంఘం నాయకులు ఆందోళనకు దిగారు. హోంలో 660 మంది విద్యార్థులు ఉన్నా సరైనా భద్రత ప్రమాణాలు పాటించడంలేదని, సరైన సెక్యూరిటీ సిబ్బంది లేరని ఆరోపించారు. హరి మృతికి కారణమైన తోటి విద్యార్థులు, హోం నిర్వాహకులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి సోదరుడు భాస్కర్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.

చర్చలు జరిపిన అధికారులు

వీఎం హోం విద్యార్థి హరి ఆత్మహత్య, కుటుంబ సభ్యుల ఆందోళన సమాచారం అందుకున్న సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్లు గిరీష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాచకొండ ఓఎస్‌డీ మహేష్, క్రైం డీసీపీ మురళీధర్, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. మృతుడు హరి సోదరుడికి సాంఘిక సంక్షేమ శాఖ తరఫున రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు.



వీఎం హోం ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ఆర్‌డీఓ సందర్శన...

సమాచారం అందుకున్న కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ వీఎం హోం సందర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ప్రభుత్వానికి పూర్తి నివేదిక అందజేస్తామని, మృతుడి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరయ్యేలా చూస్తామన్నారు.

మ్యూజికల్ జర్నీ

వినండి.. వినండి.. ఉల్లాసంగా

- సిటీ బస్సుల్లో ఆర్టీసీ రేడియో
- పైలట్ ప్రాజెక్టుగా 9 సర్వీసుల్లో
- ప్రారంభించిన ఎండీ సజ్జనార్



సిటీ బస్సులో రేడియోను ప్రారంభిస్తున్న సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ ప్రయాణం ఇక వినోదభరితం. కొన్ని రూట్ల సిటీ బస్సుల్లో ఆహ్లాదకర పాటల ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులకు చక్కటి వినోదాన్ని అందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ వినూత్నంగా రేడియో సేవలకు శ్రీకారం చుట్టింది. శనివారం బస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎండీ సజ్జనార్ ప్రయోగాత్మకంగా కూకట్‌పల్లి డిపోకు చెందిన 9 సిటీ బస్సుల్లో 'టీఎస్‌ఆర్టీసీ రేడియో' సేవలను ప్రారంభించారు. వీటిలో కొన్ని ఆర్డినరీ, మరికొన్ని మెట్రో బస్సులు ఉన్నాయి. దశలవారీగా అన్ని బస్సులకు టీఎస్‌ఆర్టీసీ రేడియో వినోదాన్ని విస్తరించనున్నారు. ఈ సందర్భంగా రేడియో పనితీరును ఎండీ పరిశీలించారు. రేడియో ఏర్పాటు, అది పనిచేస్తున్న విధానం, సౌండ్, తదితర విషయాల గురించి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ మునిశేఖర్, కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మహ్మద్, మెకానికల్ సూపరింటెండెంట్ జయరాం, ఎలక్ట్రీషియన్ కేవీఎస్ రెడ్డిలు ఎండీకి వివరించారు.

ఈ రూట్లలో వినోదం..

ప్రస్తుతం ఉప్పల్– సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్– సికింద్రాబాద్, గచ్చిబౌలి– మెహిదీపట్నం, సికింద్రాబాద్– పటాన్‌చెరు, కూకట్‌పల్లి– శంకర్‌పల్లి, కొండాపూర్– సికింద్రాబాద్, కోఠి– పటాన్‌చెరు, ఇబ్రహీంపట్నం– జేబీఎస్ రూట్లలో నడిచే తొమ్మిది బస్సుల్లో టీఎస్‌ఆర్టీసీ రేడియోలను ఏర్పాటు చేశారు.

వినోదం.. విజ్ఞానం..

రేడియో ప్రారంభోత్సవం అనంతరం సజ్జనార్ మాట్లాడుతూ.. టీఎస్‌ఆర్టీసీ రేడియో ప్రయాణికులను అలరిస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. చక్కటి పాటలతో పాటు ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను, టీఎస్‌ఆర్టీసీ అందిస్తోన్న సేవలను ప్రయాణికులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. మానవ సంబంధాల ప్రాముఖ్యత, నైతిక విలువలను పెంపొందించే నీతి కథలను ఈ రేడియో ద్వారా ప్రసారమవుతాయన్నారు. మహిళలు, పిల్లల భద్రత, సైబర్, ఆర్థిక నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు వినోదంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు వివరించారు. టీఎస్‌ఆర్టీసీ రేడియోను ప్రయాణికులు ఆదరించాలని ఆయన కోరారు.

క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్...

ప్రయాణికుల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత.. పూర్తిస్థాయిలో అన్ని బస్సుల్లోనూ రేడియోను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం ఈ 9 బస్సుల్లో క్యూఆర్ కోడ్ లను ఏర్పాటు చేశారు. దీనిని స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేసి.. రేడియోపై ప్రయాణికులు తమ స్పందన తెలియజేస్తే చాలు.



సందడిగా 'సాక్షి' ప్రాపర్టీ షో

మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో 'సాక్షి' 14వ ప్రాపర్టీ షోను శనివారం రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ జాతీయ ఉపాధ్యక్షుడు (సౌత్ జోన్) గుమ్మి రాంరెడ్డి, 'సాక్షి' చీఫ్ జనరల్ మేనేజర్ కె.కమల్ కిశోర్‌రెడ్డి తదితరులు స్టాళ్లను పరిశీలించారు.

తిరుగు బావుటా!



- పెద్దఅంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్‌లలో బయటపడ్డ విభేదాలు
- అవిశ్వాస తీర్మానానికి అసంతృప్త నేతల పట్టు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై వేటుకు ఫిర్యాదులు
- జిల్లాల్లో వేడెక్కిన రాజకీయం

- వివరాలు 8లో

ఫిబ్రవరి 12 నుంచి హైలైఫ్‌ ఎగ్జిబిషన్‌



బంజారాహిల్స్‌: ఫిబ్రవరి 12నుంచి 14దాకా హై టెక్స్‌సమీపంలోని నోవాటెల్‌ హోటల్‌లో నిర్వహించనున్న హైలైఫ్‌ ఎగ్జిబిషన్‌ కర్టెన్‌ రైజర్‌ కార్యక్రమం శనివారం బంజారాహిల్స్‌ రోడ్‌ నెం 10లోని మార్క్స్‌ మీడియా సెంటర్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. టాలీవుడ్‌ హీరోయిన్లు రాశీసింగ్‌, చాందినీ, ప్రాచీ ఠాకూర్‌తో పాటు మోడల్స్‌ సందడి చేశారు. విభిన్నమైన వస్త్రధారణతో పాటు ఆభరణాలను ధరించి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

PUBLIC NOTICE

All the public in general are hereby given notice that my clients Sri Pulimeti Srihari, S/o. Late Sri Balaiah, R/o. Saidabad, Hyderabad and Sri Sama Sanjeeva Reddy, S/o. Sri S.Narasimha Reddy, residents of Hayathnagar. Ranga Reddy District have been the owners and possessors of the land admeasuring Ac.8.01 guntas in Survey No.289 and 289/e of Adiballa village, Ibrahimpatnam Mandal, Ranga Reddy District by virtue of the Registered Sale Deed bearing document No.2597/2006 (SRO, Ibrahimpatnam) being executed by Nadikudi Rajalingam, Nadikudi Saroja and Nadikudi Srinivas, who were the pattedars and possessors of the above land by virtue of the Pattedar Pass Books and the Revenue Records. That in turn Sri Pulimeti Srihari executed Sale Deed bearing Document No.1996/2022 in favour of Sri Girish Jaju S/o. Ratanlal Jaju, resident of Himayatnagar, Hyderabad conveying and transferring Ac.2.01 guntas and also executed the Sale Deed No.1996/2022 in favour of Sri Alok Kumar Agarwal, S/o. Sri Sunil Kumar Agarwal, R/o.Banjara Hills Hyderabad for a valuable sale consideration conveying and transferring Ac.2.00 guntas. Also that vide the said Sale Deeds, the actual, physical possession of the above lands of Ac.4.00 guntas was delivered to the vendees of Sri P.Srihari. That apart Sri Sama Sanjeeva Reddy entered into an Agreement of Sale in favour of Sri Girish Jaju and others agreeing to convey and transfer the land in an extent of Ac.4.00 guntas in Sy.No.289. As things stood thus, there has been boundary dispute with Borugu Peda Venkat Reddy, S/o. Late Sathi Reddy, Borugu China Venkat Reddy S/o. Sri B.Janga Reddy and Borugu Purushotham Reddy S/o. Janga Reddy and Sri Karunakar Reddy, S/o. Late Sathi Reddy, who are allegedly the owners of the land in Sy.No.409 and 410 of Mangalpally village, Ibrahimpartnam Mandal, Ranga Reddy District which is abutting the lands of Sri Girish Jaju and another. Now that my clients learnt that Borugu Peda Venkat Reddy, S/o. Late Sathi Reddy, Borugu China Venkat Reddy S/o. Sri B.Janga Reddy and Borugu Purushotham Reddy S/o. Janga Reddy and Sri Karunakar Reddy, S/o. Late Sathi Reddy, are designing to sell the land of my clients as that of their land in Sy.No.409 and 410 of Mangalpally village. It is given notice to the general public that there has been dispute pending before the CCLA and also before the Hon'ble High Court of Telangana vide W.P.No.440 of 2014, W P.No.25364 of 2014, W.P.No.28838 of 2014 and W.P.No.25330 of 2021 concerning the boundary dispute and therefore the General public are called upon not to believe Borugu Peda Venkat Reddy. S/o. Late Sathi Reddy. Borugu China Venkat Reddy S/o. Sri B.Janga Reddy and Borugu Purushotham Reddy S/o. Janga Reddy and Sri Karunakar Reddy, S/o. Late Sathi Reddy. who pretend to be the pattedars and possessors. If any public enters into either an Agreement of Sale or otherwise with these people to either purchase or get into possession of the above lands, the same shall be at your peril and consequence. If any general public requires any information may be pleased to contact the undersigned Advocate.

M.VENKATESWER RAO, ADVOCATE.
Office # 16-11-16/86/B, SRI PURAM COLONY, MALAKPET, HYDERABAD,
Mobile No.: 93945 52685

తిరుగు బావుటా!

- పెద్దఅంబర్‌పేట్‌, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్‌లలో బయటపడ్డ విభేదాలు
- అవిశ్వాస తీర్మానానికి అసంతృప్త నేతల పట్టు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై వేటుకు ఫిర్యాదులు
- జిల్లాల్లో వేడెక్కిన రాజకీయం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌ పరిధిలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ పాలక మండళ్లలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. పాలక మండళ్లు ఏర్పడి ఈ నెల 27తో మూడేళ్లు ముగియడంతో అసంతృప్త నేతలు అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మేయర్‌, చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్‌పర్సన్లపై తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. అవిశ్వాస తీర్మానం కోరుతూ కలెక్టర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదులు అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ సహా పెద్దఅంబర్‌పేట్‌, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల చైర్‌పర్సన్లపై అవిశ్వాసానికి నోటీసులు ఇవ్వడంతో రాజకీయం వేడెక్కింది.

గవర్నర్‌ ఆమోదం తెలపకపోవడంతో..

మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు 2020 జనవరిలో కొలువుదీరాయి. ఆ తర్వాత మేయర్లు, చైర్‌పర్సన్ల ఒంటెత్తు పోకడలు సభ్యుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. కొంతకాలంగా ఈ సమయం కోసం ఎదురు చూస్తున్న అసంతృప్త నేతలు, ప్రతిపక్ష సభ్యులు అందివచ్చిన అవకాశాన్ని అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం గడువును మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు సవరిస్తూ ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టింది. ఈ ఫైల్‌ను గవర్నర్‌ ఆమోదానికి పంపింది. ఇప్పటి వరకూ బిల్లుపై ఆమోద ముద్ర పడకపోవడం మేయర్లు, చైర్‌పర్సన్లకు శాపంగా మారింది. ఈ మేరకు పలుచోట్ల పాలకులపై అవిశ్వానికి పట్టుబడుతూ కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు.

- మేడ్చల్‌ జిల్లా పరిధిలోని జవహర్‌నగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో 20 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం కోసం శనివారం కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు.
- పెద్దఅంబర్‌పేట్‌ మున్సిపాలిటీ పాలక మండలిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా, వీరిలో అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ 15 మంది సభ్యులు కలెక్టర్‌, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 20 మంది సభ్యులు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానానికి సంతకాలు చేశారు.
- జిల్లాలోని ఆదిభట్ల, బడంగ్‌పేట్‌, తుర్కయంజాల్‌ సహా పలు మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాస తీర్మానం కోరే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరంతా రేపోమాపో ఈ విషయమై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆదిభట్ల మున్సిపాలిటీలో 15 మంది సభ్యులు ఉండగా, వీరిలో ఇప్పటికే 14 మంది పలు అంశాలపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

కోత లేకుండా గుండెకు చికిత్స

విజయవంతంగా చేసిన నిమ్స్‌ వైద్యులు



లక్డీకాపూల్‌: పుట్టుకతోనే గుండెపై భాగంలో రంధ్రంతో బాధపడుతున్న యువతికి కోత లేకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు నిమ్స్‌ వైద్యులు. శనివారం నిమ్స్‌ ఇన్‌చార్జి డైరెక్టర్‌ డాక్టర్‌ నగరి బీరప్ప పర్యవేక్షణలో జరిగిన అరుదైన చికిత్సకు సంబంధించి కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్‌ డి. సాయి సతీష్‌ వివరించారు. భూపాలపల్లి జయశంకర్‌ జిల్లాకు చెందిన జి. జాహ్నవి గుండె పైభాగంలో రంధ్రంతో (19) జన్మించింది. నాలుగేళ్లుగా ఆయాసపడుతూ.. తన పనులు చేసుకోలేని పరిస్థితికి వచ్చింది. ఆమెను నిమ్స్‌ ఆస్పత్రిలో చూపించడంతో వైద్యులు పరీక్షలు చేశారు. పరిస్థితిని చక్కబర్చేందుకు డాక్టర్‌ సాయి సతీష్‌ బృందం సన్నద్ధమైంది. గుండెకు కోత లేకుండానే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపారు వైద్యులు. యాంజియోగ్రాం ద్వారా పల్మనరీ వాల్వ్‌ను రీప్లేస్‌ చేశారు. దీనిని ఆమె తొడ భాగం నుంచి సేకరించారు. గుండెపై భాగంలో ఏర్పడిన రంధ్రాన్ని గొడుగు ఆకారంలోని బెలూన్‌ తరహా డివైజ్‌తో మూసివేశారు. శస్త్ర చికిత్సలో డాక్టర్‌ సాయి సతీష్‌, ప్రొఫెసర్‌ బి. శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్‌: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బీజేపీనేత, గ్రేటర్‌ హైదరాబాద్‌ మాజీ మేయర్‌ బండ కార్తీకరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ట్విట్టర్‌ వేదికగా మోదీ సర్కార్‌ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ అంచనాలకు తగ్గట్టుగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ట్విట్టర్‌ ద్వారా దేశవ్యాప్తంగా మోదీ 2,501 మందిని ఫాలో అవుతుండగా వారిలో ఒకరిగా తనకు అరుదైన గౌరవం దక్కిందన్నారు. ట్విటర్‌లో మోదీ ఫాలో అవుతున్న సినీ హీరో జూనియర్‌ ఎన్టీఆర్‌, ప్రముఖ దర్శకుడు రాజమౌళి, తెలుగు రాష్ట్రాల నాయకుల్లో తాను కూడా ఒకరిగా నిలవడం పట్ల కార్తీకరెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.

మహిళల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోరాటం

సీఐడీ అడిషనల్‌ డీజీపీ మహేశ్‌ భగవత్‌



మాట్లాడుతున్న మహేశ్‌ భగవత్‌. చిత్రంలో బీఎస్‌ ప్రసాద్‌, నరసింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: మహిళల అక్రమ రవాణాను అరికట్టడంలో న్యాయవ్యవస్థ, పోలీసులు, పత్రికలు, ఎన్‌జీవోలు భాగస్వామ్యం కావాలని సీఐడీ అడిషనల్‌ డీజీపీ మహేశ్‌ భగవత్‌ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఉమెన్‌ లాయర్స్‌ (టీఎఫ్‌డబ్ల్యూఎస్‌) ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌ భగవత్‌ మాట్లాడుతూ.. 'మన రాష్ట్రంలో రెడ్‌ లైట్‌ ఏరియాలు లేవు. అయితే డబ్బుకు అలవాటు పడిన వాళ్లు ఇతర రాష్ట్రాల్లోని అలాంటి ప్రాంతాల్లో ఉండటానికి ఇష్టపడుతున్నారు. వీరిని చూసి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేని అమాయక పిల్లలు కూడా అక్కడికి వెళ్లాలని అనుకుంటున్నారు. యాదగిరిగుట్టలో పెద్ద ఎత్తున పిల్లలు పట్టుబడగా, వారు మా పిల్లలేనని చాలా మంది వచ్చారు. వారికి డీఎస్‌ఏ పరీక్షలు చేయగా కొందరివి మాత్రమే సరిపోయాయి. ఇలాంటి వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి' అని వివరించారు.

కోర్టుల్లో మౌలిక వసతులు..

అడ్వొకేట్‌ జనరల్‌(ఏజీ) బీఎస్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త జిల్లాల వారీగా కోర్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా కోర్టుల్లో మహిళల కోసం మౌలిక వసతులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్‌ శ్రీసుధ, జస్టిస్‌ రాధారాణి, తెలంగాణ బార్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ ఎ.నరసింహారెడ్డి, మాజీ ఏజీ డి.ప్రకాశ్‌రెడ్డి, టీఎఫ్‌డబ్ల్యూఎల్‌ వ్యవస్థాపక చైర్‌పర్సన్‌ సుమాలిని రెడ్డి, చైర్‌పర్సన్‌ రేవతిదేవి, వైస్‌ చైర్‌పర్సన్‌ మాధవీరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాతృభాషను మర్చిపోవద్దు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నిజాంపేట్: మాతృదేశాన్ని, మాతృమూర్తిని, మాతృ భాషను మరిచిపోయిన వాడు మనిషికాడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి పాఠశాల 27వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు, క్వ్రిస్టియన్ ట్రూప్ విద్యార్థులు మాజీ ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా చదువు, ఆటలు, సంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అభిలాషించారు. ఇండియన్ ఆర్మీ 7(టీ) గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రంజిత్ చాకో, స్కూల్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వల్లూరిపల్లి రాజా రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- ట్రిపుల్‌డ్రైవింగ్ చేసిన 24వేల మందిపై కేసులు

హిమాయత్‌నగర్: నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై భారీ స్థాయిలో కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. గత ఏడాది నవంబర్ 28వ తేదీ నుంచి ఇప్పటి వరకు మూడు కేటగిరీల్లో తాము ప్రత్యేక డ్రైవ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో గత ఏడాది నవంబర్ 28వ తేదీ నుంచి చేపట్టిన డ్రైవ్‌లో ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న 24,658, రాంగ్‌సైడ్ డ్రైవ్ చేస్తున్న 1లక్షా 30వేల 311మందిపై కేసులు నమోదైనట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులు, హెవీ వెహికల్స్‌పై ప్రత్యేక డ్రైవ్‌లో భారీగా కేసులు నమోదు అయ్యాయి. ఆర్టీసీ బస్సులపై 3892, హెవీ వెహికల్స్‌పై 5806 కేసులను ఈనెల 4వ తేదీ నుంచి ఇప్పటి వరకు నమోదు చేసినట్లు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్ 15న ప్రారంభించిన ఆపరేషన్ రోప్‌లో భాగంగా అనేక కేటగిరిల్లో కేసులు నమోదయ్యాయి. ఫ్రీలెఫ్ట్ బ్లాక్ చేసిన 32వేల 64మందిపై, స్టాప్ లైన్‌ను క్రాసైన 2లక్షల 13వేల 77 మందిపై, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న 200మందిపై, ఫుట్‌పాత్ ఆక్రమించిన 12వేల 946మందిపై, రోడ్డుపై అక్రమంగా పార్కింగ్(టోవింగ్) చేసిన 53వేల 424మందిపై, రాంగ్ రూట్ చేసిన 1లక్షా 32వేల 531మందిపై, సిటీలోకి చొరబడిన ఇతర ప్రాంతాలకు చెందిన ఆటోవాల 3వేల 16మందిపై, బస్సులు, లారీలు 63మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

4,5 తేదీల్లో ఖురాన్ పారాయణ పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రస్థాయి ఖురాన్ పారాయణ పోటీలు వచ్చే నెల 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు ఈ నెల 31 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షరిఫియా ఖిరాత్ అకాడమి డైరెక్టర్ హఫెజ్ ఖారీ డాక్టర్ మహ్మద్ నసీరుద్దీ మన్షవీ శనివారం తెలిపారు. గ్రూప్-ఏలో 7-15 ఏళ్ల వరకు, గ్రూప్- బీలో 16-30 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. మలక్‌పేట్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.7వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 9849024785 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో లూటీ

యువకుడి నుంచి రూ.12 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: పార్ట్‌టైం జాబ్ పేరుతో నగర వాసిని నిండా ముంచాడో సైబర్ నేరగాడు. జాబ్ కోసం సంప్రదించి టాస్కులు ఇచ్చి మరీ లక్షల రూపాయిలు దోచుకున్నాడు. తనకు ఉద్యోగం ఇవ్వకపోగా మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో బాధితుడు శనివారం సిటీ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాంనగర్ గుండుకు చెందిన బ్యాంకు ఉద్యోగి ఫోన్ నంబర్‌ను టెలిగ్రామ్ గ్రూప్‌లో ఓ వ్యక్తి యాడ్ చేశాడు. పార్ట్‌టైం జాబ్ ఇస్తానని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించొచ్చని ఆశ పెట్టాడు. తొలుత రూ.3వేలుకు సంబంధించిన టాస్క్ ఇచ్చాడు, అది పూర్తి చేసిన ఉద్యోగికి లాభాలు ఇచ్చాడు. ఆ తర్వాత టాస్కులు పేరుతో రూ.12లక్షల మేర దోచుకున్నాడు. ఒక్క రూపాయి లాభం ఇవ్వకపోగా మరిన్ని డబ్బు అడగడంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

- బంజారాహిల్స్‌కు చెందిన ఓ యువకుడికి ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఫేస్‌బుక్ వేదికగా మోసానికి పాల్పడ్డాడో సైబర్ నేరగాడు. బ్యాక్ డోర్‌లో ఉద్యోగానికి కొంత ఖర్చు పెట్టుకోవాలని సూచించాడు. దీంతో నగర వాసి పలు దఫాలుగా రూ.5లక్షలు సమర్పించాడు. ఉద్యోగం ఇవ్వకపోగా ఇచ్చిన డబ్బును కూడా వెనక్కి ఇవ్వకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ గ్యారెంటీ పత్రాలతో బురిడీ

- కోల్‌కత్తా కేంద్రంగా నడుస్తున్న ముఠా గుట్టు రట్టు
- రూ.45కోట్ల విలువైన నకిలీ బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు
- వివరాలు వెల్లడించిన సీసీఎస్ అడిషినల్ డీసీపీ స్నేహమెహ్రా



వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సీసీఎస్ అడిషనల్ డీసీపీ స్నేహ మెహ్రా

హిమాయత్‌నగర్: బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు నకిలీవి సృష్టించి కంపెనీలను మోసం చేస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. కలకత్తా కేంద్రంగా జరుగుతున్న ఈ తతంగాన్ని బట్టబయలు చేసిన పోలీసులు నలుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.45 కోట్ల విలువైన 60 నకిలీ బ్యాంక్ పత్రాలను, ఐదు సెల్‌ఫోన్లను, రెండు చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ అడిషినల్ డీసీపీ స్నేహమెహ్రా తెలిపారు. ఈ వ్యవహారంలో వరంగల్‌కు చెందిన అడ్వకేట్, లోన్ ఏజెంట్ గోడిశాల నాగరాజు సూత్రధారిగా ఉన్నట్లు వివరించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయంలో ఏసీపీలు మోహన్‌కుమార్, పూర్ణచంద్రరావు, ఇన్‌స్పెక్టర్లు ప్రసాదరావు, మట్టయ్యలతో కలసి వివరాలను వెల్లడించారు.

నకిలీ గ్యారెంటీ పత్రాలతో దందా

కొద్దిరోజుల క్రితం చెన్నైకి చెందిన హర్షిత ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ కంపెనీకి బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను అందిస్తానంటూ వరంగల్‌కు చెందిన అడ్వకేట్ గోడిశాల నాగరాజు కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణ్‌కు పరిచయమయ్యాడు. కొంతకాలంగా దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు బ్యాంక్ గ్యారెంటీ నకిలీ పత్రాలను తయారు చేసే కల్‌కత్తాకు చెందిన నిలోట్‌పాల్ దాస్(56). సుబ్రజిత్ గోశాల్(31)లతో రాజస్థాన్‌కు చెందిన నరేష్ శర్మ ద్వారా గోడిశాల నాగరాజుకు వీరితో పరిచయం ఏర్పడింది. ఈ నలుగురూ కలసి గతంలో అనేక బ్యాంకులకు బ్యాంక్ గ్యారెంటీ పత్రాలు నకిలీవి అందచేశారు. ఇదేక్రమంలో కోల్‌కత్తాలోని ఇండస్‌లండ్ బ్యాంక్ నుంచి బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణకు నాగరాజు అందచేశాడు. ఇందుకు గాను కంపెనీ నుంచి నాగరాజు రూ.47లక్షలు ముడుపులు తీసుకున్నాడు. ఈ పత్రాలు నకిలీ, ఒరిజినల్ అనే విషయంలో మాకు స్పష్టత లేదంటూ మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ ముంబయ్‌లోని ఇండస్‌లండ్ బ్యాంక్‌ను మెయిల్ ద్వారా కోరింది. ఆ పత్రాల్లో ఉన్న అడ్రాస్‌లో మా బ్రాంచ్ లేదని వారు మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్‌కు రిప్లై ఇచ్చారు. దీంతో ఈనెల 4వ తేదీన సైబర్‌క్రైం పోలీసులకు మాసబ్‌ట్యాంక్‌లోని ఇండస్‌లండ్ బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేయడంతో..కేసు నమోదు చేసి ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా నకలి గ్యారెంటీ పత్రాలు ఇచ్చిన కారణంతో మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ తమ కంపెనీకి చెందిన టెండర్లను రద్దు చేస్తూ, టెర్మినేట్ చేసిందని ఈనెల 14న నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో గోడిశాల నాగరాజుపై కంపెనీ ఎండీ ప్రజ్వల్ కరుణ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం తొలుత గోడిశాల నాగరాజు, రాజస్థాన్‌కు చెందిన నరేష్ శర్మను అదుపులోకి తీసుకుని విచారించగా.. పత్రాలు తయారు చేసేది కల్‌కత్తాకు చెందిన నిలోట్‌పాల్ దాస్, సుబ్రజిత్ గోశాల్‌లు అని చెప్పారు. దీంతో సీసీఎస్ టీం ఆ ఇద్దరినీ అరెస్టు చేసి వారి నంచి రూ.45కోట్ల విలువైన బ్యాంక్ నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిలోట్‌పాల్ దాస్, సుబ్రజిత్ గోశాల్‌లు గతంలో ఇండియన్ బ్యాంక్, ఇండస్‌లండ్ బ్యాంక్‌లకు చెంది పత్రాలను తయారు చేసి కంపెనీల నుంచి కోట్లాది రూపాయిలు సంపాదించారు. బ్యాంక్‌ల నుంచి వెరిఫికేషన్ వచ్చేలా ఆ పత్రాల్లో వీరికి సంబంధించిన మెయిల్ ఐడీలను పెట్టడం గమనార్హం. ఇంకా వీరిపై ఎక్కడెక్కడ కేసులు ఉన్నాయి, ఎంత వరకు మోసాలు చేశారనే విషయాలపై తాము విచారిస్తున్నట్లు అడిషినల్ డిసిపి స్నేహ మెహ్రా తెలిపారు.



కుంగిన రోడ్డు.. కూరుకుపోయిన మినీ టిప్పర్



హిమాయత్‌నగర్: కొద్దిరోజుల క్రితం గోశామహాల్ ప్రాంతంలోని చక్నవాడి ఘటన మరువకముందే నగరం నడిబొడ్డున ఉన్న హిమాయత్‌నగర్‌లో మరో రోడ్డు కుంగిపోయింది. డ్రైనేజీ మట్టిలోడ్‌తో వెళ్తున్న మినీ టిప్పర్ లారీ ధాటికి తట్టుకోలేకపోయిన రోడ్డు ఒక్కసారిగా కుంగిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ గుంతలో టిప్పర్ వెనుక చక్రాలు కూరుకుపోయాయి. ఈ సంఘటనను చూసిన స్థానికులు ఒక్కసారిగా భయందోళనకు గురయ్యారు. ఈఘటనలో డ్రైవర్, ఇద్దరు కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్-5 నాలా వద్ద జరిగిన ఈ సంఘటన జరిగింది. వివరాలు.. స్ట్రీట్-6లో జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం నిర్మాణ పనుల నేపథ్యంలో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. ఇటిక్యాల యాదగిరి అనే డ్రైవర్ తన టిప్పర్ సాయంతో ఉదయం ఓ టన్ను బరువు గల లోడును స్ట్రీట్-5 నాలా మీదుగా తీసుకెళ్లాడు. రెండో ట్రిప్పు సుమారు మధ్యాహ్నం 12గంటల సమయంలో తీసికెళ్తుండగా..నాలా దాటిన వెంటనే రోడ్డు కుంగిపోయింది. రోడ్డులో ఒక్కసారిగా వెనకాల చక్రాలు దిగిపోయాయి. ఈఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు క్షేమంగా బయటపడ్డారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కూరుకుపోయిన టిప్పర్‌ను సాయంత్రం 5గంటలయ్యే వరకు బయటకు తీయలేదు. టిప్పర్ కాంట్రాక్టర్‌నే జేసీబీ తెచ్చుకోవాలని ఇంజనీరింగ్ డీఈ దుర్గాప్రసాద్, ఏఈ దివ్యతేజలు సూచించారు. మా జేసీబీ రావాలంటే టైం పట్టిద్ది మీరు ఒక ఫోన్ చేస్తే జేసీబీ వస్తుందని అధికారులను టిప్పర్ డ్రైవర్, కాంట్రాక్టర్ ప్రాధేయపడ్డారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న జేసీబీ హిమాయత్‌నగర్ స్ట్రీట్-5 సంఘటన స్థలానికి వచ్చేందుకు సుమారు ఐదు గంటల సమయం పట్టడంతో స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ఈ ఐదు గంటల పాటు డీఈ దుర్గాప్రసాద్, ఏఈ దివ్యతేజలు ఇద్దరూ చోద్యం చూస్తూ టైంపాస్ చేయడంతో..పోలీసులు రంగప్రవేశం చేసి ఒత్తిడి చేయగా..సాయంత్రం 5గంటలకు దానిని అక్కడ నుంచి తొలగించారు.

'ధృవ'లో అలరించిన ముకాబ్‌లా

ముఖ్యఅతిథిగా హాజరైన సినీగేయ రచయిత, చంద్రబోస్

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 20వ ఆల్ ఇండియా యూజీ స్టూడెంట్స్ ఫెస్ట్ (ముకాబ్ లా) అలరించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకలో దేశవ్యాప్తంగా ఉన్న పలు కళాశాలల నుండి 600 రిజిస్ట్రేషన్లు జరగ్గా 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రూ.55 వేల నగదు బహుమతులతో పాటు రూ.1 కోటి విలువైన స్కాలర్‌షిప్‌లు, ప్రైజ్‌లు అందజేశారు. విద్యార్థులకు డ్యాన్స్, సంగీతం,క్విజ్, వ్యాసరచన, స్పీచ్, రంగోలీ వంటి పలు రకాలు పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో సినీగేయ రచయిత, గోల్డెన్ గ్లోబ్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల చైర్మెన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రొఫెసర్ ప్రియ నాయుడుకు ప్రత్యేకంగా జ్ఞాపిక ప్రదానం చేశారు. అనంతరం కళాశాల చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి దంపతులు చంద్రబోస్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రబోస్

బీసీల బడ్జెట్ రూ.20 వేల కోట్లకు పెంచాలి

విజయనగర్‌కాలనీ: బీసీల బడ్జెట్ రూ.5006 కోట్ల నుండి రూ.20 వేల కోట్లకు పెంచాలని, కళాశాల కోర్సులు చదివే బీసీ, ఏబీసీ ఉద్యోగులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వేలాదిమంది విద్యార్థులతో శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందని, గత ఐదు సంవత్సర కాలంలో ఒక్కరికి కూడా రుణాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంతభవనం లేదన్నారు. విదేశీ విద్య స్టైఫండ్ స్కీమ్ కింద అర్హులందరికి స్టైఫండ్ ఇవ్వడానికి దీని బడ్జెట్‌ను రూ.60 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బీసీ అడ్వకేట్లకు ఇచ్చే స్టైఫండ్ రూ.1000 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులందరికి డీఎస్సీ, పోలీస్, ఎస్ఐ, గ్రూప్ 1, 2, 3, 4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం సంబంధిత బీసీ సంక్షేమ శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, సి.రాజేందర్, లాల్ కృష్ణ, అనంతయ్య, భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్, మోడీ రామ్‌దేవ్, తిరుపతి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్. కృష్ణయ్య తదితరులు

బలవంతంగా వ్యభిచారం
విదేశీ మహిళ అరెస్ట్

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో ఉద్యోగం చూపిస్తానని నమ్మించి తీరా ఇక్కడికి వచ్చాక వ్యభిచార వృత్తిలోకి బలవంతంగా దింపుతోందంటూ ఉగాండాకు చెందిన యువతి కెన్యాకు చెందిన మహిళపై చేసిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులకు శనివారం కెన్యా మహిళను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఉగాండాకు చెందిన యువతి(31) ఉద్యోగం కోసం గాలిస్తుండగా కెన్యాకు చెందిన చెరియట్ శైలిన్ జెష్వా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ గతేడాది డిసెంబర్ 22వ తేదీన టూరిస్ట్ వీసాపై ఇక్కడికి రప్పించింది. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని జహీరానగర్‌లో ఓ ప్లాట్ అద్దెకు తీసుకున్న కెన్యా మహిళ ఇందులోనే ఉగాండా యువతిని తనతో పాటు ఉంచుకొని వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి చేయసాగింది. పూర్తిగా తన కంట్రోల్‌లో పెట్టుకొని వ్యభిచారం చేయకపోతే బాగుండదంటూ హెచ్చరికలు జారీ చేసేది. ఇదే విషయాన్ని ఉగాండాకు చెందిన యువతి స్నేహితుడు వాట్సాప్ ద్వారా విషయం తెలుసుకొని ఆమె ఇబ్బందులను గుర్తించి ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి అక్కడ నిర్బంధంలో ఉన్న ఉగాండా యువతిని రక్షించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుమేరకు కెన్యాకు చెందినచెరియట్ శైలిన్ జెష్వాను అరెస్ట్ చేశారు. బాధితురాలిని పునరావాస కేంద్రానికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఏడాది టూరిస్ట్ వీసాతో 2020లో జెష్వా హైదరాబాద్‌కు వచ్చి గత రెండేళ్లుగా వీసా గడువు ముగిసిన తర్వాత కూడా నగరంలోనే తిష్టవేసినట్లుగా పోలీసుల దృష్టికి వచ్చింది.

నుమాయిష్‌పై నజర్..
41మంది పోకిరీలకు జైలు

హిమాయత్‌నగర్: నుమాయిష్ కేంద్రంగా ఈవ్‌టీజింగ్, అసభ్యప్రవర్తనకు పాల్పడుతున్న పోకిరీలపై షీటీం పోలీసులు కన్నెర్ర చేశారు. జనవరి 11వ తేదీన ప్రారంభమైన నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు మఫ్టీలో విధులు చేపట్టారు. పలు రకాల వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలు 41మందిని గుర్తించి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు శనివారం అడిషినల్ సీపీ (క్రైం అండ్ ఉమెన్ వింగ్) ఏ.ఆర్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ రోజుల్లో 50వేలకు పైగా వస్తున్న వీక్షకుల సంఖ్య శని, ఆదివారాల్లో లక్షకు పైగా వస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 41మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో..కొందరికి మూ డు, కొందరికి ఏడు, కొందరికి పదిరోజుల పా టు జైలు శిక్షను న్యాయస్థానం విధించినట్లు చెప్పారు. ఎంతటి రద్దీ ప్రదేశమైనా, ఎన్ని లక్షల మంది వీక్షకులు వచ్చినా తాము ఎల్లప్పుడూ మహిళల భద్రత విషయంలో ముందంజలో ఉంటామని షీటీం అడిషినల్ డీసీపీ శిరీష రాఘవేంద్ర తెలిపారు.

ఓక్రిడ్జ్‌లో సందడిగా కార్నివాల్



కార్నివాల్‌లో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో హిమాన్షు తదితరులు

- ఈవెంట్‌ను ప్రారంభించిన మంత్రి సబితాఇంద్రారెడ్డి
- ఆకట్టుకున్న సీఎం మనవడు హిమాన్ష్

రాయదుర్గం: తన నాయకత్వ ప్రతిభతో సీఎం కేసీఆర్ మనుమడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు అందరినీ ఆకట్టుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో కార్నివాల్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించారు. ఈ ఈవెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. క్రియేటివిటీ, ఆక్టివిటీ, సర్వీస్‌థీమ్‌తో కార్నివాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్‌తో వచ్చిన డబ్బుతో నానక్‌రాంగూడ చెరువు సుందరీకరించాలని విద్యార్థులు నిర్ణయించారు. ఈ కార్నివాల్‌కు హెడ్‌గా విద్యార్థి హిమాన్షు వ్యవహరించారు. ఆయన బృందం సృజనాత్మకతను మంత్రి సబితారెడ్డి అభినందించారు. సినీ హీరోలు నిఖిల్, కిరణ్ అబ్బవరంలు సందడి చేశారు. ఈ సందర్భంగా హిమాన్షు బృందం ఏర్పాటు చేసిన స్టాలు, ఇతర విద్యార్థుల స్టాళ్లను హీరోలు, మంత్రి సబితారెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం మంత్రి సబితా రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో లాగ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పలు ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నేటి తరం పిల్ల ఆలోచనా విధానానికి ఈ కార్నివాల్ ప్రతీకగా నిలుస్తుందన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ ప్రారంభం



ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

పంజగుట్ట: ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్ సికింద్రాబాద్ సహకారంతో మొట్టమొదటి సారిగా సోమాజిగూడలోని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ భవనంలో ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్ ప్రారంభించారు. ఇన్నర్ వీల్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సుర్జిత్ కౌర్, ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు కాంతిలాల్ షాలు ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లకు అన్ని రకాల చికిత్సలు ఇక్కడ అందిస్తామని తెలిపారు. అంతే కాకుండా తమ సంస్థల ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా బతికేందుకు బెడ్‌సైడ్ అసిస్టెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల సర్టిఫికెట్ కోర్సు ఉంటుందన్నారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటలవరకు క్లాస్‌లు ఉంటాయని ఈ నెలాఖరువరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఫిబ్రవరి మొదటి వారంలో క్లాసులు ప్రారంభమౌతాయన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రేణు కౌర్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు జయంతి కన్నన్ పాల్గొన్నారు.

యజమానిపైనే కూల్చివేత వ్యయం

డెక్కన్ భవనంపై జీహెచ్ఎంసీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం కూల్చివేతలు జరుగుతున్న సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనం కూల్చివేత ఖర్చుల్ని భవన యజమానికే విధించనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేసేందుకు జీహెచ్ఎంసీపై భారం పడుతుండటంతో.. సదరు భవనాల కూల్చివేతల వ్యయాన్ని అక్రమార్కులకే వేయాలని ఎంతోకాలం క్రితమే నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు అలా విధించిన దాఖలాల్లేవు. ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన భవనంలో పై రెండు అంతస్తులు అనుమతుల్లేకుండా నిర్మించినవే కావడం, ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు సైతం తగిన విధంగా లేకపోవడం తెలిసిందే. పరిసర ప్రాంతాల ప్రజలకు సైతం దీన్నుంచి ముప్పు పొంచి ఉండటంతో జీహెచ్ఎంసీ కూల్చివేతలు చేపట్టింది. ఇందుకుగాను దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేయనుంది. ఈ పనులు పూర్తి చేసే కాంట్రాక్టు ఏజెన్సీకి చెల్లించాల్సిన ఈ వ్యయాన్ని భవన యజమాని నుంచే ఇప్పించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. కాంట్రాక్టు సంస్థకు చెల్లించాల్సిన సొమ్మును యజమాని ద్వారానే ఇప్పిస్తామని, లేని పక్షంలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు సంస్థకు చెల్లించాక భవన యజమాని నుంచి వసూలు చేస్తామన్నారు.

అనుమతి కోసం వచ్చినప్పుడైనా తప్పదు..

ఒకవేళ ఇప్పుడు చెల్లించకపోయినా సదరు స్థలంలో తిరిగి కొత్త భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడైనా ఈ వ్యయం చెల్లించాకే అనుమతినిస్తామని పేర్కొన్నారు

జలమండలి సేవలు భేష్..



కొనియాడిన చెన్నై వాటర్ బోర్డు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జలమండలి సేవలు ఎంతో బాగున్నాయని చెన్నై వాటర్ బోర్డు అధికారులు ప్రశంసించారు. తమిళనాడు నుంచి ముగ్గురు అధికారులతో కూడిన బృందం జలమండలి అందిస్తున్న సేవలు, మంచినీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, సాంకేతిక వినియోగం, రెవెన్యూ, తదితర అంశాలపై అధ్యయనం కోసం శనివారం నగరానికి వచ్చింది. ఆ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ మురుగానందం, చెన్నై వాటర్ బోర్డు ఎండీ కిర్లోష్ కుమార్, చీఫ్ ఇంజినీర్ రామస్వామిలు ఈ బృందంలో ఉన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ దానకిషోర్... జలమండలి అందిస్తున్న సేవలు, చేపట్టిన సంస్కరణలు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.

- నగరంతోపాటు ఓఆర్ఆర్ వరకు అందిస్తున్న తాగునీరు, మురుగు నీటి శుద్ధి ప్రక్రియ, ఎస్టీపీల నిర్మాణం, ఇందులో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికత, సామగ్రి, జెట్టింగ్ మిషన్, సివర్ క్రాక్ మిషన్ వంటి వివిధ యంత్రాల పనితీరును తెలియజేశారు.
- ఐటీ విభాగంలో తీసుకువచ్చిన డిజిటల్ మానిటరింగ్, యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం (ఏఎంఎస్), సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్స్ (ఎస్పీటీ), జలమండలి రూపొందించిన యాప్‌ల పనితీరు గురించి చెప్పారు. కార్మికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను తెలిపారు,

మీ సేవలు ఆదర్శప్రాయం..

ఈ సందర్భంగా అడిషనల్ సీఎస్ మురుగానందం మాట్లాడుతూ.. హైదరాబాద్ వాటర్ బోర్డు అవలంబిస్తున్న పద్ధతులు, విధానాలు అధ్యయనం చేయడానికి వచ్చామని, జలమండలి అనుసరిస్తున్న మానవ రహిత మురుగు శుద్ధి విధానాలు ఇతర నగరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధ ఉంటే తప్ప.. ఇలాంటివి చేయలేమన్నారు. చెన్నై వాటర్ బోర్డు ఎండీ కిర్లోష్ కుమార్ మాట్లాడుతూ.. జలమండలి ఐటీ విభాగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రశంసించారు. చెన్నైలో సైతం వీటిని అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వారు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి జలమండలి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్య నారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న నర్సరీ మేళా



ఖైరతాబాద్: మనస్సుకు ఆహ్లాదాన్ని పంచే పూల మొ క్కలు.. ఆక్సిజన్, మెడిసిన్ ప్లాంట్స్‌తో పాటు అరుదైన పండ్లు, కూరగాయల మొక్కల నుంచి కిచెన్, టెర్రస్ గార్డెన్‌లలో పెంచుకునే మొక్కలు...వాటిని పెంచేందుకు అవసరమైన అందమైన కుండీలు, పనిముట్లు, ఎరువులు ఇలా అన్నీ ఒకేచోట లభిస్తుండటంతో నగర వాసులతో నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలోని నర్సరీ మేళా కిటకిటలాడుతోంది. నర్సరీ మేళాను రోజూ నగరవాసులు సందర్శిస్తూ మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ఎక్కువగా ఇండోర్ ప్లాంట్స్ కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ నెల 30 వరకు నర్సరీ మేళా అందుబాటులో ఉంటుంది.

మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తా..

- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సైబర్ వల
- లక్షలు సంపాదించాలనే ఆశతో మోసపోతున్న అమాయకులు

హిమాయత్‌నగర్: 'హాయ్ నా పేరు రాహుల్ నేను ఓ పెద్ద కంపెనీకి సీఈఓని. నేను చెప్పినట్లు వింటే మిమ్మల్ని తక్కువ సమయంలో కోటీశ్వరుల్ని చేస్తా' అంటూ సైబర్ నేరగాళ్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వల వేస్తున్నారు. ఈ వలలో పడుతున్న అమాయకులు లక్షల రూపాయిలు పోగొట్టుకుంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయి న్యాయం చేయాలంటూ సైబర్ క్రైం పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. ఈ తరహా మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్‌క్రైం పోలీసులు సూచిస్తున్నారు.

ఇలా చేస్తున్నారు

ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన కంపెనీ సీఈఓగా ఇన్‌స్టాగామ్ వ్యక్తిగత అకౌంట్‌లో మెసేజ్ చేస్తున్నారు. దీనికి స్పందించగానే చక్కగా మాట కలుపుతున్నారు. తాను ఈరోజు కోట్లు సంపాదించడానికి కారణం ఇన్వెస్ట్‌మెంట్ చేయడం వల్లనే అంటూ వల వేస్తున్నారు. మీరెందుకు ప్రయత్నించకూడదని నెమ్మదిగా వారి మనసు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి సరేనంటూ ఒప్పుకున్న వారి నుంచి ముందుగా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు సంబంధించి జీ-మెయిల్‌ను తెలుసుకుంటున్నారు. ఆ జీ-మెయిల్ స్థానంలో తమ కంపెనీ పేరుతో ఉన్న జీ-మెయిల్ అకౌంట్‌తో లాగిన్ అవ్వాలని సూచిస్తున్నారు. కోట్లు వస్తాయి కదా అని ఆశ పడ్డ అమాయకులు సైబర్ నేరగాళ్లు చెప్పినట్లుగా చేస్తున్నారు. జీ-మెయిల్ మార్చిన వెంటనే ఫర్‌గెట్ పాస్‌వర్డ్ కొడుతున్నారు. ఈ ఫర్‌గెట్ పాస్‌వర్డ్ నోటిఫికేషన్ తాజాగా మార్చిన జీ-మెయిల్ అకౌంట్‌కు వెళ్తుంది. అంతే కొత్తగా పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసి టూ స్టెప్ అథంటికేషన్ ఆప్షన్ చేస్తున్నారు. అంతే..ఆ ప్రొఫైల్‌కు చెందిన వ్యక్తి ఆ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఏమీ చేయలేనికి స్థితికి వెళ్లిపోతున్నాడు. దీంతో తాను తక్కువ సమయంలో ఇన్వెస్ట్ చేసి లక్షలు సంపాదించానంటూ ఇన్‌స్టాగామ్ స్టోరీ పెడుతున్నారు. దీని చూసిన స్నేహితులు తాము కూడా చేస్తామంటూ ఇన్‌బాక్స్‌లో మాట కలుపుతున్నారు. ఇలా ఒక్కొక్కరిని వారి వలలో వేసుకుంటున్న మాయగాళ్లు వారు చెప్పిన వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేపించి లక్షల రూపాయిలు దోచేసుకుంటున్నారు. డబ్బు అంతా పోయాక వాట్సప్ లేదా ఆన్ కాల్లో మాత్రమే విషయం బయటపడుతుంది.

ఈ మాయగాళ్ల వలలో పడొద్దు



కంపెనీ సీఈఓలు ఎవరూ కూడా నేరుగా ఇన్‌స్టాగామ్ ఖాతాల్లో మెసేజ్‌లు చేయరు. మీకు కోట్లు వచ్చేలా చేస్తామంటూ మాయమాటలు చెప్పి మోసగిస్తున్న వారి వలలో పడొద్దు. అలా మీకు మెసేజ్ వస్తే రిపోర్ట్ ప్రెస్‌చేయండి. మీకు మెసేజ్ వచ్చిన దానిని స్క్రీన్ షాట్ తీసి స్టేటస్‌గా పెట్టండి, మీ స్నేహితులు ఎవరూ మోసపోకుండా మీరే అలర్ట్ చేయండి. ప్రతిరోజూ వస్తున్న 10-15 కేసుల్లో 3-4 కేసులు ఈతరహావే ఉంటున్నాయి.

– కేవీఎం ప్రసాద్, సిటీసైబర్‌క్రైం ఏసీపీ

క్లుప్తంగా

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

పంజగుట్ట: శ్రీ శ్రీనివాస కల్యాణం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 29 (నేడు)న మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ట్రస్ట్ సెక్రటరీ బిరుదురాజు కృష్ణంరాజు తెలిపారు. తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎలక్ట్రికల్ వాహనాల అందజేత

లిబర్టీ: సాక్ష్యం సంస్థ ఇద్దరు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాలను అందజేసింది. శనివారం ఆరెకటిక అభివృద్ధి సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సాక్ష్యం ప్రతినిధులు ధరంకారి శ్రీనివాస్, కేశవ్, శ్రీనివాస్‌లు దివ్యాంగులు పవన్, వనితలకు ఎలక్ట్రికల్ వాహనాలను అందజేసి వారికి తోడ్పాటు అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకటిక అభివృద్ధి సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు భూంపల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, మానవత్వంతో ముందుకొచ్చి ఆరెకటిక దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాలు అందించడం అభినందనీయమన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి కోరుట్ల చందు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవర్లకు భారీ జరిమానా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 23 మందిని శనివారం నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. 2021, 22, 23 సంవత్సరాల్లో పట్టుబడ్డ వీరందరినీ న్యాయస్థానంలో హాజరుపర్చగా వీరి నుంచి జరిమానాల రూపంలో రూ. 48,300 వసూలైనట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహరాజు తెలిపారు.

దైవసన్నిధానంలో రథసప్తమి వేడుకలు



స్వామివారికి పూజలు చేస్తున్న సూర్యనారాయణ

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానంలో శనివారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఇక్కడ కొలువుదీరిన సూర్య నారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో హోమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సూర్యభగవానుడికి విశేష పూజలు చేశారు. ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి, జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ వేడుకల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

సిటీ డీసీపీ ట్రాఫిక్-1గా రాహుల్ హెగ్డే



హిమాయత్‌నగర్: హైదరాబాద్ సిటీ ట్రాఫిక్-1 డీసీపీగా టీకే రాహుల్ హెగ్డే శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన రాహుల్ హెగ్డే రాజన్న సిరిసిల్లాలో అడిషనల్ ఎస్పీగా ఇప్పటి వరకు విధులు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల సాధారణ బదిలీల్లో ఆయనను అక్కడ నుంచి సిటీ ట్రాఫిక్-1 డీసీపీగా ట్రాన్స్‌ఫర్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కలిసి పనిచేద్దాం



హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి అందరూ కలిసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ మిట్టకంటి వినోద్‌రెడ్డి సూచించారు. ఇటీవల ఆ పార్టీ హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్లకు బి-బ్లాక్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సమీర్ కుర్బీ శనివారం వినోద్‌రెడ్డిని కలిశారు. వారిద్దరూ పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సమీర్ కుర్బీ మాట్లాడుతూ..మూడు డివిజన్లలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కిందస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీ గెలుపు దిశగా పని చేస్తానన్నారు.

కరెంట్ సరఫరా పునరుద్ధరించాలని ఆందోళన

హిమాయత్‌నగర్: తమ అపార్ట్‌మెంట్‌కు కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదర్‌గూడలోని ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద లిబర్టీలోని జమున అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చేపట్టారు. కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ అక్కడికి వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుటుంబం కరెంట్ బిల్లు బకాయి ఉందని, మిగిలిన కుటుంబాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారని తెలుసుకున్న ఆమె విద్యుత్ అధికారుల తీరును తప్పుబట్టారు. తక్షణమే అపార్టుమెంట్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించగా వారు పునరుద్ధరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.రామన్ గౌడ్ ఉన్నారు.

'పీఎం-శ్రీ'తో సర్కారు బడులకు మహర్దశ

- ఖైరతాబాద్ జోన్ పరిధిలో 20 పాఠశాలల ఎంపిక
- త్వరలోనే నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

బంజారాహిల్స్: కేంద్ర విద్యాశాఖ 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2026-27 వరకు ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ('పీఎం-శ్రీ పాఠశాల') పేరిట బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టగా ఈ పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది.

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో పథకాన్ని అమలు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా 60 శాతం నిధులు కేంద్రం సమకూరుస్తుండగా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నది.
- ఐదేళ్ల వరకు ప్రతియేటా ఎంపిక చేసిన పాఠశాలలకు రూ. 40 లక్షలు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.
- ఈ నిధులతో జాతీయ విద్యా విధానం (2020)లోని అంశాలకు అనుగుణంగా బడుల్లో మౌలిక సదుపాయాల నవీకరణ, వినూత్న బోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 21వ శతాబ్దం కీలక నైపుణ్యాలతో ఆదర్శ పాఠశాలలుగా, ఆధునీకతను సంతరించుకునేలా తీర్చిదిద్దుతారు.
- యూ-డైస్ గణాంకాలను పరిగణలోకి తీసుకొని నిర్దేశించిన కనీస ప్రమాణం ఆధారంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 20 పాఠశాలలను పీఎం-శ్రీ పథకానికి ఎంపిక చేసింది.

పరిగణలోకి తీసుకున్న అంశాలివే...

- రక్షణ నిబంధనలు పాటించాలి
- అగ్ని ప్రమాదాల రక్షణ-నివారణ నిబంధనలు పాటించాలి
- తరగతుల వారీగా విద్యార్థుల నమోదు వివరాలు
- బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయ్‌లెట్ల సౌకర్యం
- చేతులు శుభ్రం చేసుకునే వసతి
- ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం ఫొటో గుర్తింపు కార్డు
- తాగునీటి సౌకర్యం
- క్రీడా సామగ్రి, గ్రంథాలయాల నిర్వహణ



ఫిలింనగర్‌లోని ఎంజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఎంపికైన పాఠశాలలివే...

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్ అమీర్‌పేట డివిజన్ల పరిధిలోని ఈ కింది పాఠశాలలను పీఎం- శ్రీ పథకానికి ఎంపిక య్యాయి.
- ఫిలింనగర్ మహాత్మగాంధీనగర్ ప్రాథమిక పాఠశాల
- ఫిలింనగర్ అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల
- ఫిలింనగర్ పద్మాలయ అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల
- బంజారాహిల్స్ రోడ్ నం. 12 ఎస్పీటీనగర్ ప్రాథమిక పాఠశాల
- బంజారాహిల్స్ రోడ్ నం. 2 ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల
- బంజారాహిల్స్ రోడ్ నం. 5 దేవరకొండ బస్తీ ప్రాథమిక పాఠశాల
- టోలిచౌకి హకీంపేట కుంట ప్రాథమిక పాఠశాల
- ఫిలింనగర్ ఎమ్మార్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల
- ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లోని దుర్గా భవానీనగర్ ప్రాథమిక పాఠశాల(ఇంగ్లీష్ మీడియం)
- ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్ దుర్గా భవానీనగర్ ప్రాథమిక పాఠశాల
- హకీంషా నగర్ ప్రాథమిక పాఠశాల
- టోలిచౌకి చౌరాజన్‌సీ ప్రాథమిక పాఠశాల
- షేక్‌పేట ప్రాథమిక పాఠశాల
- వినాయకనగర్ ప్రాథమిక పాఠశాల
- హిందీనగర్ ప్రాథమిక పాఠశల
- షేక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- బంజారాహిల్స్ రోడ్ నం. 12 ఎస్పీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల
- రోడ్ నం.7 గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- రోడ్ నం.7 గతి ప్రాథమిక పాఠశాల

బహుజన రాజ్య స్థాపనే ఆర్‌పీఐ లక్ష్యం

పంజగుట్ట: బహుజనుల రాజ్య స్థాపనే లక్ష్యంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) పని చేస్తుందని పార్టీ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పేరం శివనాగేశ్వర రావు గౌడ్ అన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం ఫిబ్రవరి 3న కాచిగూడ, మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో 'బహుజన రాజ్యాధికారం' పేరుతో భారీ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలె హాజరవుతారని చెప్పారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శివనాగేశ్వర రావు గౌడ్ విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో 119 శాసనసభ, 17 ఎంపీ స్థానాలకు పోటీ చేస్తామన్నారు. 3వ తేదీన బహుజన రాజ్యాధికారం కోసం సూచనలు, సలహాలు, నూతన రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక, తెలంగాణ కార్యవర్గం ఎన్నిక జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్‌పీఐ ప్రధానకార్యదర్శి రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు గౌరక్ సింగ్, ఎండీ ఫయాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ్యూల్, మహిళా అధ్యక్షురాలు రోజారాణి, అస్లం పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్‌పీఐ నాయకులు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

బంజారాహిల్స్: ప్రతి యేటా పరీక్షల సమయంలో ఫిలింనగర్‌కు చెంది ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసుకునేందుకు ఎగ్జామ్ ప్యాడ్స్‌తో పాటు కిట్లను పంపిణీ చేస్తుంటారు.ఈ ఏడాది కూడా బంజారాహిల్స్ రోడ్ నం. 12 ఎస్పీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు స్కూల్ ఉపాధ్యాయులతో కలిసి పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. త్వరలోనే నియోజక వర్గంలోని అన్ని పాఠశాలల్లో ఈ కిట్లు పంపిణీ చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



పరీక్ష కిట్లు అందజేస్తున్న ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

హామీలు మరచిన మంత్రి

వీఆర్‌ఏల జేఏసీ ఆవేదన

పంజగుట్ట: తమ సమస్యలు పరిష్కరిస్తామని మునుగోడు ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి నేటి వరకు ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని, కనీసం తమకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని వీఆర్‌ఏ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్ రాజయ్య, ప్రధానకార్యదర్శి దాదేమియ, కన్వీనర్ సాయన్న మాట్లాడుతూ.. వీఆర్‌ఏలు రూ.10,500 వేతనంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నారని, ముఖ్యమంత్రి పలుదఫాల్లో వీఆర్‌ఏలకు ప్రకటించిన పే స్కేలను అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని 80 రోజులు దీక్ష చేశామని గుర్తుచేశారు. మునుగోడు ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్ తమను పిలిపించుకుని దశల వారీగా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, సమ్మె విరమించి 100 రోజులు దాటుతున్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో 48 గంటలపాటు ఇందిరాపార్క్ వద్ద మౌనదీక్ష చేస్తామన్నారు. సమావేశంలో కో కన్వీనర్లు వెంకటేష్ యాదవ్, ఎండీ రఫీ, మాధవ నాయుడు, వెంకటేష్, రవీందర్, బండారి వెంకటేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 3 జర్నలిస్టు కాలనీతో పాటు ప్రతాప్‌నగర్ బస్తీలో శనివారం ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి, ఎమ్మెల్సీ ప్రభాకర్‌లతో కలిసి ప్రారంభించారు. జర్నలిస్టు కాలనీలో రూ. 20 లక్షల వ్యయంతో మూడు చోట్ల నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి, ప్రతాప్‌నగర్‌లోని సర్దార్‌జీ గల్లీలో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులతో పాటు, రూ. 5.5 లక్షల వ్యయంతో నిర్మించిన బోర్‌వెల్‌ను ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం బస్తీలో నూతనంగా రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాములు చౌహాన్, ఆనంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం, ఎమ్మెల్సీ ప్రభాకర్, కార్పొరేటర్ కవితారెడ్డి

బసవతారకం ఆస్పత్రికి 10 బెడ్లు వితరణ



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా, హైదరాబాద్ సెంట్రల్ సంయుక్తంగా సామాజిక బాధ్యతలో భాగంగా క్యాన్సర్ పేషంట్ల కోసం 10 బెడ్లతో పాటు బెడ్‌షీట్లు, దిండ్లు అందజేశారు. కీమో థెరపీ, డే కేర్ అండ్ స్పెషల్ కేర్ వార్డును కూడా ఈ సందర్భంగా సర్వైకల్ క్యాన్సర్ రోగుల కోసం ఇన్నర్‌వీల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుర్జిత్ కౌర్, డిస్ట్రిక్ట్ చైర్మన్ లీలా చాంద్వాని, బిందు గుప్తా, సిమ్రాన్ ఠాకూర్, రోషిణి, రష్మీ దోషి సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ పి. సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, ఫణి కోటేశ్వర్‌రావు, డాక్టర్ హరితా కొడాలి పాల్గొన్నారు. అనంతరం 100 మంది కేన్సర్ బాధిత చిన్నారులకు పండ్లు, స్టేషనరీ కిట్లను పంపిణీ చేశారు.

వడ్డెరల సమస్యలను పరిష్కరించాలి

పంజగుట్ట: స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు వడ్డెరల జీవితాలు మారలేవని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన సంఘం ప్రధానకార్యదర్శి పల్లపు అశోక్, కోశాధికారి నారాయణ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంఆర్‌ఓ, కలెక్టర్లకు, ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ తమను ప్రగతిభవన్ పిలిపించుకుని మునుగోడు ఎన్నికల తర్వాత తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను మరోసారి తీసుకెళ్లేందుకు ఈ నెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసి, ఆ తర్వాత ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తామని ఐలమల్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పదించకపోతే చలో ప్రగతిభవన్ కార్యక్రమాని చేపడతామన్నారు. సమావేశంలో పబ్లిసిటీ సెక్రటరీ ఎం.చెన్నయ్య, యూత్ ప్రెసిడెంట్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలమల్లు

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం



పల్లె వాతావరణంలో విద్యార్థులు

హిమాయత్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటు సృజనాత్మకను పెంపొందించుకోవాలని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ సూచించారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫోర్డ్ గ్రామర్ స్కూల్లో గ్రామీణ జీవనశైలి, సాంస్కృతిక, సంప్రదాయాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రదర్శన ఎంతో దోహదపడుతుందన్నారు. స్కూల్ చైర్మన్ మణికొండ ప్రార్థన, ప్రధానోపాధ్యాయులు ఫమీదా, రామాంజుల, ఫాతిమా ఖాజిమ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతుల ప్రదానం

రహమత్‌నగర్: న్యూటన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత పి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, ఈ విషయంలో విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి. రమేశ్‌రెడ్డి, రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్బురపర్చిన ప్రదర్శన

వెంగళరావునగర్: శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం 'మనదేశం- మన గొప్పదనం' పేరిట రూపొందించిన నమూనాల ప్రదర్శన ఆకట్టుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రత్యేకతలు, మన సంస్కృతి, పంటలు, సంప్రదాయాలు, స్వాతంత్ర సమరయోధులు సాధించిన విజయాలను తెలియజేసే నమూనాలను చిన్నారులు తయారు చేసి అబ్బురపర్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షేక్ మస్తాన్ చిన్నారుల ప్రతిభను అభినందించారు. స్కూల్ వ్యవస్థాపకులు, చైర్మన్ శిరీష, భవానీశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వారికి రుణపడి ఉంటా

సింగర్ రాహుల్ సిప్లిగంజ్

సిటీబ్యూరో: 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో నేను పాడిన 'నాటు నాటు' పాట ఆస్కార్‌కు నామినేట్ కావడం చాలా గర్వంగా ఉందని, ఈ విషయం తెలిసి నా తల్లిదండ్రులు ఎంతో ఆనందపడ్డారని, ఈ సంతోషానికి కారణమైన రాజమౌళి, ఎంఎం కీరవాణికి నేను ఎప్పుడూ రుణపడి ఉంటా అని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అన్నారు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ ఏడాది మార్చి 24న విడుదలైంది. ఈ చిత్రంలో రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడిన 'నాటు నాటు' పాట ఆస్కార్‌కి నామినేట్ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాహుల్ సిప్లిగంజ్‌ని 'షేడ్ స్టూడియోస్' సీఈఓ దేవీప్రసాద్ బలివాడ అభినందించారు. అనంతరం రాహుల్ సిప్లిగంజ్ మాట్లాడుతూ ''నేను షేడ్ స్టూడియోస్‌లో ఎన్నో సినిమాలకు పాటలు పాడటం, అవి హిట్ అవడం సంతోషంగా ఉంది. 'నాటు నాటు' పాట తప్పకుండా ఆస్కార్ గెలుస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నా'' అని అన్నారు. షేడ్ స్టూడియోస్ సీఈఓ దేవీప్రసాద్ బలివాడ మాట్లాడుతూ. ''కీరవాణిగారు, రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ, పాటల రచయిత చంద్ర బోస్ మ్యూజికల్ జర్నీలో మా షేడ్ స్టూడియోస్ భాగమైనందుకు మేము అదృష్టంగా భావిస్తున్నాం'' అన్నారు. 'షేడ్ స్టూడియోస్ టీమ్' మ్యూజిక్ డైరెక్టర్ ప్రజ్వల్ క్రిష్, ఇంజినీర్ రామ్ గండికోట పాల్గొన్నారు.



రాహుల్ సిప్లిగంజ్‌ను అభినందిస్తున్న షేడ్ స్టూడియోస్ సీఈఓ దేవీప్రసాద్ బలివాడ

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 8లోని సప్తపర్ణిలో ముంబైకి చెందిన ప్రముఖ శాస్త్రీయ కళాకారిణి నిరాలి కార్తీక్ రాగ, రస ఔర్ ఫుర్సత్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో తన గాత్రంతో కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నారు. ముంబైకి చెందిన త్వమ్ ఆర్ట్స్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వీపీ సురమండల్ ఫౌండర్ మోహన్ హెమ్మాడి ప్రారంభించారు. నిరాలి పాటు మెహతాబ్ అలీ, నియాజీ, ఓంకార్ అగ్నిహోత్రి, అమిత్ మిశ్రా, కుర్రం తదితరులు ఈ కార్యక్రమాన్ని మరింతగా రక్తి కట్టించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వెంగళరావునగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ మహిళలకు ఎన్నోరకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య రావు, డివిజన్ అధ్యక్షులు కోనేరు అజయ్, నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు, సత్యనారాయణ, కిట్టు, ఆంజనేయులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

నేషనల్ జూట్ బోర్డును కోల్‌కతాలో విలీనం చేయొద్దు



బంజారాహిల్స్: చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కార్మికులు చేస్తున్న ధర్నాకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఖైరతాబాద్ కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు చరణ్ కౌశిక్, మెట్టు సాయికుమార్ తదితరులు శనివారం సంఘీభావం ప్రకటించారు. హైదరాబాద్‌లోని నేషనల్ జూట్ బోర్డును కోల్‌కతాలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని, దీంతో తయారీదారులందరూ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని రోహిణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తయారీదారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా నేషనల్ జూట్ బోర్డు హైదరాబాద్‌పై ఆధారపడి ఉపాధి పొందుతున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని జూట్ బోర్డు హైదరాబాద్‌ను కోల్‌కతాలో విలీనం చేయవద్దని ఆయన డిమాండ్ చేశారు.

వరద నీటి పైప్‌లైన్ దెబ్బతిన్నదంటూ ఆందోళన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం.10-బిలో ప్లాట్ నంబర్ 270-ఏ లోంచి జూబ్లీహిల్స్‌కు చెందిన వరద, మురుగు నీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అయితే ఈ పైప్‌లైన్‌ను ఆనుకొని ఇటీవల సదరు ప్లాట్ యజమాని నిర్మాణ పనులు చేపట్టాడు.సెల్లార్ తవ్వకాలతో పైప్‌లైన్ దెబ్బతిని మురుగంతా బయటికి వస్తున్నదంటూ స్థానికులు ప్లాట్ వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ ఏఈ ప్లాట్ లోంచి వెళ్తున్న ఈ పైప్‌లైన్‌కు రెండువైపులా అయిదు మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అయితే, ఈ తవ్వకాల మూలంగా పైప్‌లైన్ ధ్వంసం కావడం వల్ల మురుగు బయటికి పారుతూ స్థానికంగా దుర్వాసన వస్తోందని, చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 నుంచి తాము తీసుకున్న అనుమతుల మేరకే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని, పైప్‌లైన్‌ను ఏ మాత్రం ధ్వంసం చేయలేదని ప్లాట్ యజమాని శ్రీను వైట్ల వెల్లడించారు.

దేశభవితకు మార్గదర్శకులుగా నిలవాలి



నమూనాలను తిలకిస్తున్న దేవసేన

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థుల ఎంతో సృజనాత్మకతతో రూపొందించిన నమూనాలు చాలా ఆలోచింపజేస్తున్నాయని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎ.దేవసేన అన్నారు. శనివారం శ్రీనగర్‌కాలనీ శాలివాహనగర్‌లోని బ్రైట్ హైస్కూల్‌లో టెక్నోరమ పేరిట విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్‌పై సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను తిలకించారు. సైన్స్ అండ్ టెక్నాలజీని అందిపుచ్చుకొని దేశ భవితకు మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ ఎంఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ గిరిజ, హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.24 వేలు చెల్లించాలి

లిబర్టీ: తెలంగాణ వ్యాప్తంగా పని చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ. 24 వేలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం శనివారం లిబర్టీ వద్ద ఉన్న కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 వార్షిక బడ్జెట్‌లో మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేందుకు నిధులు కేటాయించాలని కోరారు. 11వ పీఆర్సీ ముగుస్తున్నందున వేతనాలు పెంచాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని విన్నవించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకటయ్య, కె.జయచంద్ర, కోశాధికారి బొడ్డుపల్లి కిషన్, రాష్ట్ర కార్యదర్శి సభ్యులు మార్టిన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏసురత్నం తదితరులు

క్లుప్తంగా...

నేను మూర్ఖుడిని

- మా వారిపై కేసులు పెట్టిన అధికారులను వదిలిపెట్టం
- యువగళం పాదయాత్రలో నారా లోకేశ్



శాంతిపురం (చిత్తూరు జిల్లా): తాను మూర్ఖుడినని, తమ వారిపై కేసులు పెట్టిన అధికారులను వదలిపెట్టేది లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. చక్రవడ్డీతో కలిపి రుణం తీర్చుకుంటామని అన్నారు. భయం తమ బ్లడ్‌లోనే లేదని అన్నారు. కేసులకు భయపడకుండా పోరాటం చేయాలని పార్టీ కార్యకర్తలకు చెప్పారు. లోకేశ్ యువగళం పాదయాత్ర శనివారం ఉదయం గుడుపల్లె మండలంలోని పీఈఎస్ ఆస్పత్రి వద్ద ప్రారంభమై సాయంత్రం శాంతిపురం మండలంలోని టి.కొత్తూరు క్రాసు వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆయన టీడీపీకి చెందిన కురబ కుల నాయకులు, బీసీ నాయకుల సమావేశాల్లో, పలు చోట్ల రోడ్లపై నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. తమ హయాంలో కుప్పంలో పరిశ్రమలు తెచ్చామని, 25 వేల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు.

వాయుగుండంగా మారనున్న అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్య రేఖను ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కూడా విస్తరించి ఉంది. ఇది క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఆదివారం తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం అదే దిశలో కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి నివేదికలో వెల్లడించింది. వాయుగుండం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఫిబ్రవరి 1న శ్రీలంక తీరానికి చేరుకుంటుందని తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 30వ తేదీ నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది.



వైభవంగా రథ సప్తమి సూర్య జయంతిని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీమలయప్పస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

విచారణ పారదర్శకంగా జరగాలని కోరాం

కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి వెల్లడి

- వీడియో, ఆడియో రికార్డింగ్ కోసం పట్టుబట్టిన న్యాయవాది
- సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామన్న సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్, అమరావతి: ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఒక సాక్షిగా శనివారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. విచారణ పారదర్శకంగా జరగాలని కోరారు. సీబీఐ అధికారులు సీఆర్‌పీసీ సెక్షన్ 160 (సాక్షిగా పిలవడం) కింద జారీ చేసిన నోటీసులను గౌరవిస్తూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చారు. ఆయనతో పాటు న్యాయవాదులు తప్పెట నాగార్జునరెడ్డి, నాగిరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కూడా ఉన్నారు. రాత్రి 7.30 గంటల వరకు అవినాశ్‌రెడ్డి నుంచి సీబీఐ అధికారులు పలు అంశాలపై సమాచారాన్ని సేకరించారు. ఇదే సమయంలో అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి సీబీఐ అధికారులను కలిశారు. అవినాశ్‌రెడ్డి వాంగ్మూలాల నమోదు ప్రక్రియను మొత్తం వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని కోరారు. ఈ కేసుకున్న సున్నితత్వం, వీడియో ఆడియో రికార్డింగ్ చేయాల్సిన అవసరాన్ని, ఈ విషయంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆయన సీబీఐ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ కేసులో మీడియా ట్రయల్ నిర్వహిస్తోందని, అందువల్ల వాంగ్మూల నమోదు ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని గట్టిగా ఆయన పట్టుబట్టారు. ఓ వర్గం మీడియా అవినాశ్‌రెడ్డిను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కథనాలు రాస్తోందని, అందువల్ల నిష్పాక్షిక దర్యాప్తులో భాగంగా వీడియో ఆడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి అని చెప్పారు. అవినాశ్‌రెడ్డిని ఓ సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామని, ఆయన పట్ల ఏ రకంగానూ అమర్యాదగా, అనుచితంగా వ్యవహరించడం లేదని న్యాయవాదులకు సీబీఐ అధికారులు చెప్పినట్లు తెలిసింది. వాంగ్మూలం నమోదు అనంతరం అవినాశ్‌రెడ్డి సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. 'సీబీఐ దర్యాప్తు అధికారి అడిగిన ప్రశ్నలకు నాకు తెలిసిన మేర సమాధానాలు చెప్పాను. మళ్లీ అవసరమైతే పిలుస్తామని సీబీఐ అధికారులు చెప్పారు. వారు పిలిస్తే మళ్లీ విచారణకు హాజరవుతా. వారికి సహకరిస్తా. వారి సందేహాలను నివృత్తి చేస్తా'అని తెలిపారు. విచారణ పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే న్యాయవాదిని అనుమతించాలని కోరామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విచారణలో కొద్ది రోజులుగా ఓ వర్గం మీడియా విపరీతంగా వక్రీకరణలు చేస్తోందన్నారు. వాస్తవాలను, వార్తలను వక్రీకరించి దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా, వ్యక్తిత్వ హననం చేసే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఇకపై ఇలాంటివి జరగకూడదనే వీడియో, ఆడియో రికార్డింగ్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరామన్నారు.

అత్యంత విషమంగా తారకరత్న ఆరోగ్యం

- నారాయణ హృదయాలయలో ఎక్మో ద్వారా చికిత్స
- పలువురు కుటుంబ సభ్యుల పరామర్శ

సాక్షి బెంగళూరు: సినీ నటుడు నందమూరి తారకరత్న ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని బెంగళూరులోని నారాయణ హృదయాలయ వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో ఐసీసీయూలో చికిత్స అందిస్తున్నారు. తారకరత్న గుండె పని తీరు సరిగా లేకపోవడంతో ఎక్మో ద్వారా చికిత్స అందిస్తున్నారు. మరో 48 గంటలు గడిస్తేనే కానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కుప్పంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్నకు గుండెపోటు వచ్చిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు మరింత మెరుగైన చికిత్స కోసం ఆయన్ని శుక్రవారం అర్ధరాత్రి బెంగళూరు బొమ్మసంద్రలోని నారాయణ హెల్త్ సిటీలో చేర్పించారు. ఆయనకు ఇంట్రా ఆయోర్టిక్ పంప్, వ్యాసో ఆక్టివ్ సహాయంతో చికిత్స ఇస్తున్నట్లు వైద్యులు తెలిపారు. బెలూన్ యాంజియోప్లాస్టీ ద్వారా రక్తాన్ని పంపింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య బృందాలు ఆయనకు చికిత్స అందిస్తున్నాయన్నారు.

చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యుల పరామర్శ

తారకరత్నను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు టీడీపీ ప్రముఖులు శనివారం సాయంత్రం ఆస్పత్రిలో పరామర్శించారు. దగ్గుబాటి పురందేశ్వరి, దివంగత హరికృష్ణ కుమార్తె సుహాసిని, సోదరుడు చైతన్యకృష్ణ, టీడీపీ నేతలు నిమ్మకాయల చిన్నరాజప్ప, పరిటాల శ్రీరామ్, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పరామర్శించారు. తారకరత్నకు త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సోమవారం మరోసారి కీలక పరీక్షలు చేస్తారని తెలిపారు.

కోలుకోవడానికి సమయం పడుతుంది : చంద్రబాబు

తారకరత్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకోవడానికి సమయం పడుతుందని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో తారకరత్న ఉన్నారని తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

మీకు ప్రాణభిక్ష పెట్టింది పోలీసులే

అచ్చెన్నాయుడుపై చిత్తూరు జిల్లా పోలీసు సంఘం ధ్వజం

చిత్తూరు రూరల్/కుప్పం(చిత్తూరు జిల్లా)/తిరుపతి మంగళం: టీడీపీ నేత అచ్చెన్నాయుడికి ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని.. ఆ విశ్వాసం మరిచి ఇప్పుడు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని చిత్తూరు జిల్లా పోలీసు యూనియన్ అసోసియేషన్ ధ్వజమెత్తింది. కుప్పంలో శుక్రవారం జరిగిన నారా లోకేశ్ పాదయాత్రలో అచ్చెన్నాయుడు పోలీసులను అసభ్య పదజాలంతో దూషించడం పట్ల పోలీసు సంఘం నేతలు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం వారు చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు ఉదయ్ మాట్లాడుతూ.. గతంలో అచ్చెన్నాయుడిని కొందరు చితకబాది పడేసుంటే.. ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని గుర్తు చేశారు. అచ్చెన్నాయుడు రాజకీయ ఎదుగుదల కోసమే పోలీసులను చులకన చేసి మాట్లాడుతున్నారని, ఇటీవల కాలంలో టీడీపీ నేతలంతా పోలీసులను తిట్టడం ఓ ఫ్యాషన్‌గా మార్చుకున్నారని మండిపడ్డారు. అచ్చెన్నాయుడు పోలీసులకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డిని కలిసి.. అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కాగా, నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో అచ్చెన్నాయుడు పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారని సీఐ శ్రీధర్ వెల్లడించారు.

'వీరయ్య' సక్సెస్‌మీట్‌లో తొక్కిసలాట.. లాఠీ చార్జ్

హనుమకొండలో వాల్తేరు వీరయ్య చిత్రం సక్సెస్ మీట్

- చిరంజీవిని చూసేందుకు దూసుకొచ్చిన అభిమానులు
- ప్రధాన గేటు వద్ద తొక్కిసలాట.. పలువురికి గాయాలు

వరంగల్ క్రైం: వాల్తేరు వీరయ్య చిత్ర యూనిట్ శనివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'వాల్తేరు వీరయ్య విజయ విహారం'పేరిట నిర్వహించిన సక్సెస్ మీట్‌లో గందరగోళం చోటుచేసుకుంది. చిరంజీవిని చూసేందుకు అభిమానులు ఒక్కసారిగా తోసుకుని రావడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. వేదిక ప్రధాన గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురికి గాయాలయ్యాయి. అభిమానుల తాకిడిని చిత్ర యూనిట్‌తోపాటు పోలీస్‌శాఖ గుర్తించకపోవడం, అభిమానుల సంఖ్యకు తగ్గట్లు ఏర్పాట్లు చేయకపోవడంపై అటు అభిమానులు, ఇటు నగరవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బందోబస్తు ఫెయిల్యూర్ అయ్యిందన్న విమర్శలు పెద్దఎత్తున వినిపించాయి. శనివారం సాయంత్రం ఆరు గంటల తరువాత సినిమా సక్సెస్ మీట్ ప్రారంభమైంది. మెగాస్టార్ చిరంజీవి, హీరో రాంచరణ్ తదితరులు హాజరయ్యారు. ప్రధాన గేటును తెరిచిన సమయంలో ప్రజలు, అభిమానులు తమ అభిమాన హీరోలను చూసేందుకు ఒక్కసారిగా తోసుకుని రావడంతో కొంతమంది కిందపడటం.. వారిని తొక్కుకుంటూ మిగతా వారు గ్రౌండ్ లోపలికి వెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి. అయితే తొక్కిసలాటలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ సమయంలో కొందరు పోలీసులు సైతం కిందపడ్డారు.

ఏర్పాట్లలో నిర్లక్ష్యం వల్లే...

కళాశాల గ్రౌండ్ విశాలంగా ఉన్నప్పటికి చిత్ర యూనిట్ అందులో బారికేడ్లు ఏర్పాటు చేసింది. దీనికి తోడు అధికసంఖ్యలో జారీ చేసిన ఎంట్రీ పాస్‌ల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. మైదానంలోకి ప్రవేశించిన అభిమానులకు పాస్‌ల ప్రకారం ఆయా గ్యాలరీలకు వెళ్లేందుకు ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో అన్ని పాస్‌ల వారు ఇష్టారాజ్యంగా లోపలికి చొరబడేందుకు ప్రయత్నం చేయడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దీనికి తోడు ఏర్పాటు చేసిన బారికేడ్లు కూడా అభిమానుల తోపుడుకు కిందపడ్డాయి. దీంతో ఒక గ్యాలరీ నుంచి మరో గ్యాలరీకి అభిమానులు చొరబడ్డారు. బందోబస్తు ప్రణాళికలో పోలీసులు ఫెయిల్యూర్ అయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి.

బీజేపీ, జనసేన కలిసే పోటీ

రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన రెండు కలిసే పోటీ చేస్తాయని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి బీజేపీనే అసలైన ప్రత్యామ్నాయమన్నారు. వచ్చే మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాల ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రాజెక్టుల వేగవంతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వారసత్వ రాజకీయాలకు, కుటుంబ పాలనలకు ఏపీ అడ్డాగా మారిందన్నారు.

నగర వార్తలు

క్లుప్తంగా

ఫిబ్రవరిలో ఓయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల (సీబీసీఎస్) 3వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 6వ తేదీ వరకు కొనసాగే పరీక్షల టైంటేబుల్‌ను ఉస్మానియా వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

డాక్టర్ సుధీర్ ధారాకు ఇండియన్ అచీవర్స్ అవార్డు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో సుధీర్ ధారా

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక ఆరోగ్య రంగానికి అందించిన సేవల్లో భాగంగా అత్యధిక సంఖ్యలో పీఆర్‌పీ చికిత్సలు చేసిన ఎపివన్ గ్రూప్ ఆఫ్ క్లినిక్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ సుధీర్ ధారాకు మూడవ ఎడిషన్ పవర్ కారిడార్ ఇండియన్ అచీవర్స్ అవార్డు–23 లభించింది. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఆరోగ్యం, విద్య, సాంస్కృతిక అభివృద్ధి, వ్యాపారం, సామాజిక క్రియాశీలత, ఐక్యత తదితర రంగాల్లో దేశానికి అందజేసిన సేవలకు గుర్తింపుగా విశిష్టమైన వ్యక్తులకు ఈ అవార్డును ఇస్తారు. న్యూఢిల్లీలోని కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పవర్ కారిడార్ ఇండియన్ అచీవర్స్ మూడవ ఎడిషన్ వేడుకలలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

అలరించిన గ్లోబల్ మ్యూజిక్ ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం నిర్వహిపంచిన లక్ష్మీనారాయణ గ్లోబల్ మ్యూజిక్ ఫెస్టివల్ ఆహూతులను అలరించింది. అంతర్జాతీయ వయోలిన్ విద్వాంసులు పద్మభూషణ్ డాక్టర్ ఎల్. సుబ్రమణ్యం, పద్మశ్రీ కవితా కృష్ణమూర్తి సంగీత కచేరీని నిర్వహించారు. బిందు సుబ్రమణ్యం, అంబి సుబ్రమణ్యంతో పాటు స్పానిష్ డ్యాన్సర్ నజారే డే, ఆఫ్రికాలోని మాలి నుండి వచ్చిన అంతర్జాతీయ సింఫని ఆర్టిస్ట్ ఫస్సేరి దిబాటేతో పాటు ప్రముఖ కథక్ కళాకారిణి మేఘరంజని, భరత నాట్య కళాకారిణి నందిని జయకుమార్‌లు వారి ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

సందడిగా 'సాక్షి' ప్రాపర్టీ షో!

- సందర్శకులతో స్టాళ్లు కిటకిట
- ఫ్యామిలీతో విచ్చేసిన నగరవాసులు
- ఘనంగా ప్రారంభమైన సాక్షి ప్రాపర్టీ షో
- అందుబాటులో రూ.40 లక్షల నుంచి రూ.4 కోట్ల ప్రాపర్టీలు
- నేడే ఆఖరు..ప్రవేశం ఉచితం



సాక్షి, సిటీబ్యూరో: ఆహ్లాదకర వాతావరణంలో సొంతిల్లు కావాలనుకునేవారు..ఆధునిక వసతులు, తక్కువ ధరతో సొంతం చేసుకోవాలనుకునే వారు.. ప్రత్యేక రాయితీలు, సులభ వాయిదాల్లో గూడు కోరుకునేవారితో 'సాక్షి' ప్రాపర్టీ షో కిటకిటలాడింది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం 'సాక్షి' 14వ ప్రాపర్టీ షో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర కాలేజియేట్ అండ్ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచే కుటుంబంతో సహా సందర్శకులు ప్రదర్శనకు విచ్చేశారు. గంట గంటకూ సందర్శకుల తాకిడి పెరగడంతో ప్రాంగణం కిటకిటలాడింది. రూ.40 లక్షల నుంచి రూ.4 కోట్ల ప్రాపర్టీల వరకు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. నగరానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థలు, బ్యాంకులు 40 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ప్రతి స్టాల్ వద్ద ప్రాజెక్టుల వివరాల సేకరణ, ఎంపికలో కొనుగోలుదారులు బిజీ బిజీగా కనిపించారు. నగరం నలువైపులా ఉన్న ప్రాజెక్టులు, వాటి ధరలను సందర్శకులకు అందించారు. ఐటీ ఉద్యోగులు తమ కుటుంబంతో సహా విచ్చేసి ప్రతి స్టాల్ వద్ద స్థిరాస్తి వివరాలు, ప్రాజెక్ట్‌లోని వసతుల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. 'నిర్మాణంలో ఉన్నవి, త్వరలో ప్రారంభం కానున్న ప్రాజెక్టుల వివరాలతో పాటూ మీ ప్రాజెక్టులో ఫ్లాట్ తీసుకుంటే లోన్ సౌకర్యం ఉంటుందా' అంటూ అమితాసక్తితో ఆరా తీశారని స్టాల్ నిర్వాహకులు చెప్పారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏయే నిర్మాణాల్లో ఎంత రేటు చెబుతున్నారు...అవి ప్రస్తుతం ఏయే దశలో ఉన్నాయి. ఏయే రాయితీలను అందిస్తున్నారు వంటి సమాచారాన్ని కొనుగోలుదారుల ముందు ప్రదర్శిస్తారు. ఎంపికలో కీలకమైన ఇలాంటి విషయాలు తెలిస్తేనే.. కొనుగోలుదారులు అంతిమ నిర్ణయానికి రావటం తేలికవుతుంది. నేటికీ నగరంలో ఇళ్ల ధరలు అందుబాటులోనే ఉన్నాయని.. రానున్న రోజుల్లో మార్కెట్ వురింత మెరుగవుతోంది కాబట్టి, ధరలు పెరిగినా ఆశ్చర్యపడక్కర్లేదు. కాబట్టి, సొంతిల్లు కొనుక్కోవడానికి ఇంతకు మించిన తరుణం లేదని స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు. సాక్షి ప్రాపర్టీ షోకు ప్రధాన స్పాన్సర్‌గా అపర్ణా కన్‌స్ట్రక్షన్స్, అసోసియేట్ స్పాన్సర్లుగా వాసవి గ్రూప్, సైబర్‌సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, రాజపుష్ప ప్రాపర్టీస్, కో–స్పాన్సర్లుగా సాకేత్ ఇంజనీర్స్, శిల్పా రాఘవ ప్రాజెక్ట్స్ వ్యవహరించాయి. ఆదివారంతో సాక్షి ప్రాపర్టీ షో ముగియనుంది. ప్రవేశం ఉచితం.



స్టాళ్లలో వివరాలు తెలుసుకుంటున్న సందర్శకులు

నా పని సులువైంది



ఓపెన్ ప్లాట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నా. వారానికి ఒక ప్రాంతం చొప్పున కొంత కాలం వెతికాం. 'సాక్షి' ప్రాపర్టీ షోకు రావటం వల్ల ఏ ప్రాంతంలో ఎలాంటి ఓపెన్ ప్లాట్లు దొరుకుతున్నాయి, భవిష్యత్తు అభివృద్ధి ఎలా ఉంటుంది, విలువ ఎలా పెరుగుతుంది వంటి వివరాలు తెలిశాయి. నా పనిని సులువు చేసిన సాక్షికి థాంక్యూ. – డాక్టర్ నేహా, వైద్యురాలు, మియాపూర్

మా అత్తగారి కోసం..




మా అత్తగారి ఫ్యామిలీ విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు షిఫ్ట్ అవుతోంది. అద్దెకు ఉండే బదులు సొంతిల్లు తీసుకోవాలని అనుకుంటున్నాం. ప్రధాన నగరంలో అపార్ట్‌మెంట్‌తో పాటు శివారు ప్రాంతంలో ఓపెన్ ప్లాట్ కోసం చూస్తున్నాం. – శృతి, గృహిణి, శ్రీబాగ్ కాలనీ

ధరలెలా ఉన్నాయో తెలిశాయి



సాక్షి పత్రికలో ప్రకటన చూసి వచ్చాను. పెద్ద కంపెనీల స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ప్రధాన నగరంలోని అపార్ట్‌మెంట్లతో పాటు శివారు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల వివరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఏ ప్రాంతంలో ఎంత ధరలున్నాయో ప్రాపర్టీ షోకు వచ్చాక తెలిసింది. – రవితేజ, ఐటీ ఉద్యోగి, మాదాపూర్

సాక్షి ప్రాపర్టీ షోకు తప్పకుండా వస్తుంటా...



ఫ్లాట్‌ను కొనుగోలు చేద్దామని ఏవరైనా డెవలపర్‌ని కలిస్తే వాళ్లు చెప్పిందే నమ్మాలి. కానీ, ఇలాంటి ప్రాపర్టీ షోలకు వస్తే ఒకే వేదికగా చాలా మంది డెవలపర్లను కలిసే అవకాశం ఉంటుంది. వాళ్లు చెప్పే ప్రాజెక్ట్ వివరాలు, ధరలను ఇతర సంస్థలతో సరిపోల్చుకునే అవకాశముంటుంది. అందుకే సాక్షి నిర్వహించే ప్రతి ప్రాపర్టీ షోకు వస్తుంటాను. – ఓబన్న, రిటైర్డ్ ఉద్యోగి, నల్లగండ్ల

సాహితీ ఉత్సాహం...

సంబరంగా ఉత్సవం

- సకల కళల సందడికి చిరునామాగా హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్
- ఆకట్టుకుంటున్న ఈవెంట్లు
- ఆసక్తికరంగా సాగిన పి.సాయినాథ్‌తో సంభాషణ

సాక్షి,సిటీబ్యూరో: సైఫాబాద్‌లోని విద్యారణ్య హైస్కూల్‌లో జరుగుతున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (హెచ్‌ఎల్‌ఎఫ్) సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 13వ ఎడిషన్ రెండవ రోజు పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా వ్యవస్థాపకుడు–డైరెక్టర్, పుస్తక రచయిత పి.సాయినాథ్‌తో హెచ్‌ఎల్‌ఎఫ్ ప్రతినిధి సునీతారెడ్డి జరిపిన సంభాషణ ఆసక్తికరంగా సాగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మల్లు స్వరాజ్యం సహా దేశానికి అంతగా పరిచయం లేని స్వాతంత్ర్య సమరయోధుల గురించి పి.సాయినాథ్ రచించిన 'ది లాస్ట్ హీరోస్ ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడమ్' పై వీరి చర్చ ఎన్నో విషయాలను వెల్లడించింది. పుస్తకం వెలికితీసినా...ఎవరికీ తెలియని, ఏ గుర్తింపూ, ఏ ప్రయోజనమూ పొందకుండా జీవితాంతం చీకట్లోనే ఉండిపోయిన స్వాతంత్ర్య సమరయోధుల గురించి సునీతారెడ్డి ప్రశ్నకు సమాధానంగా రచయిత వెల్లడించిన విషయాలు అబ్బురపరిచాయి.

- అదే విధంగా దీ స్పీకింగ్ కానిస్టిట్యూషన్ పేరిట సాగిన ప్యానెల్ చర్చలో కల్పనా కన్నాభిరన్, రాజకీయ ప్రముఖులు కోదండరామ్‌లు రచయిత్రి ఓల్గాతో రాజ్యాంగం పరిధులు తదితర విశేషాలపై సంభాషించారు. ఎవరెస్ట్‌ను అధిరోహించిన అతి పిన్నవయస్కురాలైన పూర్ణా మలావత్‌తో అపర్ణతోట రచించిన పుస్తకంపై పాత్రికేయురాలు ఉమా సుధీర్ చర్చ ఆకట్టుకుంది.
- కావ్య ధార పేరిట సాగిన కవితా గోష్టిలో సినీ, సాహితీ ప్రముఖురాలు దీప్తి నావల్, ముంబయి కవయిత్రి జెర్రీ పింటో, కళ్యాణి ఠాకూర్, జెన్ కశ్యప్, రమేష్ కార్తీక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. – ఈ సందర్భంగా బహు భాషా కవిత్వాలు కవితాభిమానులను అలరించాయి. టైమ్ మేనేజ్‌మెంట్, ఫ్రీస్టైల్ ర్యాపింగ్, నేచురల్ కలర్స్ వంటి విభిన్న అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. స్టేజ్ టాక్‌లో ప్రియా రమణి లవ్ లెసెన్స్ ఫ్రమ్ యాన్ ఇన్‌స్టాగ్రామ్ ప్రాజెక్టును అందించారు. మూవింగ్ ఇమేజెస్ బాక్స్‌లో ది అదర్ కోహినూర్, ది రాక్స్ ఆఫ్ హైదరాబాద్ మూవీ....హైదరాబాద్ 'రాక్' హిస్టరీని కళ్లకు కట్టింది. రోజంతా సాగిన లిటరరీ ఫెస్ట్‌లో పలువురు జాతీయ అంతర్జాతీయ సాహితీప్రముఖులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎనీ టైమ్ స్టోరీ...

నగరానికి చెందిన డీవో సైన్స్ సంస్థ రూపొందించిన స్టోరీ బాక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ఏ టైమ్‌లో కావాలంటే ఆ టైమ్‌లో కావాల్సిన కథలు, పజిల్స్, ఆసక్తికరమైన టాపిక్స్‌ను బటన్ నొక్కి అందుకునేందుకు ఈ బాక్స్ అవకాశమిస్తుందని ఈ సందర్భంగా రూపకర్తలు తెలిపారు. ఏడాదికి ఓసారి మార్చే విధంగా పలు భాషల్లో దాదాపు 800కిపైగా కథలు ఇతరత్రా ఆకస్తికరమైన అంశాలు ఈ బాక్స్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.

తలగడపై చిన్నారి 'కళ'...

నిద్రపోవడానికి తలగడపై తల పెట్టినప్పుడు వెంటనే మనలో కలిగే ఆలోచన ఏమిటి? ఏం గుర్తొస్తుంది? ఏది మరచిపోవాలని నిర్ణయం తీసుకుంటారు? వంటి ప్రశ్నలకు తమదైన శైలిలో కళాత్మక సమాధానం చెప్పారు పాతబస్తీపాఠశాలల విద్యార్థులు. నగరానికి చెందిన డైరా ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో పలు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు చిన్ని చిన్ని పిల్లోస్‌పై చిత్రాలను లిఖించారు. పిల్లో ఆర్ట్‌కి పేరొందిన జర్మనీకి చెందిన చిత్రకళాకారిణి స్ఫూర్తితో ఈ కాన్సెప్ట్ డిజైన్ చేశానని దీని కోసం డార్క్ థీమ్‌లో చిన్నారుల చిత్రాలను ప్రదర్శించానని క్యూరేటర్ అటికా అంజాద్ చెప్పారు.

రాక్ చరిత్ర...ఆ చిత్రం...

మూవింగ్ ఇమేజెస్ విభాగం కింద నగరానికి చెందిన సేవ్ రాక్స్ సొసైటీ సభ్యురాలు ఉమ మంగళ్ రూపొందించిన అదర్ కోహినూర్స్: ది రాక్స్ ఆఫ్ హైదరాబాద్ లఘు చిత్రం భాగ్యనగరిలో రాళ్ల చరిత్రను అందాలను కళ్లకు కట్టింది. కొన్ని దశాబ్దాలుగా కరిగిపోతున్న రాతి సంపద వల్ల కష్ట నష్టాలను దర్శింపజేసింది. మీ ఆహారం గురించి తెలుసుకోండి పేరుతో నగరానికి చెందిన న్యూట్రిషనిస్ట్ జాస్తి శ్రీదేవి నిర్వహించిన వర్క్‌షాప్ రోజువారీ ఆహారపు అలవాట్లలో మార్పు చేర్పుల అవసరాన్ని నొక్కి చెప్పింది. చిన్నారి చెఫ్‌లతో ఆమె చేసిన సందడి అలరించింది.



చర్చావేదికలో పాల్గొన్న ప్రముఖ రచయిత పి.సాయినాథ్, హెచ్‌ఎల్‌ఎఫ్ ప్రతినిధి సునీతారెడ్డి

క్లుప్తంగా...

గ్రూప్-4లో మరో 141 పోస్టులు

టీఎస్‌పీఎస్సీ అనుబంధ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–4 కొలువులు మరిన్ని పెరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,039 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసిన తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. తాజాగా గ్రూప్–4 కేటగిరీలో మరో 141 పోస్టులను జత చేస్తూ అనుబంధ ప్రకటనను శనివారం విడుదల చేసింది. దీంతో గ్రూప్–4 కేటగిరీలో పోస్టుల సంఖ్య 8,180కు చేరింది. తాజాగా ప్రకటించిన 141 పోస్టులు మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీకి సంబంధించిన ఖాళీలు. ఇందులో బాలుర గురుకుల విద్యాసంస్థలకు సంబంధించి 86 పోస్టులుండగా, బాలికల విద్యా సంస్థలకు సంబంధించి 55 పోస్టులున్నాయి. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

వచ్చే నెల 26న కొలకలూరి పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: కొలకలూరి పురస్కారాలను వచ్చే నెల 26వ తేదీన ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మూడు కేటగిరీల్లో పురస్కారం కింద అందచేస్తామని, ఒక్కో పురస్కారానికి రూ.15 వేలతో పాటు మెమెంటో ఇస్తామని కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి సుమకిరణ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవితా విభాగంలో 'పచ్చి కడుపు వాసన' కవితా సంపుటి రాసిన యార్లగడ్డ రాఘవేంద్రరావుకు రూ.15 వేలతో పాటు సత్కారం, 'ఇక ఇప్పుడు' కవితా సంపుటి రాసిన కటుకోజ్వల ఆనందాచారికి రూ.5వేలతో పాటు సత్కారం ఉంటుందన్నారు. నాటక విభాగంలో 'ఆకెళ్ల నాటికలు' నాటికా సంపుటి రాసిన ఆకెళ్ల వెంకట సూర్య నారాయణకు రూ.15 వేలతోపాటు సత్కారం, మూడో విభాగంలో 'తెలంగాణ కథ–వర్తమాన జీవన చిత్రణ' పరిశోధన గ్రంథానికి డాక్టర్ ఎం.దేవేంద్రకు రూ.15 వేలతో పాటు సత్కారం 'రాచపాళెం- సాహిత్య విమర్శ–సమగ్ర అధ్యయనం' పరిశోధన గ్రంథానికి డాక్టర్ ఏఏ నాగేంద్రకు రూ.5 వేలతో పాటు సత్కారం ఉంటుందని వారు వివరించారు.

జూడాల సంఘం అధ్యక్షుడిగా కౌశిక్ కుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర జూనియర్ డాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘం అధ్యక్షునిగా డాక్టర్ పింజర్ల కౌశిక్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్కే అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి.శ్రీనాథ్, ప్రణయ్ మోతె, అరుణ్‌కుమార్, కౌశిక్ జోషి, తాన్యా జరార్, ప్రత్యూష్‌రాజ్‌లు ఎన్నికయ్యారు.

రామచంద్రమూర్తికి అరుణ్‌సాగర్ పాత్రికేయ పురస్కారం

వచ్చేనెల 12న భద్రాచలంలో ప్రదానం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవి, జర్నలిస్టు అరుణ్‌సాగర్ పేరిట ప్రతీ ఏటా ఇచ్చే పురస్కారాల్లో ఈ ఏడాది అరుణ్‌సాగర్ పాత్రికేయ అవార్డును ప్రముఖ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి, సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవయిత్రి కుప్పిలి పద్మకు అందించనున్నట్లు అరుణ్‌సాగర్ ట్రస్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 12న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఈ అవార్డుల ప్రదానం ఉంటుందని వెల్లడించింది. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపింది.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎస్‌కు లేఖ రాసిన ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సుపరిపాలన వేదిక(ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఎఫ్‌జీజీ కార్యదర్శి పద్మనాభరెడ్డి శనివారం లేఖ రాశారు. ఈఎన్సీ సమగ్ర సర్వే జరిపి జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని వాడుకోవచ్చని డీపీఆర్ తయారు చేయగా.. దానిని సీఎం కేసీఆర్ కాదని శ్రీశైలం నుంచి నీటిని తీసుకోవాలని సూచించారన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టుపై నిపుణుల రిపోర్టు కాదని రాజకీయ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. సర్వేకు భిన్నంగా కార్యాలయంలోనే మ్యాపుల ఆధారంతో ఆదరాబాదరగా రెండు వారాల్లో శ్రీశైలం నుంచి 90 టీఎంసీల నీటిని తీసుకోవడానికి డీపీఆర్ తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు ఇంత పెద్ద ప్రాజెక్టుకు ఎటువంటి పర్యావరణ, ఇతర అనుమతుల్లేకుండా మొదలు పెట్టారన్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు, సాలీనా కడుతున్న వడ్డీ, ప్రాజెక్టుకు కావాల్సిన 4,560 మెగావాట్ల విద్యుత్ ఎక్కడి నుంచి తెస్తారో ప్రజలకు వివరించాలన్నారు.

దొడ్డ శ్రీనివాసరెడ్డి



టెక్ ప్రపంచంలో పంచేంద్రియాలు!

మనిషి సృష్టించిన టెక్నాలజీ ఇప్పుడు మరో మనిషిని సృష్టించబోతోంది. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) మనిషి మెదడును అనుకరించేందుకు ప్రయత్నిస్తుంటే.. దాని సాయంతో మన పంచేంద్రియాలకు ప్రత్యామ్నాయాలను సృష్టించే దిశగా పరిశోధనలు సాగుతున్నాయి. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం చేసే పనులైన చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శలను ఆస్వాదించగల కృత్రిమ పరికరాల తయారీలో శాస్త్రవేత్తలు తలమునకలు అవుతున్నారు. జ్ఞానేంద్రియాల్లోని లోపాలను సరిచేయడం, వాటి పనితీరును మెరుగుపర్చడంతోపాటు పూర్తిస్థాయిలో కృత్రిమంగానే.. మరింత సమర్థంగా రూపుదిద్దేందుకు ప్రత్యామ్నాయ పరికరాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. లక్షల మంది చూపులేని అంధులు, కోట్ల మంది దృష్టి లోపాలతో బాధ పడుతున్నవారు ప్రపంచంలో ఉన్నారు. చేతులు, కాళ్లు కోల్పోయి, కృత్రిమ అవయవాలతో కాలం గడుపుతున్న వికలాంగులూ ఉన్నారు. కరోనా బారినపడిన కోట్లాది మంది బాధితులు రుచి, వాసన జ్ఞానం కోల్పోవడం మనం గమనించాం. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి, మరింత సమర్థంగా జ్ఞానేంద్రియాలు పనిచేసేలా కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయ పరికరాలను తయారు చేసుకోవాల్సిన అవసరం మనకు ఉంది. ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలను అవలోకనం చేసుకుందాం.

కృత్రిమ మేధ ఆధారంగా కృత్రిమ జ్ఞానేంద్రియాల రూపకల్పన

- చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శను ఇచ్చే పరికరాలపై విస్తృత పరిశోధనలు
- దురదృష్టవశాత్తు వాటిని కోల్పోయిన వారికి ప్రయోజనకరంగా ఆవిష్కరణలు
- ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో అందుబాటులోకి..
- పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తల దృష్టి

● చూపు

మనిషి కళ్లు, కంటిచూపుపై చిరకాలంగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. చూపులేని, కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ సాగుతోంది. ఇలాంటి వారి కోసం 'ఆర్కామ్ మైఐ'అనే పరికరం ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ఈ పరికరాన్ని కళ్లజోడుకు అమర్చుకుంటే మాటల ద్వారా అవసరమైన సమాచారాన్ని అంధులు, కంటిచూపు సరిగా లేనివారు పొందవచ్చు. చిన్న వైర్‌లెస్ కెమెరా కలిగిఉన్న ఈ పరికరం ద్వారా మన ముందున్న ఏ వస్తువునైనా మాటల ద్వారా అభివర్ణిస్తుంది. మనం తెలుసుకోవాల్సిన వస్తువు వైపు చూస్తూ పరికరాన్ని ఆన్ చేస్తే చాలు... దానికి అమర్చి ఉన్న స్పీకర్ ద్వారా ఆ వస్తువు గురించి వివరిస్తుంది. వార్త, కథనం గురించి తెలుసుకోవాలన్నా ఈ ఆర్కమ్ మై ఐ ద్వారా చదివి వినిపించుకోవచ్చు. వినియోగ వస్తువుల బార్ కోడులను చదివి వాటి వివరాలను కూడా అందిస్తుంది. దాంతో అంధులు కూడా ఎవరి సాయం లేకుండా ధైర్యంగా షాపింగ్ చేయవచ్చు.



→ కంటిచూపు సమస్యలు ఉన్న వారికోసం జార్జియా యూనివర్సిటీ 'మిరా'అనే పరికరాన్ని రూపొందించింది. కృత్రిమ మేధతో పనిచేసే ఆ పరికరాన్ని వీపు భాగంలో తగిలించుకుంటే చాలు... అంధులు కూడా ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లవచ్చు. ఈ పరికరం నిరంతరాయంగా మన పరిసరాల గురించి వివరిస్తూ సురక్షితంగా గమ్యం చేరుస్తుంది.

→ కంటికి ప్రత్యామ్నాయంగా 'బయోనిక్ ఐ'త్వరలో అందుబాటులోకి రాబోతోంది. ప్రపంచవ్యాప్తంగా 'బయోనిక్ ఐ'పై పరిశోధనలు జరుగుతున్నాయి. 'బయోనిక్ ఐ'... ఎదుట ఉన్న దృశ్యాలను గ్రహించి, వాటిని ఎలక్ట్రిక్ సిగ్నల్స్‌గా మార్చి మెదడుకు సంకేతాలు పంపడం ద్వారా దీన్ని ధరించిన వ్యక్తికి ఆయా దృశ్యాలు ఆవిష్కృతం అయ్యేలా చేస్తుంది. సిడ్నీ వర్సిటీ ఇటీవల 'బయోనిక్ ఐ'ను గొర్రెలకు అమర్చి పరీక్షించగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని తేల్చింది. ఫీనిక్స్99గా పిలిచే ఈ పరికరాన్ని ఇక మనుషులపై పరీక్షించాల్సి ఉంది. సెకండ్ సైట్, ఆస్ట్రేలియాకే చెందిన మోనాష్ విజన్ గ్రూప్, ఫ్రాన్స్‌కు చెందిన పిక్సిమ్ గ్రూప్ లాంటి సంస్థలు కంటి రెటినాకు ప్రత్యామ్నాయంగా పనిచేసే 'బయోనిక్ ఐ'పై పరిశోధనలు చేస్తున్నాయి. భవిష్యత్తులో 'బయోనిక్ ఐ'కు 40 కోట్ల డాలర్ల మార్కెట్ ఉంటుందని అంచనా.

● వాసన

స్కాట్లాండ్‌లో నర్సుగా పనిచేసిన జాయ్ మిన్ని వాసన ద్వారా రోగికి నరాలకు సంబంధించిన పార్కిన్సన్ వ్యాధి ఉన్నదీ లేనిదీ చెబుతూ సంచలనం సృష్టించారు. పార్కిన్సన్ వ్యాధి కారణంగా శరీరం నుంచి వచ్చే వాసనల్లో తేడాను ఆమె పసిగట్టగలదు. జాయ్ మిన్ని స్ఫూర్తితో యూరప్‌కు చెందిన అనేక యూనివర్సిటీలు పరిశోధనలు నిర్వహించి పార్కిన్సన్ రోగుల నుంచి వెలువడే పది రకాల రసాయనాలను గుర్తించారు. దీని ఆధారంగా చైనాకు చెందిన జె జియాంగ్ యూనివర్సిటీ కృత్రిమ మేధను ఉపయోగించి ఒక కృత్రిమ నాసికను అభివృద్ధి చేసింది. రోగి శరీరం నుంచి వెలువడే రసాయనాల వాసనను గ్రహించి వ్యాధి లక్షణాలను చెప్పగలిగే ఈ పరికరం 70.8 శాతం కచ్చితత్వం కలిగి ఉంది. శ్వాస ఆధారంగా పని చేయగలిగిన సెన్సర్లు ఉన్న పరికరాల ద్వారా ఇప్పుడు కొన్ని రకాల కేన్సర్లను, మూత్ర పిండాల వ్యాధులు, స్లెరోసిస్ వంటి మరికొన్ని వ్యాధులను పసిగట్టే పనిలో పరిశోధకులు ఉన్నారు. బ్రెయిన్ చిప్ కంపెనీ తయారు చేసిన 'అకిడా'ప్రాసెసర్ వంద రకాల రసాయనాలను, వాసనలను పసిగట్టగలుగుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్, బ్రూవరేజ్ వంటి ఫ్యాక్టరీలలో పదార్థాల నాణ్యతను పరీక్షించడానికి ఇప్పుడు ఎలక్ట్రానిక్ నాసికలను వినియోగిస్తున్నారు. మనిషికి ప్రమాదకరమైన విషపూరిత వాయువులను పరీక్షించడానికి కూడా ఈ కృత్రిమ నాసికలు వాడకంలోకి వచ్చాయి.

● వినికిడి

దాదాపు రెండు దశాబ్దాలుగా మనం కాక్లియర్ ఇంప్లాంట్స్ ద్వారా చెవిటి వారిలో వినికిడి శక్తిని ఇనుమడించగలిగాం. చెవిలో అంతర్భాగమైన కాక్లీని అనుకరించే పరికరాన్ని మరింత అభివృద్ధి చేసి మాటలను, శబ్దాలను వేరుచేయగల ఏఐ ఆధారిత పరికరాన్ని 'ఓమ్నీ బ్రిడ్జ్'అభివృద్ధి చేసింది. ఈ పరికరం సాయంతో అవసరమైన భాషలోకి తర్జుమా చేసుకొని సంభాషణల్ని కొనసాగించగలిగే శక్తి చెవిటి వారికి ప్రసాదించింది.

→ మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), రోడ్ ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్ (ఆర్ఐఎస్‌డీ) కలసి శబ్దాలను గ్రహించి ప్రసారం చేయగల ఒక రకమైన వస్త్రాన్ని అభివృద్ధి చేశాయి. ఈ పరిశోధనా ఫలితాన్ని ఇటీవల నేచర్ పత్రికలో ప్రచురించాయి. చెవిలో కర్ణభేరిని పోలిన ఈ వస్త్రం... శబ్ద తరంగాలను ఎలక్ట్రిక్ తరంగాలుగా మార్చి మన చెవికి అమర్చిన మైక్రోఫోన్ లాంటి పరికరానికి చేరుస్తుంది. ఈ పరికరం ఆ శబ్దాలను చెవిటి వారికి యథాతథంగా వినిపించగలుగుతుంది. ఈ వస్త్రాన్ని పైదుస్తుల్లో గుండె ప్రాంతంలో అమర్చడం ద్వారా గుండె, శ్వాసకోశ పనితీరును కూడా ఎప్పటికప్పుడు గమనించవచ్చు.

● స్పర్శ

చర్మానికి ఉన్న ప్రత్యేక గుణం స్పర్శ జ్ఞానం. స్పర్శ ద్వారా వస్తువులను గ్రహించగలిగే గుణం చర్మానికి ఉంది. వికలాంగులకు అమర్చే కృత్రిమ చేతులు, కాళ్లకు స్పర్శ జ్ఞానం కూడా అందించాలనే బృహత్ సంకల్పం పరిశోధకులకు ఏర్పడింది. ఈ దిశగా జరుగుతున్న పరిశోధనలు అనేక ఆవిష్కరణలకు దారి తీస్తున్నాయి. బ్రిటన్‌లోని బ్రిస్టల్ రొబోటిక్స్ లేబొరేటరీకి చెందిన పరిశోధకులు త్రీడీ ప్రింట్‌తో రూపొందించిన కృత్రిమ చర్మాన్ని రోబోల వేళ్లకు తొడగడం ద్వారా స్పర్శ జ్ఞానాన్ని కలిగించడంలో విజయం సాధించగలిగారు. కృత్రిమ చర్మం ద్వారా వస్త్రాల నాణ్యత, మృదుత్వం, తేమ వంటి లక్షణాలను పసిగట్టవచ్చు. స్పర్శను ఆస్వాదించగలిగే కృత్రిమ చర్మం తయారీపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ముట్టుకున్నప్పుడు వచ్చే ప్రకంపనాల ఆధారంగా కృతిమ మేధతో వస్తువులను గ్రహించగలిగే ఈ–స్కిన్.. మనిషి స్పర్శజ్ఞానాన్ని అనుకరించగల ప్రత్యామ్నాయ మార్గంగా అవతరించబోతోంది. మనిషి ముట్టుకోలేని అత్యంత వేడి పదార్థాలు, అత్యంత శీతల పదార్థాలు, ప్రమాదకరమైన వస్తువులను ఈ కృత్రిమ చర్మం ద్వారా విశ్లేషించే అవకాశం ఏర్పడుతుందని పరిశోధకుల అభిప్రాయం. 'అకిడా'ప్రాసెసర్ అమర్చిన పరికరాలతో రోడ్లు, బ్రిడ్జీలను ముట్టుకొని వాటి నాణ్యతను అంచనా వేసే అవకాశం ఏర్పడుతుంది. మనిషి వెళ్లలేని సముద్రగర్భాలు, భూగర్భాల్లో ఈ కృత్రిమ చర్మంగల పరికరాలను పంపడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకొనే ఆస్కారం ఉందని ఈ రంగంలో పని చేస్తున్న పరిశోధకులు చెబుతున్నారు.

● రుచి

గుండె జబ్బులకు, రక్తపోటుకు కారణమైన అధిక ఉప్పు వాడకాన్ని తగ్గించడం కోసం జపాన్‌లో మైజీ యూనివర్సిటీ ఒక ఎలక్ట్రానిక్ చాప్‌స్టిక్‌ను తయారు చేసింది. ఈ చాప్‌స్టిక్‌తో ఆహారం తీసుకొనేటప్పుడు అది సోడియం అయాన్‌లను నోటికి అందించి కృత్రిమంగా ఉప్పు రుచిని కలిగిస్తుంది. దాంతో ఆహారంలో ఉప్పు వాడకాన్ని గణనీయంగా తగ్గించగలిగామని యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు. ఈ సూత్రాన్ని అనుసరించి మనిషి కోరిన రుచులను కృత్రిమంగా అందించగల అనేక వస్తువులు అందుబాటులోకి రాబోతున్నాయని ప్రముఖ పరిశోధకుడు నిమిషె రణసింఘె చెబుతున్నారు. వైన్ తయారీ కేంద్రాల్లో రుచిచూసి నాణ్యతను అంచనా వేసే టేస్టర్ల స్థానంలో ఇప్పుడు కృత్రిమ మేధస్సుతో పని చేసే 'ఎలక్ట్రానిక్ నాలుక'లు అంటుబాటులోకి వచ్చాయి. ఈ ఎలక్ట్రానిక్ నాలుకలో ఉండే సెన్సర్లు పదార్థంలో ఉండే రుచికి సంబంధించిన సమాచారాన్ని గ్రహించి, విశ్లేషించి ఫలితాలను వెల్లడించగలవు. పదార్థాల నాణ్యత, తాజాదనాన్ని విశ్లేషించే ఎలక్ట్రానిక్ నాలుకలను ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వాడుతున్నారు. అలాగే మనిషి నాలుకతో రుచి చూడలేని రసాయనాల కోసం ఫార్మా కంపెనీల్లో కూడా ఎలక్ట్రానిక్ నాలుకలు అందుబాటులోకి వచ్చాయి.

పంచేంద్రియాలకే కాదు... మనిషికి ఉండే సృజనాత్మక శక్తికి కూడా కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయాలు సృష్టించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే కృత్రిమ మేధ సాయంతో కవితలు, కథలు, పెయింటింగ్స్ వంటివి సృష్టించడంలో సఫలీకృతులయ్యారు పరిశోధకులు.



యాదాద్రిలో ఘనంగా రథసప్తమి

స్వర్ణ రథంపై ఊరేగిన స్వామి వారు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం స్వర్ణ రథంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. యాదాద్రి క్షేత్రంలో రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహన సేవను నిర్వహించడం ఇదే తొలిసారి. వేడుకల్లో ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, మోహనాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు అంతర్జాతీయ నెట్‌వర్క్

జీ-20 స్టార్టప్ 20 సమావేశాల్లో కేంద్రమంత్రి పీయుష్ గోయెల్ సూచన

- భాగస్వాములుగా ఔత్సాహికులు, మెంటర్లు, పెట్టుబడిదారులు
- ప్రపంచస్థాయి సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇది అవసరమని అభిప్రాయం



జీ-20 స్టార్టప్ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అమితాబ్‌కాంత్

సాక్షి, హైదరాబాద్: ఆర్థికమాంద్యం మొదలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన వరకూ ప్రపంచ స్థాయి సమస్యలను పరిష్కరించేందుకు స్టార్టప్‌లు అవసరమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖల మంత్రి పీయుష్ గోయెల్ అభిప్రాయపడ్డారు. ఔత్సాహికులు, పెట్టుబడిదారులు, మెంటర్లతో కూడిన నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లకు అన్నివిధాలుగా సాయం అందించేందుకు ప్రయత్నించాలని ఆకాంక్షించారు. భారత్ అధ్యక్షతన ఈ ఏడాది జరగనున్న జీ–20 సదస్సు సన్నాహకాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో స్టార్టప్ -20 సమావేశాలు మొదలయ్యాయి. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, జీ–20 షేర్పా(సన్నాహక దేశ ప్రతినిధి) అమితాబ్ కాంత్ పాల్గొన్న ఈ సమావేశాన్ని ఉద్దేశించి గోయెల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం ఏర్పాటు, అందరికీ అవకాశాలు, మద్దతు లభించేలా చేయడం జీ–20 దేశాల ఉమ్మడి బాధ్యత అని అన్నారు. స్టార్టప్‌ల ఏర్పాటుకు అంతర్జాతీయ నెట్‌వర్క్ స్ఫూర్తినిచ్చేదిగా ఉండటమే కాకుండా, ఆలోచనలు, మేలైన కార్యాచరణ పద్ధతులను పంచుకునేలా ఉండాలని, అవసరమైన నిధులకు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశాల్లో పరస్పర సహకారానికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. ''ఈ రోజుల్లో సృజనాత్మకత అనేది ఆర్థిక లక్ష్యాల సాధనకు మాత్రమే ఉపయోగపడటంలేదు. సామాజిక, పర్యావరణ, సుస్థిరాభివృద్ధి సమస్యల పరిష్కారానికీ అవసరమవుతోంది''అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2016లోనే స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని మొదలుపెట్టగా ఈ ఏడేళ్లలో కొత్త, వినూత్న ఆలోచనలతో వివిధ రంగాల్లో పలు కంపెనీలు పుట్టుకొచ్చాయని గుర్తుచేశారు. ఫిన్‌టెక్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్, ఆరోగ్య రంగాల్లోని స్టార్టప్ కంపెనీల కారణంగానే కరోనా మహమ్మారిని ఎదుర్కోగలిగామన్నారు. ఆన్‌లైన్ విద్యా బోధన, వ్యవసాయ టెక్నాలజీల్లోనూ సవాళ్లను స్టార్టప్‌లతో ఎదుర్కోగలిగామని వివ రించారు. భారతదేశంలో ఆవిర్భవించిన కోవిన్, యూపీఐ వంటి టెక్నాలజీలు, ఈ–కామర్స్ కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ నెట్‌వర్క్ (ఓఎన్‌డీసీ)లు ప్రపంచంలోని అనేక దేశాల సమస్యలను పరిష్కరించగలవని, అందుకే జీ–20 సదస్సు ద్వారా ఈ 'ఇండియా స్టాక్'ను ప్రపంచానికి ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని గోయెల్ తెలిపారు.

అనుకూల విధానాలతోనే వృద్ధి: కిషన్ రెడ్డి

స్టార్టప్‌లకు అనుకూల విధానాలను రూపొందించి అమలు చేస్తున్న కారణంగానే భారత్ అతితక్కువ కాలంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా రూపాంతరం చెందిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్'లను కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఏడేళ్లలోనే భారత్ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 41 స్థానాలు పైకి ఎగబాకిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో స్టార్టప్–20 ఇండియా చైర్‌పర్సన్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు.





శనివారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.నవీన్ రావు, జస్టిస్ ఈవీ వేణుగోపాల్

ఫ్లోరోసిస్ విముక్తి పోరాట యోధుడి కన్నుమూత

ఫ్లోరైడ్ సమస్యపై అలుపెరుగని పోరాటం

- ఐదుగురు ప్రధానులకు విజ్ఞప్తులు, 17సార్లు జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు
- జల సాధన సమితి, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి ఆధ్వర్యంలో సుదీర్ఘ ఉద్యమం
- సీఎం, మంత్రులు, ప్రముఖుల సంతాపం



మునుగోడు ఉప ఎన్నిక సమయంలో శివన్నగూడెంలోని అంశాల స్వామి ఇంటికి వెళ్లి ఆయనకు అన్నం వడ్డిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/మర్రిగూడ: ఫ్లోరోసిస్ విముక్తి పోరాట యోధుడు అంశాల స్వామి (37) కన్నుమూశారు. శుక్రవారం సాయంత్రం ఎలక్ట్రిక్ (3 చక్రాల) సైకిల్‌పై తండ్రితో కలసి ఊరికి వెళ్లి వచ్చి ఇంటి ముందు ర్యాంప్ ఎక్కే క్రమంలో ఆయన కింద పడిపోయారు. శనివారం ఉదయం రక్తపు వాంతులతో స్వామి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రక్తపు వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆర్ఎంపీ వైద్యుడిని పిలిపించగా, స్వామిని పరీక్షించిన ఆయన వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108కు కాల్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి స్వామిని పరీక్షించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు తెలిపారు. ట్రైకిల్ పై నుంచి పడినప్పుడు స్వామి తలలో అంతర్గతంగా గాయాలైనట్లు భావిస్తున్నారు. స్వామి మృతిచెందడంతో ఆయన స్వగ్రామం మర్రిగూడ మండలంలోని శివన్నగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్య ప్రస్తావన రాగానే వెంటనే అంశాల స్వామి గుర్తుకు వస్తారు. దీనితోనే ఫ్లోరైడ్ సమస్యపై జిల్లాలో ఉద్యమం జరిగిన తీరు, అందులో స్వామి పాత్ర ఎంత కీలకమన్నది అర్థం చేసుకోవచ్చు. ఫ్లోరోసిస్ బాధితుల తరఫున ఆయన ఢిల్లీలో తన గళం వినిపించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ ఫ్లోరోసిస్ సమస్య కూడా ఒక ప్రధాన అంశంగా మారింది. అందులో అంశాల స్వామి కీలక భూమిక పోషించారు. అనేక ఏళ్లపాటు ఫ్లోరోసిస్ విముక్తి పోరాటంలో భాగస్వామి అయ్యారు. అంశాల స్వామి గర్భస్థ ఫ్లోరైడ్ బాధితుడు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన అంశాల వెంకటమ్మ, సత్యనారాయణకు నలుగురు సంతానం. అందులో పెద్దవాడైన స్వామికి 37 ఏళ్లు. ముగ్గురు చెల్లెళ్లలో ఒకరు అనారోగ్యంతో మరణిస్తే, మరొకరు ఫ్లోరోసిస్‌తోనే మృతి చెందారు. కాగా, శనివారం సాయంత్రం స్వామి అంత్యక్రియలను నిర్వహించారు.

ప్రతిపోరాటంలో ముందున్న స్వామి

నదీ జలాల ద్వారానే ఫ్లోరైడ్ సమస్య పీడ విరగడవుతుందన్న భావనతో ఏర్పాటైన జల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రతి పోరాటంలోనూ స్వామి కీలక పాత్ర పోషించారు. నాటి ప్రధానమంత్రులు వాజ్‌పేయి, పీవీ నరసింహారావు, ఐకే గుజ్రాల్, దేవెగౌడ, చంద్రశేఖర్‌ను కలిశారు. పలువురు ముఖ్యమంత్రులను కలసి ఫ్లోరైడ్ సమస్యను వివరించారు. 17 సార్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు చేశారు. ఐక్యరాజ్యసమితి వరకు ఫ్లోరైడ్ సమస్యను తీసుకెళ్లగలిగారు. తెలంగాణ ఉద్యమంలో అప్పటి టీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్న సీఎం కేసీఆర్‌ను కలసి ఫ్లోరోసిస్ సమస్యకు కృష్ణా జలాలతోనే పరిష్కారం లభిస్తుందని వివరించారు.

ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ఎన్నికల్లో పోటీ

ఫ్లోరైడ్ సమస్యను పాలకుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు అంశాల స్వామి ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. అప్పట్లో నాంపల్లి మండల జెడ్పీటీసీగా పోటీ చేశారు. వారణాసిలో ఎంపీగా పోటీ చేసి సమస్యను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ప్రత్యేక కార్పొరేషన్ కావాలని..

ఫ్లోరోసిస్ బాధితులు మంచానికే పరిమితమై కుటుంబానికి భారమవుతున్నందున ఆ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఫ్లోరైడ్ వికలాంగులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని స్వామి అడుగుతుండేవారు. కాగా, శివన్నగూడెం ప్రాజెక్టుకు అంశాల స్వామి పేరు పెట్టాలని జల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి అధ్యక్షుడు కంచుకట్ల సుభాష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బ్యాటరీ ట్రైసైకిల్‌లో డిజైన్ లోపం వల్లనే అంశాల స్వామి ప్రమాదానికి గురై మృతి చెందాడని వారు ఆరోపించారు. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వామికి ఓ సంస్థ ఈ ట్రైసైకిల్‌ను ఇచ్చిందని వారు తెలిపారు. స్వామి మృతిపై మంత్రి జగదీశ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు వివిధ సంఘాలు, పార్టీల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

స్వామి వంటి వారి ప్రేరణతోనే మిషన్ భగీరథ

స్వామి మృతి పట్ల సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫ్లోరోసిస్ నిర్మూలనకు తన జీవిత కాలం పోరాడిన అంశాల స్వామి మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సామాజిక సమస్యగా మారిన ఫ్లోరోసిస్ ప్రస్తావన రాగానే తక్షణమే గుర్తుకు వచ్చే పేరు అంశాల స్వామి.. అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అంశాల స్వామి చేసిన పోరాటం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే దృఢ సంకల్పానికి ఫ్లోరోసిస్ బాధితులైన అంశాల స్వామి వంటి వారే ప్రేరణగా నిలిచారని తెలిపారు. స్వామి మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మంత్రి కేటీఆర్ సంతాపం

అంశాల స్వామి మృతి పట్ల మంత్రి కె.తారక రామారావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఫ్లోరోసిస్ సమస్యపై పోరాడిన స్వామి, ఎందరికో స్ఫూర్తి కలిగించారని ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా అంశాల స్వామితో కలసి ఆయన ఇంట్లో భోజనం చేస్తున్న ఫోటోను కేటీఆర్ తన ట్వీట్‌తో జత చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 29-1-2023

రికార్డ్

రంగోలి రవితేజం



సుధారవి, రక్షిత

స్కూల్లో ఇంకో రెండు రోజుల్లో ఫంక్షన్ జరగబోతోంది... 'సుధా రవికి చెప్పారా?' అనే ప్రశ్న చెవులకు వినిపిస్తుంది. మూడురోజుల్లో పెళ్లి జరగబోతుంది... 'సుధా రవికి తెలియజేశారా' అనే ప్రశ్న ఎదురు వస్తుంది. ఇంతకీ ఎవరీ సుధా రవి? ఒక్కమాటలో చెప్పాలంటే 'రంగోలి స్పెషలిస్ట్' ఎవరి రంగోలి ద్వారా శుభకార్యాల వేదికలకు కొత్తకళ వస్తుందో...ఆమె పేరే సుధా రవి. తాజాగా కూతురు రక్షితతో కలిసి రూపొందించిన రంగోలితో సింగపూర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయిందామె...

సుధా రవి తన కూతురు రక్షితతో కలిసి 26,000 ఐస్‌క్రీమ్ పుల్లలను ఉపయోగించి రూపొందించిన రంగోలి ఆర్ట్ వర్క్ 'సింగపూర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' లోకి ఎంటర్ అయింది. సింగపూర్‌లోని లిటిల్ ఇండియా షాప్‌కీపర్స్ అండ్ హెరిటేజ్ అసోసియేషన్(లిషా) ఆధ్వర్యంలో జరిగిన పొంగల్ వేడుకల్లో భాగంగా ఈ సిక్స్ బై సిక్స్ మీటర్ ఆర్ట్ వర్క్‌కు శ్రీకారం చుట్టింది సుధా రవి.


మామూలుగానైతే బియ్యంగింజలు, సుద్దముక్కలు... మొదలైనవి ఉపయోగించి రంగోలి వేసే సుధా ఈసారి మాత్రం ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను మాత్రమే ఉపయోగించింది. ఈ రంగోలిలో తమిళ కవులు తిరువళ్లువర్, అవ్వైయార్, భారతీయార్ చిత్రాలు ఆకట్టుకుంటాయి.

ఆశ్చర్యంగొలిపే అందమైన ఆర్ట్‌వర్క్‌లను రూపొందించడం రవికి కొత్తేమీ కాదు.

2016లో 3,200 చదరపు అడుగుల రంగోలీని రూపొందించి రికార్డ్ సృష్టించింది.

'సింగపూర్‌లో తమిళ సంప్రదాయాలు, కళలను ముందుకు తీసుకువెళ్లడానికి, ఈతరానికి చేరువ చేయడానికి సుధా రవి పనిచేస్తున్నారు' అంటున్నారు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు.

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేస్తున్న సుధా రవి 'రంగోలి స్పెషలిస్ట్'గా పేరు తెచ్చుకుంది. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న రంగోలి కళకు మరింత ప్రాచుర్యాన్ని కల్పించడానికి తన వంతుగా ప్రయత్నిస్తోంది.



భూమిని ప్రేమగా ముద్దాడే రంగోలిని కాన్వాస్‌పైకి కూడా తీసుకువచ్చి కనువిందు చేయడంలో సుధా రవి విజయం సాధించింది.

'అందరు పిల్లల్లాగే నాకు చిన్నప్పటి నుంచి రంగులు అంటే చాలా ఇష్టం. వాటిని చూస్తే చాలు ఎంతో సంతోషం కలిగేది. ఆ సంతోషమే నన్ను రంగోలి కళ వైపు నడిపించింది. రకరకాల ప్రయోగాలు చేసేలా చేసింది. ఎమోషన్స్ విత్ కలర్స్ కాన్సెప్ట్‌తో కూడా రంగోలి రూపొందించాను. సింగపూర్‌లో దశాబ్ద కాలంగా ఉంటున్నాము. మా జీవితంలో రంగోలి భాగం అయింది. నాలాగే నా కూతురు రక్షితకు రంగోలిపై ఆసక్తి ఉండడం సంతోషకరమైన విషయం' అంటుంది సుధా రవి.

భూమిని ప్రేమగా ముద్దాడే రంగోలిని కాన్వాస్ పైకి కూడా తీసుకువచ్చి కనువిందు చేయడంలో సుధా రవి విజయం సాధించింది.

ఇంటిప్స్



బట్టల మీద పడిన కూర, కాఫీ, టీ మరకలు పోవాలంటే..

- పసుపుపడిన వస్త్రాన్ని ముందు నీటితో కడిగి, తరువాత బేకింగ్ సోడా, బట్టల సబ్బుతో రుద్దాలి. ఇలా చేస్తే పసుపు రంగు కనిపించదు.
- కాఫీ టీ మరకలు పడిన వస్త్రాన్ని సోడా, సర్ఫ్ వేసి ఒక గంటపాటు నానపెట్టి తరువాత బ్రష్‌తో రుద్దితే మరకలు పోతాయి.
- ఆయిల్ పడిన బట్టలను వెనిగర్, బేకింగ్ సోడా, టాల్కం పౌడర్ వేసి అరగంటపాటు నానపెట్టి తరువాత బ్రష్‌తో రుద్దితే ఆయిల్ మచ్చలు మాయమవుతాయి.

బ్యూటిప్స్

గులాబి రేకులాంటి అధరాల కోసం!














- ఆర్గానిక్ తేనె, కొబ్బరి నూనె, చక్కెర.. ఒక్కోటీ టేబుల్ స్పూను చొప్పున తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులపై రాసి ఐదు నిమిషాలపాటు మర్దన చేసి నీటితో కడగాలి.
- కాఫీ పొడి, తేనెలను టేబుల్ స్పూన్ చొప్పున తీసుకుని పేస్టులా కలుపుకోవాలి.ఈ పేస్టును పెదవులకు రాసుకుని రెండు నిమిషాలు మర్దనా చేసి నీటితో కడిగేయాలి.
- గుప్పెడు గులాబిరేకులు, అర కప్పు పాలను మిక్సీజార్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి ఆరిన తరువాత నీటితో శుభ్రపరుచుకోవాలి.
- ఆలివ్ ఆయిల్, ఆరెంజ్ జ్యూస్, బీట్‌రూట్ రసం.. వీటిలో ఏదో ఒకటి రోజూ పెదాలకు రాసి మర్దనా చేసి తరువాత గోరు వెచ్చని నీటితో కడగాలి.

వీటిలో ఏఒక్కటి పాటించినా గులాబి రేకులాంటి పింక్ రంగు పెదాలు మీ సొంతమవుతాయి.



హ్యాపీ జర్నీ







సంక్రాంతి సెలవులు పూర్తయ్యాయి. స్కూళ్లు తిరిగి మొదలయ్యాయి. వేసవి సెలవుల కోసం ఎదురు చూపులూ మొదలయ్యాయి. పరీక్షలు పూర్తవడమే తరువాయి, ఓ వారమైనా ఎటైనా వెళ్లి వస్తే తప్ప మనసు రీచార్జ్ కాదు. కొత్త ఏడాదికి సిద్ధం కాదు. ఇదిలా ఉంటే కరోనా వచ్చింది, వెళ్లింది, మళ్లీ వచ్చింది, వెళ్లింది. వేవ్‌ల నంబరు పెరుగుతోంది. మరో వేవ్‌కి సిద్ధంగా ఉండమనే సూచనలు షురూ అవుతున్నాయి. ఇలాంటప్పుడు 'క్షేమంగా వెళ్లి, సంతోషంగా రావాలి' అంటే ఏం చేయాలి? దేశవిదేశాల్లో విస్తృతంగా పర్యటించిన హైదరాబాద్, సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్ నీలిమ... కరోనా జాగ్రత్తల గురించి సాక్షితో పంచుకున్న వివరాలివి.

వర్క్ ఫ్రమ్ వెకేషన్!

''కరోనా నా ట్రావెల్ లైఫ్‌ను పెద్ద మలుపు తిప్పింది. నేను 2015 నుంచి కరోనా లాక్‌డౌన్ వరకు 60 దేశాల్లో పర్యటించాను. ఇండియా టూర్ వార్ధక్యం వచ్చిన తర్వాత అనుకునేదాన్ని. లాంగ్ వీకెండ్ వస్తే ఏదో ఒక దేశానికి వెళ్లిపోయేదాన్ని. కరోనాతో విదేశాలకు విమాన సర్వీసులు నిలిపి వేయడంతో మనదేశంలో పర్యటించడం మొదలుపెట్టాను. ఈశాన్య రాష్ట్రాలు, రాజస్థాన్ మినహా ఇండియాని దాదాపుగా చూసేశాను. ఈ సంక్రాంతికి కూడా ఓ వారం అనుకుని వెళ్లిన పాండిచ్చేరి వెకేషన్‌ని నెలకు పొడిగించుకున్నాను. వర్క్ ఫ్రమ్ హోమ్‌ని వర్క్ ఫ్రమ్ వెకేషన్‌గా మార్చుకున్నాను. నేను చూసినంత వరకు జనంలో కరోనా భయం దాదాపుగా పోయిందనే చెప్పాలి. దేశంలో 99 శాతం వ్యాక్సిన్ వేయించుకున్నారు. కో మార్బిడ్ కండిషన్ ఉన్న వాళ్లు డాక్టర్ సలహా తీసుకుని బూస్టర్ డోస్ కూడా వేయించుకున్న తర్వాత మాత్రమే టూర్‌లు ప్లాన్ చేసుకోవడం మంచిది. ఈ సమస్యలు లేని వాళ్లయితే ఏ మాత్రం సందేహం లేకుండా పర్యటనలు చేస్తున్నారు. అనేక పర్యాటక ప్రదేశాల్లో మాస్క్ లేకపోతే ప్రవేశం లేదనే బోర్డులున్నాయి, కానీ మాస్క్ నిబంధన మీద పట్టింపుగా కనిపించలేదు. అలాగని నిర్లక్ష్యం చేయకుండా రద్దీ ఉన్న చోట్ల తప్పనిసరిగా మాస్క్ ధరించాల్సిందే.

కేర్‌ఫుల్‌గా వెళ్లిరండి!

కరోనా జాగ్రత్తలు పాటిస్తూ చేతులను తరచు శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటూ, ఆహారపానీయాల పరిశుభ్రత పాటిస్తూ హాయిగా పర్యటించవచ్చనేది నా అభిప్రాయం. అయితే పర్యాటక ప్రదేశాల్లో షాపింగ్ కోసం మార్కెట్‌లలో ఎక్కువ సేపు గడపకపోవడమే శ్రేయస్కరం. నేను గమనించిన ఆసక్తికరమైన సంగతి ఏమిటంటే... కాశీ అనగానే అది అరవై దాటిన తర్వాత వెళ్లే ప్రదేశం అనుకునే దాన్ని, ఇటీవల అది యూత్ ట్రావెల్ డెస్టినేషన్ అయింది. అక్కడ డిఫరెంట్ వైబ్స్ ఉన్నాయి.

– పానుగోటి నీలిమారెడ్డి, ట్రావెలర్


ప్రకృతి పిలుస్తోంది!

కరోనా భయం ఓ పక్క వెంటాడుతూనే ఉంది, కాబట్టి పర్యటనలకు ప్రకృతి ఒడినే ట్రావెల్ డెస్టినేషన్‌గా మార్చుకోవడం మంచిది. జలపాతాలు, సముద్ర తీరాలు, నదీతీరాలు, ట్రెకింగ్, స్కీయింగ్ జోన్‌లను ఎంచుకోవాలి. ఈ ప్రదేశాల్లో మనుషుల రద్దీ తక్కువగా ఉంటుంది. మాస్కు లేకుండా హాయిగా విహరించగలిగిన ప్రదేశాలివి. హిమాలయాల్లో ట్రెకింగ్‌కి మంచి లొకేషన్‌లున్నాయి. స్పితి వ్యాలీ, త్రియుండ్ కుండ్, కీర్‌గంగ, రూప్‌కుండ్, బ్రిబ్లింగ్, థషర్ మషర్ ట్రెక్, బ్రమ్‌తాల్, పిన్ పార్వతి, హమ్‌తా పాస్ ట్రెక్‌లను దాదాపుగా అందరూ చేయవచ్చు. యూత్‌కి హిమాలయాల్లో పన్నెండు రోజులపాటు సాగే సర్‌పాస్ ట్రెక్ మంచి థ్రిల్‌నిస్తుంది. నేను కశ్మీర్-గుల్‌మార్గ్, ఉత్తరాఖండ్-ఔలిలలో ఐస్‌స్కీయింగ్, ఆరోవిల్లెలో సర్ఫింగ్ కరోనా విరామాల్లోనే చేశాను. చార్‌ధామ్ యాత్రలో నాకు ఎలాంటి అసౌకర్యం కలగలేదు, కానీ యాత్ర ముగించుకుని ఫ్లయిట్ ఎక్కిన తర్వాత భయం వేసింది. ఆ టూర్ అంతటిలో తుమ్ములు, దగ్గులు వినిపించింది ఫ్లయిట్‌లోనే.

శాంతియాత్ర

లాక్‌డౌన్ విరమించిన తర్వాత నా ట్రావెల్ లిస్ట్‌లో ఈజిప్ట్, టర్కీ దేశాలు చేరాయి. పాండిచ్చేరి బీచ్‌లో సర్ఫింగ్, ఆరోవిల్లెలో మెడిటేషన్ నాకు అత్యంత సంతోషాన్నిచ్చాయి. జీవితంలో శాంతికంటే మరేదీ ముఖ్యంకాదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అందుకే అరోవిల్లెకి మరో లాంగ్ వెకేషన్ ప్లాన్ చేస్తున్నాను. ఆ తర్వాత యూఎస్‌కి వెళ్లి నా వందదేశాల టార్గెట్‌ని పూర్తి చేయాలనేది కోరిక'' అని చెప్పారు గమనంలోనే గమ్యాన్ని వెతుక్కుంటున్న నీలిమ. వర్క్ చేస్తూ వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారామె. ఇలాంటి పర్యాటక ప్రియుల వల్లనే 'వర్కేషన్' అనే పదం పుట్టింది.

– వాకా మంజులారెడ్డి



కంటి చూపుకు రెటీనా తెర ఆరోగ్యంగా ఉండటం ఎంత అవసరమో తెలిసిందే. వయసు పెరగడంతో వచ్చే కొన్ని కంటి సమస్యలతో రెటీనా దెబ్బతిని చాలామంది కనుచూపు కోల్పోవడం పరిపాటి. అయితే చాలా తొందర్లోనే మానవులకు 'ల్యాబ్'లో నిర్మించిన రెటీనా సాకారం కానుందా? దాన్ని మనుషుల్లో ప్రయోగించి చూశాక... అది విజయవంతమైతే... త్వరలోనే చూపు లేని ఎంతో మందికి చూడటం సాధ్యపడనుందా? అవుననే అంటున్నారు యూఎస్‌ఏలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్‌సిన్-మేడిసన్‌కు చెందిన పరిశోధకులు. ఆ వివరాలేమిటో చూద్దాం.

మానవ నిర్మిత రెటీనా త్వరలోనే సాధ్యం కానుందా?!



కాంతి వల్ల కంటి వెనక ఉండే పలుచని పొర అయిన 'రెటీనా' వల్లనే దృష్టిజ్ఞానం కలుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రమాదాల్లో రెటీనా ఊడిపోవడం, వయసు పెరుగుతున్న కొద్దీ కంటి జబ్బుల కారణంగా రెటీనా బలహీనపడి చూపు మందగించడం... ఇలాంటి కారణాలతో చాలా మంది అంధత్వానికి లోనవుతున్నారు. వీళ్లందరికీ దృష్టిజ్ఞానం ఇవ్వడం కోసం చాలా పరిశోధనలే చోటు చేసుకుంటున్నాయి. అందునా పరిశోధనశాల (ల్యాబ్)లో రెటీనాను రూపొందించడానికీ అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొందరు శాస్త్రవేత్తలు 'ఆర్గనాయిడ్స్' అనే తరహా కణాలను 2014లోనే రూపొందించారు. ఇవి అచ్చం రెటీనా పనే చేస్తాయి. అంటే తమపై '3-డి' ఇమేజ్‌ను ప్రతిబింబించేలా చేయగల కణాల సమూహాలివి. మనిషి చర్మం నుంచి 'మూలకణాల్లా'ంటి (స్టెమ్‌సెల్స్‌లాంటి) వాటిని సేకరించడంతో ఈ ప్రయత్నం సాకారమైంది. అటు తర్వాత మరో అడుగు ముందుకేసి రకరకాల రెటీనాలను రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తల బృందాలే.. ల్యాబ్‌లో రూపొందించిన రెటీనా కణాలు వివిధ వేవ్‌లెంత్ గల కాంతి కిరణాలకు స్పందిస్తున్నాయనీ, అవి పొరుగున ఉన్న ఇతర కణాలతోనూ అనుసంధానమవుతున్నాయంటూ గతేడాది (2022)లో నిరూపించగలిగారు.

''మేము ఆర్గనాయిడ్స్ నుంచి కొన్ని కణాలను సేకరించి, వాటిని రకరకాల జబ్బుల కారణంగా దెబ్బతిన్న రెటీనాలోని మృతకణాల స్థానంలో అమర్చాడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం ఇదే మాముందున్న సవాలు'' అంటున్నారు ఈ పరిశోధనకు నేతృత్వం వహిస్తున్న ఆఫ్తాల్మాలజిస్టు డాక్టర్ డేవిడ్ గామ్.

తమ ముందున్న ప్రతిబింబాన్ని తీసుకున్న ఆ కణాలు యాగ్జాన్స్ అనే పురికొసలాంటి కణాల ద్వారా... వెనక ఉన్న 'సైనాప్స్' అనే ఓ సిగ్నల్ బాక్స్ లాంటి దాన్నుంచి వెలువడాలి. ఆ సమాచారాన్ని ఎట్టకేలకు మెదడుకు చేరవేయాలి. కణాల్లోంచి వేరు చేసి అమర్చాక కూడా అవి రెటీనా నుంచి బయల్దేరి యాగ్జాన్స్ ద్వారా మెదడు కేంద్రం వరకు చక్కగా అనుసంధానితమవుతూనే (రి-కనెక్ట్ అవుతూనే) ఉండాలి. ఈ మధ్యలో ఎక్కడా సిగ్నల్స్‌ను కోల్పోకూడదు. అప్పుడే 'చూడటం' అనే ప్రక్రియ (విజన్ ప్రాసెస్) పూర్తవుతుంది.

శాస్త్రవేత్తలు ఇక్కడో విచిత్రాన్ని చేసి చూశారు. ఎక్కడా సిగ్నల్స్ కోల్పోని విధంగా అంతటా అనుసంధానం చక్కగా జరుగుతోందా, లేదా అనే విషయాన్ని పరిశీలించడం కోసం ఈ రెటీనా కణాలకు కావాలనే 'రేబీస్ వైరస్'ను అంటించారు. ఇది న్యూరోవైరస్ కావడం వల్ల దీన్ని ఎంచుకుని, వారం రోజుల వ్యవధిలో ఈ వైరస్ చివరి కణం వరకూ చేరిందంటే అన్ని కణాలూ చక్కగా అంటుకుని, అనుసంధానితమై ఉన్నాయని అర్థం.

''ల్యాబ్‌లో కొనసాగిన ఈ ఫలితాలన్నీ పరిశోధనశాల వరకైతే చక్కగానే ఉన్నాయి. ఇక చివరి టాస్క్ ఏదైనా ఉందంటే... అది మానవులపై పరిశోధనలు (హ్యూమన్ ట్రయల్స్) సాగించడమే. ఈ కణాల అమరిక బాగా జరిగి అవి రెటినాలోని కణాలుగా మనగలుగుతూ, రెటినల్ గ్యాంగ్లియాన్ సైనాప్సెస్ అమరికతో మనకు దృష్టిజ్ఞానాన్నిచ్చే 'ఆప్టిక్ నర్వ్'తో చక్కగా అనుసంధానమైతే చాలు! అదే జరిగితే రెటినైటిస్ పిగ్మెంటోజా, ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్, గ్లకోమా వంటి అనేక జబ్బుల కారణంగా చూపుకోల్పోయిన / చూపు మందగించిన వారికి చూపును ఇవ్వగలిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి'' అంటూ ఎంతోమందిలో ఓ ఆశాభావాన్ని రేకెత్తించే చల్లటి కబురు చెబుతున్నారు ఆఫ్తాల్మాలజిస్ట్ డాక్టర్ డేవిడ్ గామ్.

ఈ అధ్యయన ఫలితాలన్నీ 'పీఎన్ఏఎస్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

హెల్త్

చిన్నపిల్లల్లోనూ జుట్టురాలుతోందా?



చిన్నపిల్లల్లో అంటే ఐదేళ్లు మొదలుకొని... ఎనిమిది, తొమ్మిదేళ్ల పిల్లల్లో జుట్టు రాలిపోవడం కాస్తంత తక్కువే అయినా మరీ అంత అరుదేమీ కాదు. నిజానికి ఆ వయసులో క్రమంగా జుట్టు దట్టమమవుతూ ఉంటుంది. అలాంటి వయసులోనూ పిల్లల్లో జుట్టు రాలుతుండటానికి కారణాలు, వాటి నివారణ మార్గాలు తెలిపే కథనమిది.

జుట్టు రాలడం అనే కండిషన్‌ను వైద్యపరిభాషలో 'టీలోజెన్ ఎఫ్లువియమ్' అంటారు. పిల్లల్లో ఇలా జుట్టు రాలడం అనేది నిర్దిష్టంగా ఒక భాగంలో (లోకల్‌గా) జరగవచ్చు దీన్ని 'అలోపేషియా ఏరేటా' అంటారు. నిజానికి వెంట్రుకలు పాటించే సైకిల్ కారణంగా జుట్టులో కాస్త భాగం నిద్రాణంలోకి వెళ్లడం, మరికొంత రాలిపోవడం రోజూ సాధారణంగా జరిగే ప్రక్రియే. ఇలా పిల్లల్లో రోజూ 30 నుంచి 40 వరకు వెంట్రుకలు రాలిపోతూ ఉంటే... దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ అంతకు మించి అంటే 80 – 100 వరకు వెంట్రుకలు రాలుతుంటే మాత్రం దాన్ని కాస్త సీరియస్‌గా జుట్టురాలడం (ఎగ్నిఫికెంట్ హెయిర్ లాస్)లాగే పరిగణించాలి.

సాధారణ కారణాలు : అన్నిటికంటే పిల్లల్లో జుట్టు రాలడానికి ప్రధాన కారణం పోష్టిక ఆహార (ప్రోటీన్ మాల్ న్యూట్రిషన్, ఐరన్, జింక్‌తో పాటు ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్) లోపాల వల్ల కావచ్చు. ఇదే కారణమైతే పిల్లలకు ఐరన్, జింక్, ప్రోటీన్లు పుష్కలంగా ఉండే మంచి సమతులాహారంతో పరిస్థితి చక్కబడుతుంది. అలా కాకుండా కొన్ని మెకానికల్ సమస్యల (అంటే... జడలు బిగుతుగా వేయడం, బిగుతైన క్లిప్పులు పెట్టడం)వంటి కారణాలతోనూ జుట్టు రాలవచ్చు. ఆ వయసు పిల్లల్లో మరీ బిగుతుగా కాకుండా కాస్త తేలిగ్గా ఉండేలా జడలల్లడం వల్ల ఈ సమస్యని చాలా తేలిగ్గా నివారించవచ్చు.

కొంతమంది పిల్లల్లో జ్వరాలు (డెంగీ, మలేరియా, కోవిడ్ వంటివి) వచ్చి తగ్గాక కూడా మూడు నుంచి నాలుగు నెలల తర్వాత జుట్టు రాలడం కూడా జరగవచ్చు. దీన్ని పోస్ట్ వైరల్ ఫీవర్ ఎఫెక్ట్‌గా పరిగణించాలి.

కొన్ని నిర్దిష్ట కారణాలు : పైన పేర్కొన్న సాధారణ కారణాలు మినహాయిస్తే... చిన్న వయసు పిల్లల్లో జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉంటాయి. ఉదాహరణకు పుట్టుకతోనే వచ్చే కారణాలు (కంజెనిటల్ కాజెస్), ఇన్ఫెక్షన్లు (అంటే... కొన్ని రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, పయోడెర్మా లాంటివి), తలలో పేలు పడటం, ఇతర అనారోగ్యాల కారణంగా మందులు వాడుతున్నప్పుడు అవి వారికి సరిపడక కూడా జుట్టు రాలిపోవచ్చు.

ఇక మరికొందరు పిల్లల్లో హార్మోన్ల అసమతౌల్యత (హైపోథైరాయిడ్, పారాథైరాయిడ్, చైల్డ్ డయాబెటిస్) లాంటి సమస్య వల్ల కూడా జుట్టు రాలవచ్చు. వీటిని పక్కన పెడితే పిల్లలు కూడా కొన్ని సందర్భాల్లో ఒత్తిడికి గురవుతారు. ఇలా పిల్లల్లో మానసిక ఒత్తిడి వల్ల కూడా జుట్టు రాలిపోవచ్చు.

మంచి పోష్టికాహారం ఇవ్వడం, పిల్లలు బాగా ఆడుకునేలా చూస్తూ... మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండేలా చేయడం వంటి సాధారణ చర్యలతోనూ సమస్య చక్కబడకపోతే, అప్పుడు డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

అత్యంత ఈజీగా అల్జైమర్స్ నివారణ!

వృద్ధాప్యంలో తామెవరో తమకే తెలియకుండా పోవడం... తమ సొంతవాళ్లను మాత్రమే కాదు... సొంత ఇంటినీ మరచిపోవడం ఎంత దురదృష్టకరం. అయితే ముందునుంచీ జాగ్రత్తపడితే అలాంటి దురవస్థ రాకుండా కాపాడుకోవడం అంత కష్టం కాదు. చాలా ఈజీగా అనుసరించదగిన ఈ కింది సూచనలు పాటిస్తే చాలు...



- బ్లడ్‌ప్రెషర్‌ను తరచూ చెక్ చేయించుకోవడం మంచిది. ఎందుకంటే సుదీర్ఘకాలం పాటు రక్తపోటు ఎక్కువగా ఉండటం అన్న అంశం మతిమరపు(డిమెన్షియా)ను పెంచుతుంది. అది పరోక్షంగా అల్జైమర్స్‌కూ దారితీయవచ్చు. అందుకే నిత్యం మన బీపీని అదుపులో ఉంచుకోవడం మేలు.
- బ్లడ్ ప్రెషర్ నియంత్రణతో పాటు అల్జైమర్స్ నివారణకూ ఆహారంలో ఉప్పు తగ్గించడం చాలా ఉపకరిస్తుంది.
- కండరాల కదలికలు చురుగ్గా ఉన్న వారితో పోలిస్తే... మందకొడి కదలికలు ఉన్న వారిలో అల్జైమర్స్ వచ్చే అవకాశాలు 60 శాతం వరకు ఎక్కువగా ఉంటాయని ఓ అధ్యయనంలో తెలిసింది. రోజూ 30 – 45 నిమిషాల పాటు నడక అల్జైమర్స్‌నే కాదు... ఆరోగ్యానికి అన్ని రకాలుగా మంచి చేస్తుంది. అందుకే ఇమ్యూనిటీని పెంచి ఎన్నో వ్యాధుల నివారణలతో పాటు పూర్తి ఆరోగ్యానికి దోహదం చేసే నడకను రోజూ కొనసాగించడం చాలా మంచిది.
- వ్యాయామం శరీరానికి మాత్రమే కాదు... మనసుకు కల్పించడం కూడా అల్జైమర్స్ నివారణకు తోడ్పడుతుంది. అందుకే రోజూ పత్రికల్లో లేదా సోషల్ మీడియాలో కనిపించే పజిల్స్, సుడోకూ, గళ్లనుడికట్టు వంటి మెదడుకు మేత కల్పించే అంశాలు ప్రాక్టీస్ చేస్తుండటం మేలు.
- సృజనాత్మకంగా ఆలోచించేవారికి అల్జైమర్స్ అవకాశం కాస్త తక్కువ. అందుకే మంచి ఊహాకల్పనలతో సృజనాత్మకంగా ఆలోచిస్తూ ఉండటం... ఆహ్లాదంగా, ఆనందంగా ఉంచడంతో పాటు అల్జైమర్స్‌నూ నివారిస్తుంది. అందుకే ఇష్టమైన, అభిరుచి ఉన్న కళలను ప్రాక్టీస్ చేస్తుండటం ఎంతో మేలు.

మలబద్ధకం నివారణ... మరికొన్ని ప్రయోజనాలు!!

మలబద్ధకం అన్నది ఉదయాన్నే చాలా మందిని బాధపెడుతుంది. సాఫీగా విరేచనం జరగకపోతే పొద్దున్నే లేచింది మొదలు రోజంతా ఇబ్బందికరంగానే గడుస్తుంది. అయితే మన రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుని, కొన్ని రకాల ఆహారాలను తీసుకుంటుంటే మలబద్ధకం సమస్య చాలా సులువుగానే దూరమవుతుంది. అయితే ఈ మార్గాలతో కేవలం మలబద్ధకం నివారణ మాత్రమే కాకుండా అనేక అదనపు ప్రయోజనాలూ ఒనగూరతాయి.

- పీచు మోతాదు ఎక్కువగా ఉండే ఆహారాలు, పండ్లు క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉంటే మలబద్ధకం సమస్య దరిచేరదన్న విషయం తెలిసిందే. ఆ ఆహారాలు కేవలం మలబద్ధకాన్ని నివారించడం మాత్రమే కాదు... పూర్తి జీర్ణాశయం మార్గాన్నీ శుభ్రంగా ఉంచుతాయి. ఇందుకోసం భోజనంలో ఎక్కువ మొత్తంలో ఆకుకూరలు, కాయగూరలు, ఫైబర్ ఎక్కువగా ఉండే కాయధాన్యాలతో పాటు, పీచు మోతాదులు పుష్కలంగా ఉండే పుచ్చకాయలు, బొప్పాయి, నారింజ వంటి పండ్లు తీసుకోవాలి. వీటితో మరో అదనపు ప్రయోజనం ఏమిటంటే... అవి తేలిగ్గా విరేచనమయ్యేలా చేయడంతో పాటు రక్తంలోని కొలెస్ట్రాల్‌నూ, చక్కెర మోతాదుల్ని నియంత్రణలో ఉంచడానికీ తోడ్పడతాయి.



- చిక్కుడు కాయల వంటి కూరల్లో ప్రోటీన్‌తో పాటు ఫైబర్ కూడా ఎక్కువే. చిక్కుళ్లు కండరాల రిపేర్లకూ, శక్తికీ, ఆరోగ్యకరమైన కండరాలకూ దోహదపడతాయి. అలాగే వాటిలోని పీచుపదార్థాలూ జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి. క్యారట్, బీట్‌రూట్ వంటి వాటిల్లోనూ ఫైబర్ ఎక్కువే. వీటిని కూరలుగా తీసుకోవచ్చు. అయితే కొంతమందికి అవి కూరలుగా అంతగా నచ్చకపోవచ్చు. అలాంటివారు సలాడ్స్ రూపంలో లేదా సూప్‌గానూ తీసుకోవచ్చు.
- పీచుపదార్థాలుండే ఆహారాలతో పాటు తగినన్ని నీళ్లు తాగడం వల్ల కూడా విరేచనం సాఫీగా అవుతుంది. జీర్ణ వ్యవస్థ మార్గమూ శుభ్రపడుతుంది. దేహం హైడ్రేటెడ్‌గానూ ఉంటుంది. ఫలితంగా మలబద్ధక నివారణే కాదు చర్మానికి మంచి నిగారింపుతో కూడిన మెరుపును ఇవ్వడంతో పాటు మరెన్నో జబ్బుల నివారణకూ ఈ అంశం తోడ్పడుతుంది

ఇక్కడ పేర్కొన్న మార్గాలు కేవలం మలబద్ధకం నివారణ కోసం మాత్రమే కాకుండా... దాదాపు ప్రతి ఒక్కటి మన వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం, జీర్ణవ్యవస్థలోని పిండి పదార్థాలను (కార్బోహైడ్రేట్స్‌ను) రక్తంలోకి ఆలస్యంగా వెలువడేలా చేయడం ద్వారా మధుమేహాన్ని నివారించడం, మరెన్నో వ్యాధుల నుంచి రక్షణ కల్పించడం వంటి పనులూ చేస్తాయి.



స్నేహిత్‌కు రజతం

జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ ఆటగాడు ఎస్. స్నేహిత్ రజత పతకం సాధించాడు. సూరత్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ఫైనల్లో స్నేహిత్–దియా (మహారాష్ట్ర) జోడి 2–3 తేడాతో పాయస్ జైన్ (ఢిల్లీ) – యశస్విని ఘోర్పడే (కర్ణాటక) చేతిలో ఓడింది. సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో కామన్వెల్త్ పతక విజేత సానిల్ శంకర్ (పీఎస్‌పీబీ)పై సంచలన విజయం సాధించిన స్నేహిత్... క్వార్టర్స్‌లో మానుష్ షా (గుజరాత్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

గుజరాత్ జెయింట్స్ మెంటార్‌గా మిథాలీ రాజ్



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అహ్మదాబాద్ జట్టు 'గుజరాత్ జెయింట్స్'కు భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మెంటార్‌గా వ్యవహరించనుంది. మిథాలీ లాంటి స్టార్‌ను తమ బృందంలోకి ఆహ్వానించడం సంతోషంగా ఉందని డైరెక్టర్ ప్రణవ్ అదానీ చెప్పారు. డబ్ల్యూపీఎల్ కోసం ఆమె రిటైర్మెంట్‌ను పక్కన పెట్టి తొలి టోర్నీలో ఆడవచ్చని వినిపించింది. అయితే తాజా ప్రకటనతో మిథాలీ ప్లేయర్‌గా ఆడే అవకాశాలు లేవని తేలిపోయింది.

సబలెంకా కల తీరగా...



- ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంప్‌గా బెలారస్ స్టార్
- తొలి గ్రాండ్‌స్లామ్ అందుకున్న సబలెంకా
- ఫైనల్లో రిబాకినాపై విజయం

ఒకరు 195 కిలోమీటర్ల వేగంతో సర్వీస్ చేస్తున్నారు.... మరొకరు ఏమాత్రం తగ్గకుండా 192 కిలోమీటర్ల వేగంతో జవాబిస్తున్నారు... ప్రతీ పాయింట్ కోసం హోరాహోరీ సమరం... వీరి షాట్లతో బంతి పగిలిపోతుందేమో అనిపించింది... ఒకరు ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ చాంపియన్ కాగా, మరొకరు తొలి టైటిల్ వేటలో పోరాడుతున్నారు...దూకుడు ఎలా ఉందంటే తొలి 13 పాయింట్లలో 7 ఏస్‌ల ద్వారానే వచ్చాయి... చివరి వరకు కూడా అదే ధాటి కొనసాగింది... గత కొన్నేళ్లుగా ఏకపక్షంగా జరుగుతున్న మహిళల గ్రాండ్‌స్లామ్ ఫైనల్ మ్యాచ్‌లతో పోలిస్తే పోటీపోటీగా, అత్యుత్తమ స్థాయిలో ఈ తుది పోరు సాగింది. చివరకు 2 గంటల 28 నిమిషాల ఆట తర్వాత విజేత అవతరించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ కొత్త చాంపియన్‌గా అరైనా సబలెంకా నిలిచింది.

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన 29వ క్రీడాకారిణిగా అరైనా సబలెంకా గుర్తింపు తెచ్చుకుంది. శనివారం జరిగిన తుది పోరులో సత్తా చాటిన 24 ఏళ్ల ఈ బెలారస్ స్టార్ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను అందుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో 22వ సీడ్ సబలెంకా 4–6, 6–3, 6–4 స్కోరుతో ఐదో సీడ్ ఎలెనా రిబాకినా (కజకిస్తాన్)ను ఓడించింది. మ్యాచ్‌లో సబలెంకా 17 ఏస్‌లు కొట్టగా, రిబాకినా 9 ఏస్‌లు బాదింది. ప్రత్యర్థితో పోలిస్తే 51–31 విన్నర్లతో ఆమె పైచేయి సాధించింది. విజేతగా నిలిచిన సబలెంకాకు 29 లక్షల 75 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 17.34 కోట్లు), రన్నరప్ రిబాకినాకు 16 లక్షల 25 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 9.47 కోట్లు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా గెలుపుతో సబలెంకా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరే అవకాశం ఉంది.

హోరాహోరీగా...

ఫైనల్‌కు ముందు బలాబలాలు చూస్తే ఇద్దరు సమఉజ్జీలుగానే కనిపించారు. ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ గెలిచిన అనుభవంతో పాటు ఈ టోర్నీలో ముగ్గురు గ్రాండ్‌స్లామ్ విజేతలు స్వియాటెక్, ఒస్టాపెంకో, అజరెంకాలను ఓడించిన ఘనతతో రిబాకినా బరిలోకి దిగగా, ఈ ఏడాది ఓటమి ఎరుగని రికార్డుతో సబలెంకా నిలిచింది. తొలి సెట్‌లో రిబాకినా ఆధిక్యం ప్రదర్శిస్తూ 3–1తో ముందంజ వేసినా, ఆపై కోలుకొని ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన బెలారస్ ప్లేయర్ 4–4తో స్కోరు సమం చేసింది. అయితే బ్రేక్ సాధించిన రిబాకినా ఆపై సర్వీస్ నిలబెట్టుకొని తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో తన ఫోర్‌హ్యాండ్ పదును ప్రదర్శించిన సబలెంకా 4–1 వరకు వెళ్లింది. ఆపై కజక్ ప్లేయర్ ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రెండు వరుస ఏస్‌లతో సబలెంకా సెట్ ముగించింది. మూడో సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో స్కోరు 3–3కు చేరింది. అయితే ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో కీలకమైన ఏడో గేమ్‌ను బ్రేక్ చేసిన సబలెంకాకు మళ్లీ వెనక్కి చూడాల్సిన అవసరం లేకపోయింది.

'నేను టైగర్‌ను'

ఐదేళ్ల క్రితం సబలెంకా తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ బరిలోకి దిగింది. మొదటి రౌండ్ మ్యాచ్‌లోనే ఆమె స్థానిక స్టార్ యాష్లీ బార్టీతో తలపడాల్సి వచ్చింది. అయితే షాట్ ఆడే సమయంలో సబలెంకా చేస్తున్న అరుపులు వివాదాన్ని రేపాయి. ప్రేక్షకులు ఆమెను బాగా ఎగతాళి చేశారు. చివరకు ఓటమితో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఇప్పుడు అదే గడ్డపై ఆమెపై అభినందనల వర్షం కురుస్తోంది. సబలెంకా దూకుడైన ఆట, పదునైన ఏస్‌లు తప్ప ఆమె అరుపులు ఎవరికీ వినిపించడం లేదు. సబలెంకా ఎడమ చేతిపై పెద్దపులి టాటూ ఉంటుంది. 'నేను నాలాగే ఉంటాను. ఎవరినీ లెక్క చేయను. నేను టైగర్‌ను' అంటూ తనకు తాను చెప్పుకునే సబలెంకా అలాంటి ధీరోదాత్త ఆటను ప్రదర్శించింది. ఆరడుగుల ఎత్తు ఉన్న సబలెంకా బలం వేగవంతమైన సర్వీస్‌లో ఉంది. అయితే అదే



బలం బలహీనతగా మారి గత టోర్నీలో నాలుగు రౌండ్లలోనే 56 డబుల్‌ఫాల్ట్‌లు చేసింది. ఈ సారి తన కోచింగ్ బృందంతో కలిసి ప్రత్యేక దృష్టి పెట్టిన ఆమె ఇప్పుడు 7 మ్యాచ్‌లలో కలిపి 29 డబుల్ ఫాల్ట్‌లే చేసింది. సబలెంకా టెన్నిస్‌ను చాలా ఆలస్యంగా మొదలు పెట్టింది. హాకీ ఆటగాడైన తండ్రి సెర్గీ ప్రోత్సాహంతో ఆటలోకి అడుగు పెట్టిన ఆమె 15 ఏళ్ల వయసు వరకు ఎలాంటి జూనియర్ టోర్నీలు ఆడనే లేదు. 16 ఏళ్ల వయసులో నేషనల్ టెన్నిస్ అకాడమీలో చేరిన తర్వాత ఆమె కెరీర్ మలుపు తిరిగింది. 2019లో తండ్రి ఆకస్మిక మరణం సబలెంకాను కలచివేసింది. 'మా నాన్న నన్ను వరల్డ్‌నంబర్ వన్‌గా చూడాలనుకున్నారు' అని ఆమె గుర్తు చేసుకుంది. ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన 58వ మహిళా ప్లేయర్‌గా నిలిచి రెండో ర్యాంక్‌కు చేరిన సబలెంకా నంబర్‌వన్ కావడానికి మరెంతో దూరం లేదు!

పాండ్యా సేనకు పరీక్ష

- నేడు న్యూజిలాండ్‌తో రెండో టి20
- గెలిస్తేనే సిరీస్ రేసులో
- పట్టుదలతో కివీస్
- రా.గం.7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్–1'లో ప్రత్యక్ష ప్రసారం



లక్నో: ఈ కొత్త ఏడాది జోరుమీదున్న భారత్ తొలి సారి కఠిన పరీక్ష ఎదుర్కొంటోంది. వన్డేల్లో క్లీన్‌స్వీప్ చేసిన కివీస్‌తోనే టి20 సిరీస్ ఆరంభ పోరులో కఠిన సవాలు ఎదురైంది. ఇప్పుడు సిరీస్‌లో తప్పక గెలిచి నిలవాల్సిన పరిస్థితిలో టీమిండియా ఉంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా ఆతిథ్య జట్టుపైనే ఉంది. మరోవైపు న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ ప్రతిభతో పుంజుకొని మనకు షాక్ ఇచ్చింది. దీంతో టీమిండియా మరోసారి ఆదమరిస్తే ఈ సారి మ్యాచ్‌ను కాదు... సిరీస్‌నే కోల్పోవాల్సి వుంటుంది. ముఖ్యంగా టాపార్డర్ మెరిపించాలి. శుబ్‌మన్ గిల్ గత మ్యాచ్‌లో విఫలం కాగా, ఇషాన్ కిషన్ అటు వన్డే, ఇటు టి20ల్లో తీవ్రంగా నిరుత్సాహపరుస్తున్నాడు. ఇటీవల దీపక్ హుడాకు టీమ్ మేనేజ్‌మెంట్ చెప్పుకోదగ్గ అవకాశాలిస్తున్నా... తను మాత్రం సద్వినియోగం చేసుకోవడం లేదు. ఈ మ్యాచ్‌లో ఇషాన్, హుడా నిరూపించుకోవాల్సిన అవసరం వచ్చింది. బౌలింగ్‌లో ఉమ్రాన్ మలిక్ పేస్‌తో పాటు వైవిధ్యం కనబర్చాలి. సుందర్‌తో పాటు కుల్దీప్ కూడా స్పిన్‌తో కట్టడి చేస్తే భారత్‌కు ఏ ఇబ్బంది ఉండదు. తొలి మ్యాచ్‌లో ఓడినా నేడు తుది జట్టులో మార్పులేమీ ఉండకపోవచ్చు.

పిచ్–వాతావరణం

వాజ్‌పేయి స్టేడియం బ్యాటింగ్ పిచ్. ఇక్కడ భారత్ గతంలో రెండు మ్యాచ్‌ల్లో 190 పైచిలుకు పరుగులు చేసి గెలిచింది. ఉత్తరాది వేదిక కావడంతో మంచు ప్రభావం మరింత ఎక్కువ.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), గిల్, ఇషాన్, త్రిపాఠి, సూర్యకుమార్, సుందర్, దీపక్ హుడా, శివమ్ మావి, కుల్దీప్, అర్‌‌ష్‌దీప్, ఉమ్రాన్.

న్యూజిలాండ్: సాన్‌ట్నర్ (కెప్టెన్), అలెన్, కాన్వే, చాప్‌మన్, ఫిలిప్స్, మిచెల్, బ్రేస్‌వెల్, ఇష్‌సోధి, ఫెర్గూసన్, డఫీ, టిక్నర్.

భారత్ 9వ స్థానంతో ముగింపు

- 5–2తో దక్షిణాఫ్రికాపై గెలుపు
- ప్రపంచకప్ హాకీ



భువనేశ్వర్: సొంత గడ్డపై జరుగుతున్న ఎఫ్‌ఐహెచ్ ప్రపంచ కప్ హాకీలో క్వార్టర్ ఫైనల్ కూడా చేరలేక నిరాశపరిచిన భారత జట్టు చివరకు విజయంతో మెగా టోర్నీని ముగించింది. శనివారం 9 నుంచి 12వ స్థానాల కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత్ 5–2తో దక్షిణాఫ్రికాపై గెలుపొందింది. అయితే మరో మ్యాచ్‌లో అర్జెంటీనా 6–0 స్కోరు తేడాతో వేల్స్‌ను చిత్తు చేయడంతో భారత్, అర్జెంటీనాలు సంయుక్తంగా 9వ స్థానంలో నిలిచాయి. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున అభిషేక్ (4వ ని.), హర్మన్‌ప్రీత్ సింగ్ (11వ ని.), షంషేర్ సింగ్ (44వ ని.), ఆకాశ్‌దీప్ సింగ్ (48వ ని.), సుఖ్‌జీత్ సింగ్ (58వ ని.) తలా ఒక గోల్ చేశారు. సఫారీ జట్టులో సంకెలో ఎంవింబి (48వ ని.), ముస్తఫా కాసిమ్ (59వ ని.) చెరో గోల్ చేశారు. ఆట ఆరంభమైన నాలుగో నిమిషంలోనే అభిషేక్ ఫీల్డ్‌గోల్‌తో భారత్‌కు శుభారంభమిచ్చాడు. ఈ క్వార్టర్‌లోనే హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి 2–0తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఇదే స్కోరుతో తొలి అర్ధభాగాన్ని (రెండు క్వార్టర్లు) ముగించిన భారత్ ఆఖరి క్వార్టర్‌లో మరో రెండు ఫీల్డ్ గోల్స్‌ను ఆకాశ్‌దీప్, సుఖ్‌జీత్ సాధించడంతో విజయం సులువైంది.

ఫైనల్ సమరానికి సిద్ధం

- నేడు మహిళల అండర్–19 వరల్డ్ కప్ తుది పోరు
- ఇంగ్లండ్‌తో భారత అమ్మాయిల ఢీ



సా.గం.5.15 నుంచి 'ఫ్యాన్‌కోడ్' యాప్‌లో ప్రసారం

పొచెఫ్‌స్ట్రూమ్: మహిళల క్రికెట్‌లో ఇప్పటి వరకు ఒక్క ఐసీసీ టోర్నీ కూడా గెలవని భారత జట్టు ఆ ఘనతకు అడుగు దూరంలో ఉంది. సీనియర్ అమ్మాయిల జట్టు మూడు ప్రపంచకప్ (రెండు వన్డే, ఒకటి టి20) ఫైనల్లో ఆడినా... రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. ఇప్పుడు ఈ జూనియర్ జట్టు ఫైనల్ విజయంతో వస్తే... భారత మహిళల క్రికెట్ ప్రగతి మరో దశకు చేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. షఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు ఆదివారం ఇంగ్లండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. శనివారమే పుట్టినరోజు జరుపుకున్న షఫాలీకి వున్న అంతర్జాతీయ అనుభవం, జట్టు ఈ టోర్నీలో కనబరిచిన ప్రదర్శనను బట్టి చూస్తే భారతే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. పైగా రెండు ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన షఫాలీ తన నైపుణ్యంతో జట్టును విజయతీరాలకు చేర్చితే ఆమె ఖాతాలో అరుదైన రికార్డు చేరుతుంది. సెమీఫైనల్లో షఫాలీ సేన న్యూజిలాండ్‌పై అలవోక విజయం సాధించింది. మొదట బౌలర్లు, తర్వాత బ్యాటర్లు కివీస్ అమ్మాయిలపై ఆధిపత్యం చలాయించారు. ఫైనల్లోనూ ఇదే పట్టుదల కనబరిస్తే ప్రపంచకప్ చేతికందుతుంది. మరో వైపు సెమీస్‌లో హోరాహోరీ సమరంలో చిరకాల ప్రత్యర్థి ఆస్ట్రేలియాను ఓడించడంతో ఇంగ్లండ్ జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగింది. భారత జట్టుకు తగిన పోటీ ఇవ్వగల సత్తా ఇంగ్లండ్‌కు ఉంది.

నేడు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల ఫైనల్ జొకోవిచ్ (సెర్బియా) X సిట్సిపాస్ (గ్రీస్)	మ.గం. 2 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం	నేడు హాకీ ప్రపంచకప్ ఫైనల్ జర్మనీ X బెల్జియం	రా.గం. 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

ఈసారి బర్త్‌డేకి అలా కోరుకున్నా!



- బర్త్‌డే సెలబ్రేషన్‌లో శంతను, అక్షర, కాజోల్‌తో శ్రుతీహాసన్

'నిన్ను నిన్నుగా నువ్వు ప్రేమించుకోవడాన్ని మర్చిపోకు'' అంటున్నారు శ్రుతీహాసన్. శనివారం (జనవరి 28) ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేశారు శ్రుతి. ''నా జీవితం ఎంత గొప్పగా సాగుతోందో, మాటల్లో వర్ణించలేని ప్రేమను ఎంతగా పొందగలుగుతున్నానో (కుటుంబ సభ్యులు, ఫ్యాన్స్, ఫ్రెండ్స్‌ని ఉద్దేశించి) అనే ఆనందమైన ఆలోచనలతో నిద్ర లేచాను. ప్రతి ఏడాదీ నా బర్త్ డే కేక్‌పై ఉన్న కొవ్వొత్తులను ఆర్పిన తర్వాత కొన్ని నిర్ణయాలు తీసుకుంటాను. కానీ ఈ ఏడాది మాత్రం నా కోసమే కాదు.. అందరి కోసం కోరుకున్నాను. అందరూ ఎంతో సంతోషంగా జీవితాన్ని గడపాలని, వారు కోరుకున్నది వారికి దక్కేలా పరిస్థితులు అనుకూలించాలని కోరుకుంటున్నాను. నిజం చెప్పాలంటే... ఎవరికి దక్కాల్సింది వారికి దక్కుతూనే ఉంటుంది. ప్రతి బర్త్ డేకి వయసు సంఖ్య పెరగడం సహజం. ఆ అనుభవం రీత్యా కాస్త తెలివైనవాళ్ళం కూడా అవుతుంటాము (సరదాగా..). అలాగే ఈ ప్రపంచమనే యుద్ధంలో ప్రతిసారీ ఒంటరి సైనికుడిలా నెగ్గుకు రాలేమని కూడా అర్థం అవుతోంది. అయితే నా చుట్టూ ఉన్న ప్రపంచంలో ఎంతో తెలివైనవారు, సానుకూల దృక్పథంతో ఉన్నవారు ఉన్నందుకు నేనే వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇక ఈ ప్రపంచంలో నువ్వు చాలా ప్రత్యేకమైన వ్యక్తివి. సో.. నీ ప్రత్యేకతను నువ్వు ప్రేమిస్తూనే ఉండాలి'' అని రాసుకొచ్చారు శ్రుతీహాసన్. కాగా ఈ బర్త్ డేని శ్రుతీహాసన్ చాలా సందడిగా జరుపుకున్నట్లుగా ఫొటోలు చెబుతున్నాయి. ఈ వేడుకల్లో శ్రుతీ తల్లి సారిక, చెల్లి అక్షరాహాసన్‌లతో పాటు ఆమె బాయ్‌ఫ్రెండ్ శంతను హజారికా, బాలీవుడ్ నటి కాజోల్ కూడా పాల్గొన్నారు. ఇక సినిమాల విషయాని వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం ప్రభాస్ సరసన 'సలార్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే 'ది ఐ' అనే ఇంగ్లిష్ ఫిల్మ్‌లో శ్రుతి ఓ లీడ్ రోల్ చేస్తున్నారు.

ఆమె ప్రేమే నన్ను మార్చింది! - రజనీకాంత్



- రజనీకాంత్,లత

సూపర్ స్టార్ రజనీకాంత్ ఏ వేడుకలో పాల్గొన్నా సినిమాల గురించే ఎక్కువగా మాట్లాడతారు. వ్యక్తిగత విషయాలు మాట్లాడిన దాఖలాలు దాదాపు లేవు. అలాంటిది ఇటీవల తన వ్యక్తిగత అలవాట్ల గురించి, తన భార్య లత కారణంగా తాను మారిన విషయం గురించి చెప్పి ఆశ్చర్యపరిచారు. రజనీకాంత్ మాట్లాడుతూ – ''నేను బస్ కండక్టర్‌గా ఉద్యోగం చేస్తున్న సమయంలో మద్యం సేవించేవాడిని. ధూమపానం బాగా అలవాటు. మాంసాహారం కూడా కాస్త ఎక్కువగానే తీసుకునేవాడిని. మద్యం–మాంసాహారం–సిగరెట్.. ఈ మూడూ మంచి కాంబినేషన్. అయితే ఈ చెడు అలవాట్లు ఉంటే 60 ఏళ్లకు పైన బతకరు. ఈ అలవాట్లు ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని, కొంతకాలం తర్వాత ఇవి మన అనారోగ్యానికి కారణమవుతాయని అనిపించింది. నా భార్య లత వల్లే నా చెడు అలవాట్లకు నేను దూరం కాగలిగాను. ఆమె తన ప్రేమతో నన్ను మార్చింది. లత ప్రేమ వల్లే ఇప్పుడు వీటికి దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతున్నాను. 73ఏళ్లలోనూ నేనింత ఆరోగ్యంగా ఉండటానికి కారణం తనే. అందుకే నా భార్య లతకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే లతను నాకు పరిచయం చేసిన మహేంద్రన్ (లత బావ, నటుడు, రచయిత వైజీ మహేంద్రన్‌ని ఉద్దేశించి)కూ రుణపడి ఉంటాను'' అని చెప్పుకొచ్చారు రజనీకాంత్. వైజీ మహేంద్రన్ రూపొందించిన 'చారుకేశి' నాటికకు సంబంధించిన వేడుకలో పాల్గొన్న రజనీ తన అలవాట్ల గురించి ఈ విధంగా చెప్పుకొచ్చారు. ఇక ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.

డ్యాన్స్ పుష్ప డ్యాన్స్



- అల్లు అర్జున్

వైజాగ్ పోర్టులో అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్ చేస్తున్నారు అల్లు అర్జున్. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సక్సెస్ తర్వాత మలి భాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు ఈ చిత్రం హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ వైజాగ్‌లోని పోర్టు లొకేషన్స్‌లో జరుగుతోంది. అల్లు అర్జున్ పై ఓ పాట చిత్రీకరిస్తున్నట్లుగా తెలిసింది. ఇది హీరో ఇంట్రడక్షన్ సాంగ్ అట. ఈ చిత్రంలో పుష్ప రాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ కానున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పగ సాధిస్తా!



- రవీనా టాండన్

పగ తీర్చుకోవడానికి పక్కా ప్రణాళిక వేస్తున్నారు బాలీవుడ్ నటి రవీనా టాండన్. అమెరికన్ టెలివిజన్ మిస్టరీ థ్రిల్లర్ సిరీస్ 'రివెంజ్' హిందీ రీమేక్‌లో రవీనా టాండన్ నటించనున్నట్లుగా వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వార్త నిజం అని నిర్ధారిస్తూ.. ''ఈ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం చాలా స్పెషల్‌గా అనిపిస్తోంది'' అని పేర్కొన్నారు రవీనా. ఇక ఈ 'రివెంజ్' వెబ్ సిరీస్ హిందీ అడాప్షన్‌కు దర్శకుడు ఇంకా ఖరారు కాలేదు. కాగా 2021లో వచ్చిన 'ఆర్యాంక్' వెబ్ సిరీస్ తర్వాత రవీనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రాజెక్ట్ ఇదే. ఇక 'రివెంజ్' కథ విషయానికి వస్తే... కొందరి స్వార్థపరుల ఆత్యాశ వల్ల హత్య చేయబడిన తన తండ్రి కోసం ఓ యువతి చేసే పోరాటం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... జనవరి 26న వెలువడిన 'పద్మ' అవార్డుల్లో రవీనాకు పద్మశ్రీ పురస్కారం వరించిన సంగతి తెలిసిందే.

మా నమ్మకం నిజమైంది - సందీప్ కిషన్



- దివ్యాంశా కౌశిక్, సందీప్ కిషన్

''మైఖేల్' కథని, దర్శకుడు రంజిత్‌ని బలంగా నమ్మాం. ట్రైలర్‌కి వచ్చిన అద్భుతమైన స్పందన మా నమ్మకాన్ని నిజం చేసింది. కథ, కంటెంట్, మేకింగ్ పరంగా 'మైఖేల్' యూనివర్సల్‌గా రీచ్ అయ్యే సినిమా'' అని హీరో సందీప్ కిషన్ అన్నారు. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా రూపొందిన చిత్రం 'మైఖేల్'. విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్ కుమార్, దివ్యాంశా కౌశిక్, వరుణ్ సందేశ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రల్లో నటించారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంజిత్ జయకొడి మాట్లాడుతూ– ''నేను తమిళ్‌లో మూడు సినిమాలు తీశాను. తెలుగులో 'మైఖేల్' నా మొదటి చిత్రం. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు. ''సందీప్ కిషన్‌కి సినిమా తప్ప మరో తపన ఉండదు. ఈ మూవీ కోసం ఆయన ఎంత కష్టపడ్డారో ట్రైలర్‌లోనే తెలుస్తోంది. 'మైఖేల్'తో సక్సెస్ కొడతామనే నమ్మకం ఉంది'' అన్నారు భరత్ చౌదరి. ''రంజిత్ 'మైఖేల్' కథ చెప్పిన వెంటనే మరో ఆలోచన లేకుండా సినిమా చేద్దామని చెప్పాం'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు. ''మైఖేల్' లాంటి మంచి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు దివ్యాంశా కౌశిక్, వరుణ్ సందేశ్.

అది నా అదృష్టం - ఆషికా రంగనాథ్



''తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. తెలుగులో నటించాలని కొన్నేళ్లుగా అనుకుంటున్నాను. గతంలో కొన్ని కథలు నచ్చకపోవడం, మరికొన్ని నా డేట్స్ కుదరక చేయలేదు. కానీ 'అమిగోస్' కథ వినగానే నచ్చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ వంటి పెద్ద ప్రొడక్షన్‌లో నా తొలి చిత్రం చేయడం నా అదృష్టం. 'అమిగోస్' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని ఆషికా రంగనాథ్ అన్నారు. ''బింబిసార' వంటి హిట్ చిత్రం తర్వాత కల్యాణ్ రామ్ హీరోగా నటించిన చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వం వహించారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమవుతున్న కన్నడ హీరోయిన్ ఆషికా రంగనాథ్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ– ''అమిగోస్'లో నేను రేడియో జాకీ పాత్ర చేశాను. నేటితరం అమ్మాయిలకు నా పాత్ర బాగా నచ్చుతుంది. స్క్రీన్‌పై నా పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ నటనకు ఆస్కారం ఉన్న పాత్ర. ఇక తెలుగులో అల్లు అర్జున్, ఎన్టీఆర్‌గార్ల డ్యాన్స్ అంటే ఇష్టం. రాజమౌళిగారు తీసిన 'బాహుబలి' లాంటి సినిమాలో నటించాలనేది నా కల. ప్రస్తుతం కన్నడ, తమిళంలో కొన్ని సినిమాలు చేస్తున్నాను. తెలుగులో కొన్ని కథలు చర్చల్లో ఉన్నాయి'' అన్నారు.

మన ఆలోచనలే మన బలం - సమంత



- సమంత

సినిమాలు, వ్యక్తిగత విషయాలతో పాటు తన జిమ్ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటారు సమంత. అయితే మయోసైటిస్ వ్యాధి కారణంగా కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్‌గా లేరు సమంత. ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్న సమంత తిరిగి రొటీన్ లైఫ్‌లోకి వస్తున్నారు. తాజాగా జిమ్‌లో వర్కవుట్స్ చేస్తున్న ఓ వీడియోను షేర్ చేశారు సమంత. ''క్లిష్టమైన టైమ్‌లో నాకు తోడుగా నిలిచి, నాలో స్ఫూర్తి నింపిన 'హూ ఈజ్ గ్రావిటీ' బ్యాండ్‌కి కృతజ్ఞతలు. ఆరోగ్యం కోసం మనం పాటించే కఠినమైన డైట్ వల్ల మాత్రమే మనకు బలం రాదు.. అది మన ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది అనేది నా అభిప్రాయం'' అని రాసుకొచ్చారు సమంత. కాగా సమంత లీడ్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన 'శాకుంతలం' ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ప్రస్తుతం 'సిటాడెల్' అనే హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారామె.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని, గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు (డైరెక్ట్)/40, లేట్ మ్యారేజ్, 5'8", B.Com, బిజినెస్ చేస్తున్న వెల్‌సెటిల్డ్ వరునికి మంచి సంప్రదాయ వధువు కావలెను. Ph: 7032918043 [H-792585]

SC హిందూ మాదిగ/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ C.Govt. మేనేజర్/ కెనరా బ్యాంక్/ 90,000/-pm, 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10069]

కుమ్మరి/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ గేల్ ఇండియా/75,000/-pm, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10069]

జిన్న, గంగపుత్ర/అగ్నికుల క్షత్రియ/ MCA/ Govt. ఇన్‌స్పెక్టర్/ రెవెన్యూ Dept./ 6 Lakhs P/A / 5'11" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10069]

లంబాడి/M.Sc/Govt. హాస్టల్ వార్డెన్/70,000/-pm, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9963410191 [HA-10069]

యాదవ/కట్నం ప్రసక్తిలేదు/ M.Tech/ Govt. Asst. ఎగ్జి॥ ఇంజినీర్/R&B/ 12 Lakhs P/A, 6' ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10069]

విశ్వబ్రాహ్మణ్/M.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/రైల్వేస్/65,000/-pm, 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10069]

వడ్డెర/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/80,000/-pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13836]

కాపు/M.Tech/ C.Govt. Asst. మేనేజర్/IOCL/ 1 Lakh pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8886512010 [HA-13836]

నాయిబ్రాహ్మణ/B.Tech/ Govt. A.E/ ఇరిగేషన్ Dept./ 82,000/-pm/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9581317506 [HA-13836]

కుల పట్టింపులేదు/ 29/5'10"/ ప్రైసింగ్ ఎనలిస్ట్ /USA సిటిజన్ అబ్బాయి OC/BC అందమైన Indian/USA అమ్మాయి కావలెను. సం॥ శుభమస్తు HYD. S. రాములు గౌడ్. Ph: 8790690309 [H-793264]

2వ పెళ్ళి/ కుల ప్రసక్తి లేదు /50Y/ PG/C.Govt ఆఫీసర్/ 3 లక్షలు PM సొంత ఇల్లు+రెంట్స్ 10కోట్ల ఆస్తి గల పిల్లలులేని, వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. (పిల్లలున్నా OK) Ph: 7396213324 [H-792963]

బ్రాహ్మణ (6000 N) హరితస 48, 5'4", 2 Lakhs PM గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866145583 [HA-13802]

SC మాల/ ఏకైక కుమారుడు/M.Tech/ C.Govt. గెజిటెడ్ ఆఫీసర్/1 Lakh pm/ కస్టమ్స్ Dept./ 1 Lakh pm/ 5'9" ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-13802]

రజక/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ ఇరిగేషన్ Dept./ 90,000/-pm/ 5'8" ఎత్తు/30 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 8897389698 [HA-13802]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Business (Exports) B.Tech/ MBA/ 1995/ 6'/ 100Cr. *1992/5'10"/ 300 Cr. *Cont : K.C. Reddy-Mar-Bur-Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/Business/B.Tech/1990/6'/1000 Cr. *1989/5'11"/500Cr. *1993/5'7"/50Cr. *Cont: K.C. Reddy - Mar-Bur-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/Sup.Spl.*1994/5'10"CARD /75Cr.*(Gastro)/1993/5'10"/50Cr.*Mch/1989/ 5'9"/ 30Cr. *MD/1995/ 5'10" / 300Cr. *Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/USA-Citizen/BS/MS/MBA/1995/ 5'10"/260K/70Cr. *1991/230K/5'10"/25Cr. *1992/5'11"/250K/30Cr. *Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/USA/Res.Doc.*1989/ 5'10" *1992/5'11". *1994/5'9". *1990/5'10". * 1991 /5'10". *1990/6'. *1975/6' * Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/MBA/1993/ 5'10"/300Cr. *1997/100Cr. * Cont: K.C. Reddy-Mar-Bur-Road No.3-B. Hills-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/1988/5'11"/ 300Cr. *1995/5'9"/250Cr. * Cont: K.C. Reddy -Mar-Bur-Road No.3-B.Hills-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/Job/Hyd/1994/5'8"/ 200Cr. *1988/Business/Hyd/ 5'8"/200Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/9347807015

Reddy/B.Tech/NIT/MS/MBA/USA/230 K/1995/6'/200Cr. *1991/5'11"/130K/200 Cr. * Cont:K.C. Reddy-Mar-Bur- Hyd. Ph:9849321309/9347807015

Reddy/Business/B.Tech/MBA/UK/ 1994/5'11"/250Cr. *1994/5'9"/350Cr. *Cont: K.C. Reddy-Mar-Bur- Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech(CBIT)/ SWE/ Hyd/ Most beautiful/29/5'7"/20 Cr. *MBA/1995/5'5"/ 70 Cr. *1996/5'4"/(NIT)/10 Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/BBA/MBA/1998/5'4"/25 Cr. *B.Tech/ 1991/5'7"/10 Cr. *1994/5'6"/SWE/10 Cr. *1997/ 5'5"/15 Cr. *1995/5'4"/25 Cr. *Cont: K.K. Reddy- Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/ MBA/ 1991/ 5'4"/ 1Cr/ Yr/ 10 Cr. *1999/5'8"/15 Cr *1997/5'4"/SWE/4 Cr. *1994/5'3"/10Cr. *MBA/1993/5'3"/20Cr. *Cont: K.C.Reddy- Hyd- Ph: 9849321309

Reddy/M.Tech/1996/5'6"/6 Cr. *1995/5'7"/ 10 Cr. *MS/1998/20 Cr + 10 Cr cash *MS/ USA/1996/5'5"/15 Cr. *1995/5'3"/40 Cr. *Cont: K.C.Reddy-Hyd- Ph: 9347807015

Reddy/ B.Tech/ MS/ 1992/ 5'3½"/ 40 Cr. *1990/ 5'3"/ 50Cr. *1996/5'7"/40 Cr *1994/ 5'8"/ 4 Cr. *1994/5'5"/20 CR. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/ BBA/ MBA/ 100 Cr + *1993/5'3" *1995/5'3" *1996/5'9" *1997/5'4" *1994/5'6" * 1995/5'8" *1994/5'3" * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ H1/ USA *1996/5'9"/ 100 Cr. *1996/5'8"/15 Cr. *1995/5'7"/15 Cr. *1990/5'8"/100 Cr. * 1996/5'7"/50 Cr. *Cont: K.C.Reddy - Hyd- Ph:9347807015

Reddy/MBBS/PG *1995/5'3"/100 Cr. *1995/ 5'3"/50 Cr. *1993/5'3"/50 Cr. * 1996/5'6"/60 Cr. *1993/5'7"/100 Cr. *1994/5'4"/50 Cr. *Cont: K.C.Reddy- Hyd- Ph: 9849321309

Reddy/MBBS/PG/1994/5'10"/50 Cr. *1996/ 5'4"/50 Cr. *USA-Doc→1996/5'8"/40 Cr. *1992/ 5'5" *1992/5'4"/50 Cr/ 1992/5'7"/50 Cr. *Cont: K.C.Reddy- Hyd- Ph: 9849321309

Reddy/Divorcee *MBBS/MD/1994/5'5"/50 Cr. *USA-Doc/1992/5'3"/9 Cr. *CA/1985/5'7"/5 Cr. *B.Tech/1985/5'5"/400 Cr. *MBBS/1993/5'8"/40 Cr. *Cont: K.C.Reddy- Hyd- Ph: 9849321309 [D-500]

2వ పెళ్ళి/క్రిస్టియన్/కుల ప్రసక్తిలేదు/ MA, B.Ed/ Govt. టీచర్/ 1 Lakh pm/ 5'8" ఎత్తు/39 సం॥ల పిల్లలులేని వరునికి తగిన వధువు కావలెను. Ph: 9550650024 [HA-13802]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech (EEE)/ C.Govt. మేనేజర్ (యూనియన్ బ్యాంక్)/65,000/-pm/ 5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తిలేదు. Ph: 9515755529 [HA-13802]

రెడ్డి/30 yrs/5'5"/MA, B.Ed/ కలర్: Fair/ సాఫ్ట్‌వేర్ జాబ్/ 80 K per Month. Any Caste అయినా Ok. వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8500427582 [H-792585]

38 సం॥ల బిజినెస్ మ్యాన్‌కి సెకండ్ మ్యారేజ్, కుల ప్రసక్తిలేని వరునికి సెకండ్ మ్యారేజ్/విడో, పిల్లలు ఉన్నవారు అయినా సంప్ర: No డౌరీ. Hyd. Ph: 9550398338 [HA-28714]

యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం, సొంత ఇల్లు, 48 సం॥లు, 2వ పెళ్ళి వరుడికి కుల ప్రసక్తి లేని సంప్రదాయం కలిగిన వధువు కావలెను. డైరెక్ట్, నో బ్రోకర్స్. 9573428169. [B-786747]

కాపు : Age:28 yrs, 5'6", BA, సొంత హాస్పిటల్‌లో MDగా గల వరునికి చదువుకున్న & పూర్తి గృహిణిగా వుండే వధువు కావలెను. కులపట్టింపు లేదు.నో బ్రోకర్స్,డైరెక్ట్,Dr.P.వసంత 9701084996 [B-67]

గౌడ/43 సం॥/B.Tech, 5'.10", 6 ఎకరాలు భూమి, స్వంత ఇల్లు గల లేట్ మ్యారేజ్ వరునికి వధువు కావలెను (డైరెక్ట్) సెల్ : 98480 86027 [B-1197286]

యాదవ/కురుమ : 28, 5.10 / M.Tech(I.R.S) సంపన్న కుటుంబం అందమైన వరుడుకు వధువు కావలెను. సంప్ర॥ 9885453717, 9494710415 [G-776062]

2nd Marriage/Sunni Muslim boy/ 39/5'8"/ Andhra (Vijayawada) 93K p/m, working in HYD, No Children, Looking for marriage proposal. Send bio-data & photos to marriage_heaven@hotmail.com [H-787485]

Political- Software-Business man, 56, OC wants tall Business Life Partner Lady, 6360474663, Widow Ok. [WB-46751]

Vice President & MD Software Company USA MS $220K Khamma 27 Years. 5'10" Needs Suitable Bride. Cont:9444817468 [NA-21595]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', SWE, 200 K, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 6', Manager, 18 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr Analyst, 115 K, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech (BITS), 28, 5' 9", SWE, 24 L P/A, 6 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 7", H1, USA, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5'4", SWE, 50 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", 3 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BArch, MArch, 27, 5'5", Architect, Rich, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



వధువు కావలెను

రెడ్డి Bengaluru, BE (IIT), 29, 5' 8", SWE, 40 L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 8", SWE, 100 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5' 11", USA, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 34, 5' 10", SWE, 130 K, 12 Cr, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 23, 5' 4", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Guntur, BE, MS, 25, 5' 3", Rich, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, MBBS, MHA, 28, 5' 4", Doctor, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 36, 5' 3", Manager, 31 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

★

Sagara / Uppara / Female / 24 yrs / Software / 10 Lakhs per Annum గల వధువుకి తగిన వరుడు కావలెను & M / 52 yr/ divers (2వ పెండ్లి) కి CNB వధువు కావలెను. Suna Marriage Links, Hyd. Cell: 7386271546. [Z-772138]

★★


డైరెక్ట్, విశ్వబ్రాహ్మిణ్/48y/5'7"/IInd/ ప్రై. జాబ్ 50K pm, Hyd లో స్వంత ఇల్లు & ప్రాపర్టీ ఉన్న వరునికి వధువు కావలెను. Ph: 9618346855 [HA-89836]

Direct: కోనసీమ కాపు/ 36, 5'6" వరుడికి రాజకీయ వృత్తి ఇష్టం ఉన్న గొప్ప వధువు కావలెను. Ph: 9113679022 [WB-50953]

రెడ్డి 34Yrs/5'.4"/ B.Tech,MBA/ Wipro, B'lore/ 12Lacks P.A/50Cr Property,Only Son, B'lore. వరునికి వధువు కావలెను. అమ్మాయి జాబ్ చెయ్యన వసరంలేదు. Fairlinks Matrimony,TPT, 9395566113. [T-734]

SC మాదిగ CNB 29Yrs/6"/Fair/B.Tech/SBI, B'lore/7 Lacks P.A/5Cr Property, వరునికి డిగ్రీ ఆపై చదివిన వధువు కావలెను. Fairlinks Matrimony, విజయవాడ, 9299992601. [T-734]

వరుడు కావలెను



రెడ్డి/ విడో/ కుల, ఆస్తి ప్రసక్తిలేదు, A:30, Q: డిగ్రీ, బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర॥. Ph: 9100717575 [H-792963]

2వ పెళ్ళి/కుల ప్రసక్తిలేదు/40y/ M.Sc, M.Ed/ Govt. లెక్చరర్ 1 లక్ష p/m, పిల్లలు లేని తెల్లని అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలున్నా Ok). Ph: 7396213324 [H-787485]

రెడ్డి/ 40yr/ కుల పట్టింపు లేదు/ ఫెయిర్, Govt ఎంప్లాయి, 120 LAC (PM), వెల్‌సెటిల్డ్ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర॥. Ph: 9492081545 [H-792963]

No Caste bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph:W: 7794960803 [H-776394]

బ్రాహ్మణ/30/5'2"/ B.Com. & 34/5'2"/ ఇంటర్. *35/5'3"/B.Tech *36/5'4"/ఇంటర్. *38/ 5'4"/డిగ్రీ వధువులకు జాబ్/బిజినెస్/పురోహితం వరులు కావలెను. వాట్సాప్: 7815999246 [HA-13161]

గౌడ/ఏకైక కుమార్తె/M.Tech/ Govt. Asst. మేనేజర్/IDBI బ్యాంక్/45,000/-pm, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10069]

వైశ్య: కోమటి/B.Tech/C. Govt. P.O/ SBI బ్యాంక్/50,000/-pm, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10069]

ముదిరాజ్/ఏకైక కుమార్తె/B.Tech/ Govt. Jr. Asst. MPDO/ 40,000/-pm, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10069]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C. Govt. సైంటిస్ట్/ డిఫెన్స్/ 60,000/-pm, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10069]

యాదవ/M.Tech, (EEE)/ Govt. A.E.E/ జెన్‌కో/ 80,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-13836]

కాపు/52y/ ఫ్యామిలీ పెన్షనర్/ 43,000/-pm సొంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. Ph: 8340059430 [HA-13836]

తెలగకాపు/ విడో/ 60Y/ తెల్లనిచాయ/తక్కువ చదువు/ రెండు వాటాల ఇల్లు/పంటభూమి కల ఒంటరి వధువుకు కులప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8185043391 [H-793264]

OC/ 48y/ విడో/ MBA/ Director/Govt Job/ Super Market/ 17 Acr Land/7 Lac Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8885924657 [H-793264]

యాదవ/విడో/ 50Y/5'3" ఫ్యామిలి పెన్షనర్/ 50,000/pm/ సొంత ఇల్లు ఫైనాన్స్ బిజినెస్/ 1L/pm/ ఆస్తి, కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. Ph: 8106358849 [H-793264]

2వ పెళ్ళి/ 36yrs/ Govt ఎంప్లాయి/2,50,000/-(pm) కుల ప్రసక్తి లేదు బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్న OK) సంప్రదించండి. Ph: 9502046384 [H-792963]

రెండవ పెళ్లి/విడో/50y/Fair/తిరుపతి/Own House (Rents) Lands, వెల్‌సెటిల్ ఏ బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (పిల్లలున్నా Ok). Ph: 8519803423 [H-787485]

SC మాల/హిందూ/ 26y/5'4"/ B.Tech/ SWE/ 60K P.M, వెల్‌సెటిల్ ఫ్యామిలీ గల వధువుకి తగిన (GOVT. EMP/ SWE/ DOCTOR) వరుడు కావలెను. Ph: 9676968974 (whatsapp) [H-787485]

బ్రాహ్మణ/విడో/48y/5'4"/ MA, B.Ed/ Govt. టీచర్ (VRS) 50K p/m / Own Schools / Lands/ 4 Lakhs p/m/ కోట్ల ప్రాపర్టీ గల ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. (పిల్లలున్నా Ok). Ph: 9177631661 [H-787485]

SC మాదిగ/B.Tech/ C. Govt. Asst. మేనేజర్/SBI/ 60,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7386559151 [HA-13802]

2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/B.Tech/ C. Govt. Asst. మేనేజర్ (యూనియన్ బ్యాంక్)/60,000/-pm/ 5'2" ఎత్తు/ 27 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963757612 [HA-13802]

SC మాల & SC మాదిగ/M.Tech/ Govt. A.E.E/ ట్రాన్స్‌కో/75,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-13802]

యాదవ/B.Tech/ C. Govt. క్లర్క్/SBI/ 40,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-13802]

రెడ్డి/విడో/45/5'7"/MBA/ సొంత బిజినెస్, కోట్ల ఆస్తి గల అందమైన రెడ్డి ఒంటరి వధువుకు తగిన వరుడు కావలెను. వాట్సప్: 9030129988 [HA-13802]

రెడ్డి/45yr/5'5"/కుల పట్టింపులేదు/MA, B.Ed/ Govt. ఎంప్లాయి 85K (PM) వెల్‌సెటిల్డ్, బిజినెస్ & 2 సొంత ఇల్లులు & ల్యాండ్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok). సంప్ర: 8008474869 [H-792585]

పద్మశాలి/కుల పట్టింపులేదు/45/5'4"/ విడో/D.R.D.O ఎంప్లాయి/ సొంత ఇల్లు/ 12 ఎకరాల పొలం గల వెల్‌సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 7842875828 [H-792585]

పద్మశాలి/30y/5'4"/ MBA/ SWE, Hyd, విప్రో, 60 వేలు జీతం, డైవర్సీ వధువుకు తగిన వరుడు కావలెను. (CNB). Cont: 8978799956 [HA-89859]

Andhra Sunni Muslim Girl, 29y/ 5'4"/Fair/ M.Tech, Widow with girl child 3y seeks B.Tech/ M.Tech Boy working in Hyderabad below 39y. Ph: 7337047741 [HA-89835]

★★

రజక/43/5'5"/ B.Sc Comp., 10L PA, Director of MNC (M.H) లేట్ మ్యారేజ్ ఫ్యామిలీ వధువుకు Software & High Profiles కి చెందిన స్థిరపడిన బాదరబందీలేని వరుడు కావలెను. Ph: 9573943211, 9346929647 [HA-13805]

రెడ్డి డైవర్సీ CNB 26Yrs/5'.4"/ Fair/ B.Tech/ Infosys, B'lore/8 Lacks P.A/ 3Cr Property వధువుకు వరుడు కావలెను. Fairlinks Matrimony, 9394466117. [T-734]

కమ్మ 25Yrs/5'.4"/ Fair/ B.Tech/IBM, Hyd/ 20Lacks P.A/ 10Cr Property వధువుకు వరుడు కావలెను. Fairlinks Matrimony, VJA, 9299992602. [T-734]

CNB 28Yrs/5'.5"/Fair/M.Sc,Ph.D, BITS/ MNC, Hyd/ 12Lacks P.A/4Cr Property వధువుకు వరుడు కావలెను. Fairlinks Matrimony, TPT, 9394466118. [T-734]

క్రైస్తవ/మాల/ప్రభుత్వ టీచర్/B.Sc.,B.Ed./41/ 5'2"/Fair/ డైవర్సీ వధువుకు క్రైస్తవ వరుడు కావలెను. తూ॥గో॥/ప॥గో॥ వారికి ప్రాముఖ్యత/ వారి బయోడేటా/ఫోటోతో వాట్సాప్ 99897 70090 నకు పంపగలరు. నో ఫోన్ కాల్స్. [R-388]

కాపు, వధువు డిగ్రీ 27 సం॥ & కాపు ద్వితీయ వివాహ వధువు, డిగ్రీ, 28 సం॥ వారికి OC, BC, కులములో PVT జాబ్, బిజినెస్, వరులు కావలెను. సంప్ర॥ 90103 22474 [R-907]

Direct. Konaseema Kapu, 32, 5'4", BA seeks tall educated rich husband below 50. Ph: 9113679022 [WB-50521]

వేదికలు



40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS / IPS / MBBS / MD /MCA/Abroad & Govt Job Holders సంప్ర: శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182 [H-792568]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13158]

మాల, మాదిగ : IAS, IPS, IRS, IRTS, IES, Group-I, II, Bank P.O, USA, UK, SWE, B.Tech (IIT), MBA (IIM), Govt. Officer, MBBS, MD. Cont. Cell : 73969 15712. [M-8470]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పెళ్లి/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాలకాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-793251]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజెస్. 9949395407 [H-787368]

క్రైస్తవ వివాహ వేదిక: www.indiachristianmatrimony.com 10,000 మంది ప్రొఫైల్స్ అందుబాటులో కలవు 29.01.2023 2 pm-6 pm మహబూబ్‌నగర్- హైదరాబాద్. Ph: 8885073555, 8885410555 [H-793264]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Tharun, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13801]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Tharun, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13801]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Tharun, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13801]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13801]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13801]

1st, 2nd, లేట్ అన్ని కులాల పెళ్లి సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్, Govt & బ్యాంక్ ఆఫీసర్స్ సంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్. శ్రీ నిత్య మ్యారేజ్ బ్యూరో, Ph: 8500427582 [H-792585]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

అబ్రాడ్ & ఇండియాలో ఉన్నవారికి డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బిజినెస్, గ్రూప్ 1,2 ఆఫీసర్లు వ్యక్తిగత శ్రద్ధతో తొందరగా పెళ్లి సంబంధాలు కుదర్చబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-424]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com & 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-792963]

Fixmarry. Perfect Matches Dr./ Engr/Any Profnl. 1st / 2nd Reddy Only Quick Services Inida/ USA. Ph: 8333823322 / 8333813311 [H-793456]

★

Free Registration/బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatapp) [HA-830]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యావైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsp No.) [HA-863]

మహబూబ్‌నగర్‌లో మాదిగ వివాహ పరిచయ వేదిక. 29/1/23 ఆదివారం 10-6PM ఫీ 1 వేయి ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. Ph: 9347046175 [H-793265]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

S.N.Reddy VIP Matches. REG. Free For Ladies Rich & Normal Families. REG. Only Gents 50 Girls Booklet Free. Ph: 7075707355, 8639985548 [HA-13803]

★★

మాల (క్రైస్తవ, హిందూ), M.Tech, M.S., MBA, MCA, M.B.B.S. చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్స్ చేస్తున్న వధూవరుల కొరకు kalyanamala.org & 9440545049 [B-1197876]

Olive Christian Metrimony క్రైస్తవ వధూ వరులకు వివాహ సంబంధములు చూడబడును. సంప్రదించండి. 90149 07660, 82474 60680. [B-762869]

మీ జీవితాంతం తోడుంటారనుకున్న మీ జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. మీ జీవితంలో వెలుగులు నింపడానికై 1వ, 2వ అన్ని కులాల వివాహ సంబంధాలకై సంప్ర॥ 8341220970 [K-1232926]

'ఉపాధి'కి గడ్డు రోజులు?

పథకంలో భారీగా మార్పులు జరిగే అవకాశం

- రాష్ట్రాలకు నిధులు తగ్గిపోయే చాన్స్!
- 2023–24 బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గొచ్చంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. వివిధ రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలున్న చోట్ల ఈ పథకం సరిగా అమలు కావడం లేదని, చేపట్టిన పనులు సరిగా లేవని, నిధులు పక్కదారి పట్టడమో లేక వినియోగం సరిగా లేకపోవడమో జరుగుతోందన్న అభిప్రాయంతో కేంద్రం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాల్లో పటిష్ట అమలు ద్వారా నిర్దేశిత లక్ష్యాల సాధన, కచ్చితమైన ప్రయోజనం కలిగేలా చేయాలన్న ఆలోచనతో ఆయా రాష్ట్రాల్లో పరిశీలనకు ఓ టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం నియమించింది. తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం పూర్తి చేసిన టాస్క్‌ఫోర్స్ ప్రధానమంత్రి కార్యాలయానికి నివేదిక సమర్పించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో భారీగా మార్పులు జరగొచ్చునని, తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు చేసే బడ్జెట్ కేటాయింపులు కూడా తగ్గొచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పథకానికి గడ్డురోజులు తప్పవనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికి నిధులు తగ్గిపోతాయా?

కేంద్రం రాష్ట్రానికి రెండేళ్ల క్రితం చేసిన కేటాయింపులతో పోల్చితే 2023–24 బడ్జెట్‌లో అధిక కేటాయింపులు ఉండక పోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు.. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా లైవ్ లొకేషన్‌లో హాజరు నమోదును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తప్పనిసరి చేసింది. దీంతో పాటు కూలీలు, వారి కుటుంబాల జాబ్ కార్డులను వారి వారి ఆధార్ నంబర్లతో అథెంటికేషన్ చేయాలని ఆదేశించింది. లేనిపక్షంలో చేసిన పనికి కూలీ మొత్తం బ్యాంక్ ఖాతాల్లో పడే అవకాశం లేదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు నమోదు క్షేత్రస్థాయిలో ఇబ్బందులెదురవుతున్నాయి. కూలీల జాబ్ కార్డులతో ఆధార్ అథెంటికేషన్ పూర్తికాలేదు. దీంతో నిధులు తగ్గే అవకాశం ఉందంటున్నారు.

క్రమంగా తగ్గిపోతున్న కేటాయింపులు..

దేశవ్యాప్తంగా 2022 ఏప్రిల్–డిసెంబర్‌ల మధ్య 5.56 కోట్ల కుటుంబాలు ఈ పథకం కింద పనులు కోరాయి. అంతకుముందు ఏడాది అవే నెలలతో పోల్చితే కోటి కుటుంబాల మేర తగ్గుదల నమోదైంది. ఈ నేపథ్యంలోనే 2023–24 బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయనేది చర్చనీయాంశమైంది. 2019–20లో రూ.71,687 కోట్లు కేటాయించారు. కానీ కరోనా మహమ్మారి పరిస్థితుల నేపథ్యంలో 2020–21లో రూ.1.11 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించారు. కానీ 2021–22కు వచ్చేసరికి రూ.98 వేల కోట్లకు, 2022–23లో రూ.73 వేల కోట్లకు దిగజారింది. ఈ నిధులు సరిపోకపోవడంతో సప్లిమెంటరీ గ్రాంట్ల కోసం గత డిసెంబర్‌లో కేంద్రానికి విజ్ఞప్తులు వెళ్లాయి. ఈ పరిస్థితుల్లోనే 2023–24 బడ్జెట్ పెరుగుతుందా లేదా అన్న సందిగ్ధత నెలకొంది.



తగ్గించే అవకాశమే ఉంది..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ పథకం కింద చేసే ఖర్చును కేంద్రం తగ్గించింది. అందువల్ల వచ్చే ఆర్థిక ఏడాదిలో ఈ పథకానికి చావా రేవా? అన్న సమస్య ఉత్పన్నం కావొచ్చు. ఎన్‌ఎంఎంఎస్ యాప్ అమల్లోకి తీసుకురావడం, జాబ్‌కార్డులతో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి వంటి వాటితో కూలీలు ఈ పథకం నుంచి దూరమవుతున్నారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద వ్యయం తక్కువైనందున, దానిని సాకుగా చూపి బడ్జెట్ కేటాయింపులు తగ్గించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ఈ పథకం కింద 2021–22లో రూ.4 వేల కోట్లు ఖర్చు కాగా, 2022–23లో రూ.2,087 కోట్ల వ్యయమే చేశారు. ఈ నేపథ్యంలో వివిధ పనుల కోసం ఇవ్వాల్సిన రూ.1,100 కోటను కూడా నిలిపేసింది. వచ్చే బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు ఎలా ఉంటాయో నన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– చక్రధర్ బుద్ధా, డైరెక్టర్, లిబ్‌టెక్ ఇండియా

దసరా నాటికి వరంగల్ హెల్త్‌సిటీ పూర్తి!

- కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తిగా శరవేగంగా నిర్మిస్తున్నాం: హరీశ్‌రావు
- దేశానికే మోడల్‌గా నిలిచేలా చర్యలు చేపట్టాం
- ప్రజలకు మంచి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడి
- ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



ప్లాస్టింగ్ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సాక్షి, వరంగల్: కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తితో వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శరవేగంగా నిర్మిస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. ఇది వరంగల్ నగరానికే కాకుండా.. ఉత్తర తెలంగాణలో రోగుల అవసరాలు తీర్చేలా, దేశానికే ఒక మోడల్‌లా నిలిచేలా ఉంటుందని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. వరంగల్‌లో రూ.1,100 కోట్ల అంచనాతో చేపట్టిన 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ పనులను మంత్రి హరీశ్‌రావు శనివారం పరిశీలించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. ''కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగినంత వేగంగా వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ నిర్మాణం పూర్తి చేస్తాం. దీనిపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. రాష్ట్రంలో ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో ఉంది. హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానాల మాదిరిగానే గ్రామాల్లోనూ పల్లె దవాఖానాల సేవలు అందుబాటులోకి తెస్తున్నాం. మేం తీసుకున్న చర్యలతో ప్రజలు సర్కారీ దవాఖానాలవైపు చూస్తున్నారు. ఆస్పత్రుల్లో వసతుల కల్పన, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటివే దీనికి కారణం'' అని హరీశ్‌రావు చెప్పారు.

అవయవ మార్పిడి చికిత్సలు కూడా..

వరంగల్ ఆస్పత్రిలో 35 స్పెషాలిటీ సేవలను అందుబాటులో తీసుకొచ్చేలా నిర్మాణం జరుగుతోందని.. కిడ్నీ, లివర్ అవయవ మార్పిడి కూడా వరంగల్‌లో జరగనుందని హరీశ్‌రావు ప్రకటించారు. కిడ్నీ, లివర్, హార్ట్, లంగ్స్ మార్పిడి కోసం అధునాతన పరికరాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు చాలావరకు జరిగాయని.. సీఎంతో మాట్లాడిన తర్వాత చిన్నపాటి మార్పుల వల్ల ఏరియా పెరిగిందని వివరించారు. 2 వేల పడకలను 2,250 పడకలకు పెంచామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ గోపి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన హిందూత్వవాది సీఎం కేసీఆర్: హరీశ్‌రావు

పర్వతగిరి: సీఎం కేసీఆర్ నిజమైన హిందూత్వవాది అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని శివాలయాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. అణువణువునా హిందూత్వం నాటుకుపోయిన వ్యక్తి తెలంగాణలో సీఎం కేసీఆర్ ఒక్కరేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే యాదాద్రి క్షేత్రాన్ని వేలకోట్లతో అధునాతన హంగులతో నిర్మించారని చెప్పారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg.No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

MARUTI SUZUKI

NEXA

THEY TELL MANY TALES ABOUT THE JIMNY.

Some speak of a Jimny that once climbed the 5 highest peaks of Africa, including Mt. Kilimanjaro. Others talk about a Jimny that once rescued a newborn baby in Madrid's worst snowstorm. Some even say that a Jimny helped archaeologists dig up 900,000 years of history at The Pit of Bones. There are many such legends about this off-roader. **All true.**

What stories will they tell about you?

BOOKINGS OPEN

Jimny


INSPIRED BY

#TRUESTORIES





ALLGRIP PRO



3 LINK RIGID AXLE SUSPENSION



HEADLAMP WASHERS



6 AIRBAGS



WIRELESS ANDROID AND APPLE CARPLAY CONNECTIVITY

Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
www.nexaexperience.com
NOW YOU CAN ALSO BOOK ONLINE

HYDERABAD: NEXA BANJARA HILLS (VARUN MOTORS PH: 04067263433), **NEXA JUBLIEE** (RKS MOTORS PH: 04066588489), **NEXA LB NAGAR** (KALYANI MOTORS PH: 04071326633), **NEXA MUSHEERABAD** (THE MITHRA AGENCIES PH: 04067263455), **NEXA RAIDURGAM** (PAVAN MOTORS PVT. LTD. PH: 04071327134), **NEXA LUMBINI PARK** (RKS MOTORS PH: 04067263307), **NEXA MALAKPET** (GEM MOTORS INDIA PVT LTD PH: 04067337058), **NEXA KUKATPALLY** (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 04071326576), **NEXA GACHIBOWLI** (JAYABHERI AUTOMOTIVE PH: 04067263427), **NEXA QCITY ROAD** (SAI SERVICE PVT LTD PH: 04066588133), **BEGUMPET: NEXA BEGUMPET** (VARUN MOTORS PH: 040-71327598), **ATTAPUR: NEXA ATTAPUR** (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9966666685), **MIYAPUR: NEXA MIYAPUR** (JAYABHERI AUTOMOTIVE PH. 9100053502), **SECUNDERABAD: NEXA BOWENPALLY** (AUTOFIN LIMITED PH: 04071326637), **NEXA SAINIKPURI** (VARUN MOTORS PH: 04071326630).

Scan to book